Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



కడప KADAPA | సంపుటి : 03 | సంచిక : 44 | శనివారం | నవంబర్ 14, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 03 | Issue No : 44 | Saturday | 14 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

ఏపీ ప్రభుత్వంతో దిగ్గజ కంపెనీల
ఒప్పందాలు

సీఐఐ సదస్సు రెండో రోజు సీఎం సమక్షంలో 12 ఎంఓయూలు

- జేఎస్‌డబ్ల్యూ, ఇండియన్ ఆయిల్, ఎయిర్ ట్రంక్-జేసీకే ఇన్ ఫ్రా కంపెనీల ఒప్పందాలు
- ప్రతిష్టాత్మక పీ4 కార్యక్రమానికి చేయూతగా ఐటీసీ, హీరో మోటార్స్ కార్ప్
- ఐటీసీ, హీరో మోటార్స్ కార్పొరేషన్ సంస్థలకు సీఎం చంద్రబాబు అభినందనలు

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖ :

సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండో రోజూ దిగ్గజ కంపెనీలు ఏపీ ప్రభుత్వంతో పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నాయి. జేఎస్‌డబ్ల్యూ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గ్రీన్ జెన్, ఎయిర్ ట్రంక్- జేసీకే ఇన్ ఫ్రా, డిక్సన్ టెక్నాలజీస్, కాకినాడ సీపోర్ట్స్ లాంటి ప్రముఖ సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వివిధ ప్రభుత్వ శాఖలతో ఒప్పందాలు చేసుకున్నాయి. అలాగే తొలిసారి పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములుగా మారుతూ ఐటీసీ, హీరోమోటార్స్ కార్పొరేషన్ ఒప్పందం చేసుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రూ.1,41,585 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 12 ఒప్పందాలను వివిధ కంపెనీలు చేసుకున్నాయి.



ఈ ప్రతిపాదిత పెట్టుబడుల ద్వారా 10,919 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ప్రకాశం జిల్లా కందుకూరులో మైనింగ్ కార్యకలాపాల కోసం జిందాల్ గ్రూప్ రూ.15 వేలకోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ పెట్టుబడి ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. తిరుపతి జిల్లాలో ఆర్బిటల్ డేటా సెంటర్, రాకెట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వంతో అగ్నికుల్ కాస్మోస్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. రూ.510 కోట్ల పెట్టుబడితో 350 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో రూ.250 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు హార్బర్ రాకెట్ ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది.

2 లో

దేశాభివృద్ధికి పోర్టులు చాలా ముఖ్యం

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖ : దేశాభివృద్ధికి పోర్టులు చాలా ముఖ్యమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. విశాఖలో రెండో రోజు జరుగుతున్న సిఐఐ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ ... సుదీర్ఘ తీర ప్రాంతం, పోర్టులు ఉండటం ఎపి కి చాలా ఉపయోగం అని అన్నారు. రాష్ట్రంలోని అనేక పోర్టులను మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైవేలు, గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు.. ఎపి కి ఎంతో ఉపయోగంగా ఉన్నాయని తెలిపారు. ఎగుమతులు, దిగుమతుల అభివృద్ధికి లాజిస్టిక్స్ ఖర్చు బాగా తగ్గాలన్నారు.



2 పేజీలో..



అల్పపీడనం - వాయుగుండంగా మారే అవకాశం !

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. ఇది క్రమంగా బలపడుతూ వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే సముద్రంలో గాలుల వేగం పెరిగే సూచనలు ఉండటంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో

- మిగతా 2లో..

నా ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడి తన మొబైల్‌ను ట్యాప్ చేయిస్తున్నారని.. దీనికి సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా శుక్రవారం నిర్వహించిన 'ఆస్క్ మి' కార్యక్రమంలో రాహుల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.



తన ఫోన్‌ను పైకి ఎత్తి చూపిస్తూ.. ట్యాపింగ్ జరిగినట్లు ఇందులో ఆధారాలు ఉన్నాయని చెప్పారు. తనపై నిఘా ఉన్న విషయం ప్రధాని మోడి కి తెలుసు అని పేర్కొన్నారు. మోడి తనతో ముఖాముఖి చర్చకు

2 పేజీలో..



'కియా' విస్తరణతో అభివృద్ధి, ఉద్యోగాలు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : విశాఖ సీఐఐ సమ్మిట్ సందర్భంగా కూటమి ప్రభుత్వంతో కియా ప్లాంట్ విస్తరణ ఒప్పందం చేసుకోవడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. కార్ల పరిశ్రమ విస్తరణ ఒప్పందంతో పెనుకొండ పట్టణం సహా చుట్ట పక్కలప్రాంతాలు అభివృద్ధి చెందడమే

- మిగతా 2లో..

మంత్రి లోకేష్ సమక్షంలో రెండో రోజూ
పెట్టుబడుల వరద

- రూ.1,05,634 కోట్ల విలువైన 24 అవగాహనా ఒప్పందాలు
- ఈ ఒప్పందాల ద్వారా యువతకు 75,055 ఉద్యోగావకాశాలు

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖలో జరుగుతున్న సిఐఐ 31వ భాగస్వామ్య సదస్సు రెండోరోజు కూడా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో 24 కంపెనీలు రూ.1,05,634 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు 75,055 ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి.



ఏరో స్పేస్, ఐటి ఉ ఎలక్ట్రానిక్స్, డాటా సెంటర్స్, సెమీ కండక్టర్స్, హెల్త్ కేర్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఎఎం ఎఐ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.31,387 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఎఐ డాటా సెంటర్, పంచశీల్ రియాల్టీ – రూ.37,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

ఏపీలో తొలి దశ గ్రామ పంచాయతీ
ఎన్నికలు..

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఈసీ
- నవంబర్ 15 నుంచి 17 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ
- నవంబర్ 26న పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు
- షెడ్యూల్ విడుదలతో గ్రామాల్లో వేడెక్కిన రాజకీయ వాతావరణం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రంలో తొలి విడత ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రకటనతో పల్లెల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.



సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. తొలి విడత ఎన్నికల ప్రక్రియ నవంబర్ 15న నామినేషన్ల స్వీకరణతో ప్రారంభం కానుంది. అభ్యర్థులు నవంబర్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తమ నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చు.

2 లో

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
రూ.6,400 కోట్లు దాటాయి



విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వానికి శ్రద్ధ ఏదీ?

- వంద రోజుల్లో బకాయిలు చెల్లిస్తామన్న హామీ ఏమైంది?
- కాలేజీల్లో నిలిచిపోతున్న విద్యార్థుల సర్టిఫికెట్లు
- పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి: వైఎస్ షర్మిల

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై కూటమి ప్రభుత్వాన్ని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నిర్వీర్యమవుతోందని ఆరోపించారు.

2 లో..



అస్సాంలో ఘోర ప్రమాదం..

- 23 మంది మృతి

ప్రజాభూమి ప్రతినిధి, గువహటి : అస్సాంలో ఘోర ప్రమాదం జరిగింది. కజిరంగా నేషనల్ పార్క్ సమీపంలో శుక్రవారం మినీ బస్సు, కంటైనర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 23 మంది మరణించగా, మరో 20మందికి గాయాలైనట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

- మిగతా 2లో..

మార్కెట్లలో మళ్లీ అమ్మకాల సెగ..



- సెన్సెక్స్ 318 పాయింట్లు డౌన్
- మూడు రోజుల లాభాల తర్వాత దేశీయ మార్కెట్లకు నష్టాలు
- సెన్సెక్స్ 318.56 పాయింట్లు, నిఫ్టీ 155.05 పాయింట్లు పతనం
- బ్యాంకింగ్, రియల్టీ, ఆటో, సిమెంట్ షేర్లలో అమ్మకాలు
- ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెంపు భయాలతో మదుపర్లు అప్రమత్తం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో మూడు రోజుల వరుస లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, రియల్టీ, మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను నష్టాల్లోకి నెట్టింది. ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న ఆందోళనలు, వడ్డీ రేట్లు మరింత పెరిగే అవకాశాలు మదుపర్లలో అప్రమత్తతను పెంచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 318.56 పాయింట్లు (0.39 శాతం) నష్టపోయి 81,592.45 వద్ద స్థిరపడింది.

2 పేజీలో..

ప్రజాభూమి

శనివారం, నవంబర్ 14, 2026

సంపాదకీయం

ఓట్ల లెక్కల్లో తేడాలు..

భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికల విశ్వసనీయతకు పునాది పారదర్శకత. దానికి నిట్టనిలువునా పాతర వేసి, ఏకపక్షంగా వ్యవహరించే ధోరణికి బిజెపి ప్రభుత్వం తలుపులు తెరిచింది. ఎన్నికల కమిషనర్ల నియామకం మొదలుకొని ఎన్నికల నిర్వహణ దాకా అడ్డగోలుగా సాగుతోంది. దరిమిలా నిష్పాక్షికంగా ఉండాల్సిన ఎన్నికల సంఘం కూడా అధికార పార్టీ కనుసన్నల్లో నడుస్తుందని చెప్పటానికి అనేక ఉదాహరణలూ, ఉదంతాలూ ఉన్నాయి. వీటిపై ఇప్పటికే తీవ్ర ఆందోళనలు సాగుతుండగా, తాజాగా 'రిపోర్టర్స్ కలెక్టివ్' వెల్లడించిన పరిశోధన ఎన్నికల నిర్వహణలో లోపాలను, అవకతవకలను మరింతగా బట్టబయలు చేసింది. ఎన్నికల సంఘం ఈ స్థాయిలో అపనమ్మకాన్ని, అధికార పక్షపాతాన్ని, బాధ్యతారాహిత్యాన్ని మూట కట్టుకోవటం స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇంతకు ముందు ఎన్నడూ లేదు. ప్రజల ఓట్లు సక్రమంగా నమోదయ్యాయా? పోలైన ఓట్లన్నీ లెక్కలోకి వచ్చాయా? పోలింగ్ నుంచి ఫలితాల ప్రకటన వరకు నిబంధనలు పాటించారా? అనే ప్రశ్నలకు ఎన్నికల సంఘం ఆధారాలతో సమాధానం చెప్పగలగాలి. కానీ, ఎన్నికల నిర్వహణలో కీలకమైన రికార్డులను సరిగా నిర్వహించలేకపోవడం, వాటిలో తేడాలు బయటపడితే వివరణ ఇవ్వకుండా సమాచారాన్ని దాచిపెట్టటం ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. 'రిపోర్టర్స్ కలెక్టివ్' 2024 ఎన్నికలకు సంబంధించి మహారాష్ట్ర, హర్యానా, జమ్మూ-కశ్మీర్‌లలోని 530 లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నివేదికలను పరిశీలించింది. 4,212 భౌతిక రికార్డులను డిజిటలైజ్ చేసి విశ్లేషించింది. ఈ పరిశోధనలో 51 నియోజకవర్గాల్లో ఓట్ల నమోదు, లెక్కింపునకు సంబంధించిన వ్యత్యాసాలు బయటపడ్డాయి. వీటిలో 19 నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల సంఖ్య నమోదు చేయాల్సిన చోట అధికారులు సున్నా లేదా నిల్ అని రాశారు. మరో 32 నియోజకవర్గాల్లో నమోదైన ఓట్లకు, ఈవీఎంలలో లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసాలు కనిపించాయి. వీటికి కారణాలేమిటో, ఎలా పరిష్కరించారో ఎక్కడా నమోదు చేయలేదు. సాధారణంగా పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన ఓటరు వివరాలను ఫారం 17ఎ లో నమోదు చేస్తారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలో నమోదైన ఓట్ల వివరాలను ఫారం 17సి లో పొందువ రుస్తారు. ఈ రెండు రికార్డుల్లోనూ సంఖ్య సమానంగా ఉండాలి. తేడాలు ఉంటే అందుకు కారణాలను నిర్ధారించడం అధికారుల బాధ్యత. కానీ, ఆ 51 నియోజకవర్గాల్లో అలాంటి చర్యలేవీ లేకపోవడం ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నార్థకం చేస్తోంది. హర్యానాలోని బద్వల్ లోక్‌సభ నియోజకవర్గం లో 3.32 లక్షల ఓట్లు పోలైనట్లు అంతర్గత రికార్డుల్లో నమోదు కాగా, ఈవీఎంలో నమోదైనవి 1.60 లక్షలేనని 'రిపోర్టర్స్ కలెక్టివ్' పేర్కొంది. ముంబై నార్త్‌లోనూ 18.11 లక్షల ఓట్లు పోలైనట్లు రికార్డుల్లో ఉండగా, ఈవీఎంలో నమోదైనవి 10.33 లక్షలేనని వెల్లడించింది. అయితే ఈ రెండు చోట్లా మొత్తం ఓటర్ల సంఖ్యను పారపాటున ఓటు వేసినవారి సంఖ్యగా నమోదు చేశారని అధికారులు వివరణ ఇచ్చారు. ఇంత తీవ్రమైన పారపాట్లు ఎలా చోటుచేసుకున్నాయి? వాటిని పరిశీలించాల్సిన యంత్రాంగం ఏం చేసింది? అన్న ప్రశ్నలకు సమాధానాలు లేవు. హర్యానాలోని కైతాల్‌లో 215 మంది మాత్రమే ఓటు వేసినట్లు రికార్డులో ఉండగా, ఈవీఎంలో 1,67,285 ఓట్లు లెక్కించినట్లుగా ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల వరకు పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల వివరాలను ఎన్నికల సంఘం బహిరంగపరిచేది. ఆ తర్వాత ఈ విధానాన్ని నిలిపివేసింది. 2024 ఎన్నికల సందర్భంగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) ఫారం 17సి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరగా, ఎన్నికల సంఘం నిరాకరించింది. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు తప్ప ఇతరులకు అందించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టులో వాదించింది. ఓటు హక్కు వినియోగం, దాని లెక్కింపు ప్రజలకు సంబంధించిన అంశమైనప్పుడు ఆ వివరాలు వారికి ఎందుకు తెలియకూడదో అర్థం కాదు. ఈ దాపరికానికి కేంద్రంలోని మోడీ--షా ప్రభుత్వ చర్యలు మరింత బలం చేకూర్చాయి. 2024 డిసెంబర్ 20న కేంద్ర న్యాయశాఖ ఎన్నికల నిర్వహణ నిబంధనల్లోని రూల్ 93(2)(ఎ)ను సవరించింది. గతంలో ప్రజలు పరిశీలించేందుకు వీలుగా ఉన్న ఎన్నికల పత్రాల పరిధిని కుదించింది. ఎన్నికల ప్రక్రియపై ప్రజల పర్యవేక్షణకు అవకాశం కల్పించాల్సిన సమయంలో, సమాచారాన్ని పరిశీలించే పరిధినే పరిమితం చేయడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల పేర్ల తొలగింపులు, పోలింగ్ శాతం వివరాల ప్రకటనలో జాప్యం వంటి అంశాలపై ఇప్పటికే అనేక అనుమానాలూ, విమర్శలూ, ఫిర్యాదులూ ఉన్నాయి. ఎన్నికల సంఘానికి ఉన్న స్వతంత్రత, అధికారాలు ప్రజల విశ్వాసాన్ని కాపాడటానికే తప్ప, తన పనితీరును ప్రజల ప్రశ్నలకు అతీతంగా ఉంచడానికి కాదు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు పాతర వేయటానికి కారణంగా మోడీ--షా వైపు దేశయువత చూస్తోంది. ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. రిటర్నింగ్ అధికారుల నివేదికలు, పోలింగ్ కేంద్రాల ఫారం 17ఎ, ఫారం 17సి వివరాలను అందుబాటులో ఉంచాలి. తమ ఓటు ఎలా నమోదైంది, ఎలా లెక్కించబడిందో తెలుసుకోవడం ప్రజల హక్కు. ఓటు విలువను, ప్రాధాన్యాన్ని కాపాడాల్సిన సంస్థ తన పనితీరుపై ప్రజలకు అపనమ్మకం కలిగించే స్థితికి చేరడం విచారకరం, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.

ఏపీ ప్రభుత్వంతో దిగ్గజ కంపెనీల ఒప్పందాలు

పునరుద్పాక ఇంధన రంగంలో గ్రీన్ జెన్ రెన్యూబుల్ ఎనర్జీ రూ.8 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఏపీనెడ్ క్యాప్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ రంగంలోనే రూ.6,600 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు గానూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా ఒప్పందం చేసుకుంది. డేటా సెంటర్ క్యాంపస్‌ల ఏర్పాటు, 1400 మెగావాట్ల టెలికామ్ సెంటర్ల ఏర్పాటు కోసం ఐటీ విభాగంతో ఎయిర్ ట్రంక్ ఇండియా– జేసికే ఇన్‌ఫ్రా ఒప్పందం చేసుకుంది. రూ.1,03,018 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో 3,120 మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఎయిర్ ట్రంక్– జేసీకే ఇన్ ఫ్రా సంస్థలు ఒప్పందంలో పేర్కొన్నాయి. డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా రూ.700 కోట్ల పెట్టుబడితో 2,300 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఇక కాకినాడ పోర్టులో మెకనైజ్డ్ బెర్త్, రీగ్యాసిఫికేషన్ ప్లాంట్, షిప్ బిల్డింగ్, రిపేర్ కాంప్లెక్సు ఏర్పాటు కోసం ఏపీ మారిటైమ్ బోర్డుతో కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. రూ.6452 కోట్ల పెట్టుబడితో మెకనైజ్డ్ బెర్త్, రీగ్యాసిఫికేషన్ యూనిట్ ఏర్పాటు చేయటుతో 852 మందికి ఉద్యోగాలను కల్పించాలని నిర్ణయించినట్టు వెల్లడించింది. రాజధాని అమరావతిలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటు కోసం ఏపీసీఆర్‌డీఏ ఈఐహెచ్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. రూ.175 కోట్ల పెట్టుబడితో, 150 మందికి ఉద్యోగాల కల్పించనున్నట్టు తెలిపింది.

పీ4కు చేయూతగా ఒప్పందాలు : రాష్ట్రంలో అమలు చేస్తోన్న ప్రతిష్టాత్మక పీ4 కార్యక్రమానికి సంబంధించి సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండు ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాల్లో 1,120 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు హీరో మోటార్ కార్పొరేషన్‌తో స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ఒప్పందం చేసుకుంది. 10వ తరగతి చదివి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు రూ.2.9 లక్షల చొప్పున స్కాలర్‌షిప్ అందించేలా హీరో మోటార్స్ కార్పొరేషన్ ఈ ఒప్పందం చేసింది. బ్రిజ్ మోహన్ ముంజాల్ స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందించేందుకు గానూ రూ.32.48 కోట్ల మేర ఆర్థిక సాయం అందించేలా హీరో మోటార్స్ కార్పొరేషన్ ఈ ఒప్పందం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 100 గ్రామాల్లోని 25 వేల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ఐటీసీ లిమిటెడ్ స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ తో ఒప్పందం చేసింది. 25 వేల మంది బంగారు కుటుంబాలకు జీవనోపాధి, జీవన ప్రమాణాలు పెంచేలా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి



సమక్షంలో కుదిరిన 11 ఎంఓయూలు, 1 జీవో జారీ ద్వారా రూ.1,41,585 కోట్ల పెట్టుబడులు, 10,919 మందికి ఉద్యోగాల జరుగనుంది.

ప్రాజెక్టుల గ్రౌండింగ్ ముఖ్యం

ఒప్పందాలు చేసుకోవటంతో పాటు ప్రాజెక్టులు గ్రౌండింగ్‌పై దృష్టి పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టులు గ్రౌండ్ చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. బ్రిజ్ మోహన్ లాల్ ముంజాల్ స్కాలర్‌షిప్ ను 1120 మంది విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించేలా హీరో మోటార్స్ కార్పొరేషన్ ముందుకు రావటం సంతోషదాయకమని అన్నారు. ఐటీసీ కూడా సామాజిక బాధ్యతగా పీ4కు సహకారం అందిస్తున్నందుకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీ లాంటి విద్యా సంస్థలు ముందుకు వచ్చి ఏపీని ప్రయోగశాలగా మార్చుకోవాలని.. పరిశోధనలతో నూతన ఆవిష్కరణలు చేయాలని సీఎం వ్యాఖ్యానించారు. ఏపీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు సామాజిక, ఆర్థిక భద్రత అందించటంలో ముందుందని అన్నారు. యాక్సెస్ టూ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీ దేశంలో రెండో స్థానంలో ఉందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబం హ్యాపీ, హెల్తీ వెల్తీగా ఉండాలన్నదే తన తాపత్రయం అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

అల్పపీడనం - వాయుగుండంగా మారే అవకాశం !

అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ అల్పపీడనం ప్రస్తుతం వాయువ్య దిశగా కదులుతోందని వెల్లడించారు. దీని కదలికలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం నాటికి వాయుగుండంగా మారే అవకాశం ... ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనం శనివారం అదే ప్రాంతంలో సుస్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. అనంతరం ఇది మరింత బలపడి ఆదివారం నాటికి వాయుగుండంగా మారవచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. అయితే ఈ అల్పపీడనం తదుపరి ఎటువైపు ప్రయాణిస్తుంది.. దాని ప్రభావం ఏయే ప్రాంతాలపై ఉంటుంది.. అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందన్నారు. రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులను బట్టి దీనిపై మరింత సమాచారం అందే అవకాశం ఉంది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు ... అల్పపీడనం ప్రభావంతో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో వాతావరణం మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. కొన్ని సందర్భాల్లో గాలుల వేగం గంటకు 60 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించారు. మత్స్యకారులకు హెచ్చరిక ... సముద్రంలో గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు కూడా వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అయితే ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశాలు మాత్రమే ఉన్నాయని, దాని ప్రయాణం, ప్రభావంపై మరింత స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. కాబట్టి దీనిపై వచ్చే అధికారిక వాతావరణ బులెటిన్లను గమనించాలని సూచించారు.

'కియా' విస్తరణతో అభివృద్ధి, ఉద్యోగాలు

కాకుండా 12 వేల మందికి పైగా యువతకు కొత్తగా ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖలో జరుగుతున్న విశాఖ సీఐఐ సమ్మిట్ – 2026కు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. విశాఖ సమ్మిట్ సందర్భంగా తొలిరోజు రూ.5.85 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. రెండో రోజూ కూడా ప్రఖ్యాత గాంచిన సంస్థలు కూటమి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం రూ.11 వేల లక్షల కోట్ల కంటే అదనంగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు.ముఖ్యంగా, పెనుకొండలో ఉన్న కియా కార్ల పరిశ్రమ విస్తరణకు ఆ సంస్థ యాజమాన్యం ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. రూ.17 వేల కోట్లతో రెండు లక్షల కార్ల ఉత్పత్తులే లక్ష్యంగా కియా యాజమాన్యం ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ఒప్పందంతో కొత్తగా 12 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. కియా పరిశ్రమ రాకతో పెనుకొండ రూపురేఖలే మారి పోయాయన్నారు. ఇప్పుడా ప్లాంట్ విస్తరణ పనులు కూడా ప్రారంభమైతే..ఆ సంస్థ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ మరింతగా వచ్చే అవకాశముందన్నారు. దీనివల్ల పెనుకొండ పట్టణంతో పాటు చుట్ట పక్కల గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు వీలుకలుగుతుందన్నారు. గత టీడీపీ



ప్రభుత్వంలో కియా పరిశ్రమ ఏర్పాటయిందని, 13 వేల మందికి పైగా ఉద్యోగాలు లభించాయన్నారు. ఇపుడు కొత్త ఒప్పందం కారణంలో మరో 12 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనుండడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. కియా విస్తరణ పనులకు పచ్చజెండా ఊపిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్, కార్ల పరిశ్రమ యాజమాన్యానికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

రూ.6,400 కోట్లు దాటాయి

వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీనివల్ల పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ హయాంలో పేద కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ పథకం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతోందని విమర్శించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేదవాడి చదువుకు పండుగలా ఉండేదని షర్మిల గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈ పథకం అమలయ్యేదన్నారు. అయితే ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అదే పథకం వేల కోట్ల రూపాయల బకాయిలతో విద్యార్థులకు భారంగా మారిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు దాటిపోయాయని, వాటిలో గత మూడేళ్ల కాలంలోనే రూ.6,000 కోట్లకు పైగా పేరుకుపోయాయని వెల్లడించారు. ఇంత భారీ మొత్తంలో బకాయిలు ఉండటం వల్ల విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను షర్మిల ప్రస్తావించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఫీజు



రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ క్లియర్ చేస్తామని, నిధులను నేరుగా కళాశాలల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలుపై స్పష్టత లేదని విమర్శించారు. విద్యార్థుల చదువులకు సంబంధించిన అంశంలో ఇచ్చిన హామీలను విస్మరించడం సరైన విధానం కాదన్నారు. బకాయిలు పేరుకుపోతున్నా నిధుల విడుదలలో జాప్యం కొనసాగుతుండటంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని షర్మిల పేర్కొన్నారు. బకాయిలు అందకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఫలితంగా ఉన్నత చదువుల కోసం ఇతర విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించే వారికి కూడా సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. విద్యార్థుల చదువు పూర్తయిన తర్వాత కూడా సర్టిఫికెట్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమని అన్నారు.

ఒకవైపు రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, మరోవైపు పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయని షర్మిల విమర్శించారు. పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధితో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థులు ఆర్థిక సమస్యలతో చదువుకు దూరమయ్యే పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

మార్కెట్లలో మళ్లీ

అమ్మకాల సెగ..

ఎన్ఎస్ఈ నిఫ్టీ 155.05 పాయింట్లు (0.61 శాతం) తగ్గి 25,144.30 వద్ద ముగిసింది.



నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ షేర్లు అధికంగా నష్టపోయాయి.మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలూ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.24 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.26 శాతం తగ్గాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ, ఆటో, సిమెంట్ షేర్లలో ఎక్కువ అమ్మకాలు కనిపించాయి. మీడియా రంగం మాత్రం ఇతర రంగాలతో పోలిస్తే తక్కువ నష్టంతో నిలిచింది.దేశీయ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశించిన గరిష్ఠ పరిమితిని దాటడం వడ్డీ రేట్లు ఎక్కువకాలం కఠినంగానే కొనసాగే అవకాశాలను పెంచిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ముడిచమురు ధరలు, రూపాయి మారకం విలువ, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు మార్కెట్ల తదుపరి దిశను నిర్ణయించనున్నాయని పేర్కొన్నారు. రూపాయికి ద్రవ్యోల్బణం ఒకవైపు సవాలుగా మారినా, డిసెంబరులో వడ్డీ రేట్ల పెంపు జరిగితే అమెరికాతో పోలిస్తే భారత్‌లో వడ్డీ రేట్ల ప్రయోజనం పెరిగి కరెన్సీకి మద్దతు లభించవచ్చని నిపుణులు తెలిపారు. గురువారం విదేశీ పెట్టుబడిదారుల నుంచి రూ.7,800 కోట్లకు పైగా నిధులు రావడం కొంత ఊరటనిచ్చిందన్నారు. ముడిచమురు ధరలు మళ్లీ పెరిగితే రూపాయి కోలుకోవడం కష్టమవుతుందని, తగ్గితే 94 స్థాయి నిలబడే అవకాశముందని విశ్లేషించారు. బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, వినియోగ రంగాల కంపెనీలు మెరుగైన ఆర్థిక ఫలితాలు చూపితేనే కొత్త పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

దేశాభివృద్ధికి పోర్టులు

చాలా ముఖ్యం

బెంగళూరు–విజయవాడ కారిడార్‌తో 110 కిలోమీటర్ల దూరం తగ్గిందన్నారు. రాయపూర్–విశాఖ కారిడార్ ప్రాజెక్టు 96 శాతం పూర్తయ్యిందన్నారు. ఇది ఎపి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు ఎంతో మేలు చేస్తుందన్నారు. విశాఖ–మచిలీపట్నం కారిడార్.. ఎపి అభివృద్ధికి కీలకం అని చెప్పారు. భవిష్యత్తులో ఎపి అభివృద్ధిలో పోర్టులే ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. వచ్చే జనవరి నాటికి బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పూర్తవుతుందని ప్రకటించారు. బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్‌వేతో తమిళనాడు, ఎపి, కర్నాటకకు లాభం అని అన్నారు. ఖరగ్‌పూర్–అమరావతి కారిడార్ వస్తే మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం పోర్టులకు మేలు కలుగుతుందని చెప్పారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలను కలిపేందుకు అనేక కారిడార్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అమరావతి చుట్టూ 192 కిలోమీటర్ల రింగ్‌రోడ్డు వస్తోందని ప్రసంగించారు.

నా ఫోన్ ను ట్యాప్ చేయిస్తున్నారు

రావాలని రాహుల్ సవాల్ విసిరారు.

విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరు ఉన్నారో తెలుస్తుందని, దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో ఎవరు పాల్గొన్నారో తెలుస్తుందని రాహుల్ అన్నారు. తనతో చర్చకు వచ్చే ధైర్యం మోడి కి లేదని, ఆయన స్క్రిప్టు చూసి మాట్లాడుతారని ఆరోపించారు. ఎక్కడైనా పర్వాలేదని, టెలిప్రాంప్టర్‌ను తీసుకువచ్చి డిబేట్‌లో పాల్గొనాలని, వారికి నచ్చిన జడ్జీని పెట్టాలని రాహుల్ కోరారు. నిజమైన దేశద్రోహి ఎవరో తెలియాలంటే, చర్చకు రావాల్సిందే అని రాహుల్ సవాల్ విసిరారు. తనతో నేరుగా చర్చలో పాల్గొంటే, ప్రధాని మోడి రాజకీయ కెరీర్ ముగుస్తుందని రాహుల్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రాహుల్ చేసిన ఫోన్ ట్యాపింగ్ వ్యాఖ్యలను బిజెపి తప్పుపట్టింది. కేరళ బిజెపి చీఫ్ రాజీవ్ చంద్రశేఖర్ ఆ వ్యాఖ్యలను ఖండించారు. రాహుల్ తన తలకు వైద్య పరీక్ష చేయించుకోవాలని సూచించారు. రాహుల్ ఫోన్ ఎవరూ ట్యాప్ చేయరు అని, అంత ఆసక్తి ఎవరికి లేదని, ఎవరికైనా ఏదైనా ఇంట్రెస్ట్ ఉంటే, ఆయన బ్రెయిన్ ఎందుకిలా రోజూ అబద్ధం చెబుతుందో తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు.



అస్సాంలో ఘోర ప్రమాదం..

మృతులంతా కాలేజీ విద్యార్థులని, మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారని అన్నారు. వివరాల ప్రకారం.. జాతీయ రహదారి 715పై కొహోరా పరిధిలోని హతికులి టీ ఎస్టేట్ సమీపంలో ఉన్న రంగజన్ వద్ద ప్రయాణికుల మినీ బస్సు ట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా ధ్వంసమైందని, దీంతో మృతుల సంఖ్య భారీగా పెరిగిందని అన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. సహాయక చర్యలు చేపడుతున్నట్లు గోల్‌ఘాట్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ తెలిపారు. అతివేగం, బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అస్సాం పంచాయితీ, గ్రామీణాభివృద్ధి మంత్రి అతుల్ బోరా పేర్కొన్నారు.

ఏపీలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు..

దాఖలైన నామినేషన్లను నవంబర్ 18న అధికారులు పరిశీలిస్తారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అప్పీల్ చేసుకునేందుకు నవంబర్ 19, 20 తేదీల్లో అవకాశం కల్పించారు.నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 21ని తుది గడువుగా నిర్ణయించారు. అదే రోజు సాయంత్రం పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. తొలి విడత పోలింగ్‌ను నవంబర్ 26న నిర్వహిస్తారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. ఏవైనా కారణాలతో పోలింగ్ రద్దయిన కేంద్రాల్లో నవంబర్ 27న రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.



ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శనివారం, నవంబర్ 14, 2026



పట్టణంలో ఘనంగా నిర్వహించిన నాగుల చవితి వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః



నాగులచవితి సంద ర్భం గా శుక్ర వా రం పట్టణం లోని వివిధ ప్రాం తా ల పాము పుట్టల వద్ద హిం దూ, ముస్లిం భక్తులు పా ములకు పాలు పోసి నైవే ద్యాలు సమర్పించి పూజ లు చేసి సంబరాలను ఘనంగా చేసుకు న్నారు. పెడన రోడ్ లోని కోతి బొమ్మ సెంటర్ వద్ద గల పాము పుట్ట వద్ద భక్తులు తెల్లవారుజామునే వేంచేసి పుట్టలో పాలు చలిమిడి చిమ్మిరి పండ్లు కోడిగుడ్లు మొదలైనవి సమర్పించి పూజలు నిర్వహించారు. ఘత్తులబాదు లోని పాము పుట్ట వద్ద భక్తులు వందలాదిమంది వచ్చి పాలు పోసి నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. సుల్తానగరం వద్ద గల పాము పుట్ట వద్ద పాములకు పాలు పోసి పూజలు నిర్వహించి తమ భక్తి ప్రతుత్తులతో చాటుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో పరిసర ప్రాంత హిందూ, ముస్లిం భక్తులు కూడా పాల్గొనటం మతసామరస్యానికి ప్రత్యేక అని పలువురు ప్రశంసించారు.

కృష్ణా వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన ఉపాధి శిక్షణా కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

కృష్ణా విశ్వవిద్యాలయం: కృష్ణ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో గత 30 రోజులుగా బోయింగ్ కంపెనీ సౌజన్యంతో యునెక్స్ ఉన్నతి సంస్థ చే నిర్వహించబడిన ఉద్యోగనియామక, ఉపాధి అవకాశాల శిక్షణా కార్యక్రమం శుక్రవారంక్తో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే రాంజీ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తరచుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల శిక్షణా కార్యక్రమాలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు, దీనిలో భాగంగా లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ లాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కావలసిన తర్ఫీదును ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమం సమన్వయకర్త, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వై కె సుందర కృష్ణ మాట్లాడుతూ ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్ తో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుందన్నారు... తదుపరి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన కంప్యూటర్స్, ఈసీఈ విభాగం నుండి విద్యార్థులచే మాట్లాడించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ రాజీవ్, కేజీవి కృష్ణ, డా. అలీ మీర్జా తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ రాయితీ ధరణి రైస్ ను పేదలు సద్వినియోగం చేసుకోవాలి

- 26 కేజీల బస్తా కేవలం రూ.1300 కే - డీఎస్ఓ శివరాం ప్రసాద్



ప్రజాభూమి, కృష్ణా బ్యూరోః ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ధరణి రైస్ ను పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సరఫరాల అధికారి (డీఎస్ఓ) శివరాం ప్రసాద్ పిలుపునిచ్చారు. పామర్రులోని ధరణి రైస్ అమ్మకం కేంద్రాలను అయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి రైస్ నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. అనంతరం డీఎస్ఓ మాట్లాడుతూ.. "ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ఎంతో శ్రద్ధతో ధరణి రైస్ ను అందిస్తోంది. 26 కేజీల బస్తా కేవలం రూ.1300 కే అందుబాటులో ఉంది. బయట మార్కెట్ లో ఇదే నాణ్యత గల బియ్యం చాలా ఎక్కువ ధరకు లభిస్తుంది. కాబట్టి ప్రతి పేద కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని అన్నారు. ధరణి రైస్ లో సాధారణ బియ్యంలో కంటే ఎక్కువ పోషకాలు ఉన్నాయని ఆయన తెలిపారు.- ఫోలిక్ యాసిడ్: పుష్కలంగా ఉంటుంది - గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు ఎంతో మేలు- ఐరన్ (ఇనుము): రక్తహీనతను తగ్గిస్తుంది- విటమిన్ బి-12: శరీరానికి శక్తిని, నరాలకు బలాన్ని ఇస్తుంది అన్నారు.ఈ రైస్ తినడం వల్ల రక్తహీనత, నీరసం తగ్గి, పేదలకు మంచి పోషకాహారం అందుతుందని, కాబట్టి దీనిపై అపోహలు వద్దు అని డీఎస్ఓ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రం లు ప్రస్తుతం నడిస్తున్నాయన్నారు. ప్రారంభించి 20 రోజులు కాగా నేటి వరకు 673 క్వింటాలు అమ్మకాలు జరిగి నట్లు వివరించారు ఈ తనిఖీలో పామర్రు పిడిఎస్ డిటి వెంక ట రంగారావు, విక్రయ కేంద్రం బొగ్గరపు శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నాగులచవితి సందర్భంగా అన్నదానం..



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః కృష్ణా జిల్లా మచిలీపట్నం నార్త్ మండలం కానూరు గ్రామ పంచాయతి వన్నారు గ్రామంలో శుక్రవారం నాగుల చవితి సందర్భంగా జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చీటికీనేటి అయ్యప్ప, బోలిశెట్టి నాని, గోపు వెంకట రమణ,మోకా రాజు, గోపాల కృష్ణా, ఇవన రామాంజనేయులు, బోలిశెట్టి రంగా,చీటికీనేటి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధమైన రాష్ట్ర ఎన్నికల సంఘం

గుడివాడ, తాడిగడప మున్సిపాలిటీల్లో ఈ నెల 26న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి: కృష్ణా జిల్లాలో పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారంతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఇందులో భాగంగా జిల్లాలోని గుడివాడ, తాడిగడప మున్సిపాలిటీలకు ఈ నెల 26వ తేదీన పోలింగ్, 30వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ హాలులో జిల్లా కలెక్టర్ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

రూ.3 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు అధికారుల పర్యవేక్షణ



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు కరగ్రహారం క్యాంప్‌బెల్‌పేట గ్రామంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న తారు రోడ్డు నిర్మాణ పనులను సంబం ధిత అధికారులు పరిశీలించారు. ఈ ఈ, ఏఈ, ఏడీ అధికారులు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనుల నాణ్యతను సమీక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వల్లభుని నాగూర్ మీరా స్వామి పాల్గొన్నారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

నాగుల చవితి సందర్భంగా మోపిదేవిలో భక్తులకు మజ్జిగ పంపిణీ

సుమారు 2 వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ

సేవా కార్యక్రమంలో పాల్గొన్న కేడీసీసీ బ్యాంక్ అధికారులు



ప్రజాభూమి ప్రతినిధి మోపిదేవి

నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి క్షేత్రానికి విచ్చేసిన భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మోపిదేవి కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంల ఆధ్వర్యంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకంగా మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సల్మా సుల్తానా సయ్యద్, కలెక్షన్ ఆఫీసర్ రాంబాబు స్వయంగా పాల్గొని భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. నాగుల చవితి సందర్భంగా మోపిదేవికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎండ వేడి దృష్టిలో ఉంచుకుని చల్లని మజ్జిగ అందించడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

అదేవిధంగా మోపిదేవి మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ కొల్లి చక్రపాణి జ్ఞాపకార్థం ఆయన అభిమానులు కూడా ప్రత్యేకంగా మజ్జిగ పంపిణీ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు. స్వర్గీయ కొల్లి చక్రపాణి ఆశయాలు, ప్రజలతో ఆయనకున్న అనుబం ధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన జ్ఞాపకార్థం భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్య క్రమాన్ని నిర్వహించడం విశేషం.ఈ రెండు కార్యక్రమాల ద్వారా సుమారు 2,000 మందికి పైగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేసేలా నిర్వాహ కులు ఏర్పాట్లు చేశారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగినంత మజ్జిగను అందు బాటులో ఉంచి, భక్తులకు సేవలందించారు. ఆధ్యాత్మిక వేడు కలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిం చడం ద్వారా సమాజంలో సేవాభావం, మానవ తా విలువలు మరింత పెంపొందుతాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

నాగుల చవితి పర్వదినాన భక్తులకు మజ్జిగ పంపిణీ చేసి సేవా కార్యక్రమంలో భాగస్వాములైన కేడీసీసీ బ్యాంక్ అధికారులు, స్వర్గీయ కొల్లి చక్రపాణి అభిమానులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీ.ఈ.ఓ లు ఉప్పాల రమేష్ బాబు, మునీంద్ర , రంగా బ్యాం కు సిబ్బంది వాసవి, కోటేశ్వరరావు మరియు మోపిదేవి శ్రీనివాస రావు, మోపిదేవి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో నాగుల చవితి వేడుకలు

ప్రత్యేక పూజలు చేసిన ఈఓ శీనా నాయక్ దంపతులు



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ విజయవాడ ఇంద్రకీలాద్రి క్షేత్రం.నాగుల చవితి సందర్భంగాఇంద్రకీలాద్రి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయంలో నాగ పుట్ట వద్ద చవితి పూజా కార్యక్రమములు వైభవంగా జరిగాయి.ఆలయ స్థానాచార్య ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమములు జరుగగా ఆలయ ఈవో వికె శీనా నాయక్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు



కుటుంబ సమేతంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ప్రజాభూమి రీజనల్ రిపోర్టర్ ,కృష్ణా: నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మోపిదేవి క్షేత్రంలో భక్తిభావం వెల్లివిరిసింది. సర్పదేవతల ఆరాధనకు విశేష ప్రాధాన్యత కలిగిన ఈ పవిత్ర పర్వదినాన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శుక్రవారం ఉదయం మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి చేరుకున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన సతీమణి విజయలక్ష్మి దంపతులు, తనయుడు మండలి వెంకట్రామ్, కోడలు సాయి సుప్రియ దంపతులు ఆలయంలోని నాగపుట్ట వద్ద భక్తిశ్రద్ధలతో పాలు పోసి నాగదేవతకు పూజలు సమర్పిం చారు.అనంతరం సుబ్ర హ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. లోకక ల్యాణం, సకల జనుల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. నాగులచవితి పర్వదినాన నాగదేవతను ఆరాధించడం సనాతన సంప్రదాయంలో విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కలిగి ఉందని ఈ సందర్భంగా భక్తులు పేర్కొన్నారు.భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రం నాగులచవితి సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాద్, సూపరింటెండెంట్ మధు తదితర ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే కుటుంబానికి అవసరమైన ఏర్పాట్లు చేసి, దర్శన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.భక్తిపారవశ్యంతో సాగిన ఈ పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది.





కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో అన్నప్రసాద వితరణ

ప్రజాభూమి రీజనల్ రిపోర్టర్,కృష్ణా: గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వ హించారు. ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి గుడ్లవ ల్లేరు రంగ & కో కు చెందిన నాదెండ్ల వెంకట్రావు, సాయి తుల సి దంపతులు, వారి కుమారులు రవికిరణ్, శ్రీనివాస చక్రవర్తి, కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించి భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.అమ్మవారి ఆశీస్సులతో భక్తు లకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమైన కార్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అన్నదానం సకల దానాల్లోకెల్లా మిన్న అని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా ఆధ్యా త్మిక తృప్తి తో పాటు మానవతా విలువలు పెంపొందుతాయని తెలిపారు. దేవస్థానంలో భక్తులకు నిరంతరం ఆధ్యాత్మిక సేవలు, అన్నప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలు దాతల కుటుంబ సభ్యులందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమ వివరాలను దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలియజేశారు.

విక్కుర్తి దంపతులను గజమాలతో సత్కరించిన చల్లపల్లి టీడీపీ నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు, జయలక్ష్మి దంపతులను చల్లపల్లి జెడ్పీటీసీ రావెళ్ల ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో చల్లపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విక్కుర్తి దంపతులకు దుశ్శాలువ కప్పి, గజమాలతో ఘనంగా సత్కరించారు.అవనిగడ్డ మండల జెడ్పీటీసీగా అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిన విక్కుర్తి జయలక్ష్మికి నాయకులు ప్రత్యేకంగా శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వివిధ హోదాలో ఉన్న చల్లపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శనివారం 14 నవంబర్ 2026



అంతా ఒక్క మాట మీద ఉందాం

- మెట్ల రమణబాబు

ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్:

గ్రామమంతా ఐక్యంగా ఉండి మంచి అభ్యర్థిని ఎన్నుకుంటేనే అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కగలమని టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు అన్నారు. అల్లవరం మండలం, కొమ్మరగిరిపట్టణం గ్రామ నేతల సమక్షంలో రాబోయే పంచాయతీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నియమాలకు కట్టుబడి అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిజెపి రాష్ట్ర నాయకులు యాళ్ల దొరబాబు పిలుపునిచ్చారు.

కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు



ప్రజా భూమి, అమలాపురం

ఈనెల నుండి ప్రారంభమయ్యే కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్ర దర్శ నం, శబరిమలై స్పెషల్స్ సర్వీస్లను నడిపేందుకు ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపో నుండి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ ఐ.ప్రేమ్ కుమార్ తెలిపారు. పంచారామ క్షేత్ర స్పెషల్స్ నవంబర్ 15, 22, 29 మరియు డిసెంబర్ 6వ తేదీలలో ప్రతి ఆదివారం అమలాపురంలో రాత్రి 8 గంటలకు బయలుదేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షా రామ, సామర్లకోట దర్శనం పూర్తయిన తరువాత మరుసటి రోజు రాత్రి 8 గంటలకు అమలాపురం చేరుకుంటాయి. బస్సుకు సరిపడా భక్తులు ఉండి,కోరితే ఏ రోజైనా బస్సులు నడుపబడును. అలాగే శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తులకు వారు కోరుకున్న చోట నుండి కోరుకున్న క్షేత్రాలకు తీసుకెళ్ళేందుకు 6 రోజులు,7 రోజులు టూర్ ప్రోగ్రాంలతో స్పెషల్ బస్సులు ఇస్తామన్నారు. పంచారామా, శబరిమలై స్పెషల్స్ కోసం 9959225550, రిజర్వేషన్ 9959225576, 7013868687, 7382909620 , 99088 36444నంబర్లను సంప్రదించాలన్నారు.

మేయర్ రెడ్డి అప్పలనాయుడుకు
బీజేపీ నాయకుల ఘన సన్మానం



ప్రజాభూమి ఏలూరు

నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడును భారతీయ జనతా పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, పెదపాడు జెడ్పీటీసీ చౌటపల్లి విక్రమ్ కిషోర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్నేని లక్ష్మి కృష్ణ ప్రసాద్,చల్లగుళ్ల వెంకట సుధాకర్ ఘనంగా సన్మానించారు.పవర్పేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో మేయర్ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు శాలువాలు కప్పి, పుష్పమాలలు వేసి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి



గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులకు అవసరమైన శిక్షణ అందించినట్లు నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న తెలిపారు. శుక్రవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు నియమితులైన రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధివిధానాలు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల్లో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందస్తు అవగాహనతో విధులు నిర్వర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎంపీడీవో అబ్దుల్ సలాం, డిప్యూటీ ఎంపీడీవో దుర్గారావు మరియు అన్ని గ్రామాల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

ప్రత్తిపాడులో అమానుషం.. రోడ్డు పక్కన పసికందు మృతదేహం

- వీధి కుక్కలు పీక్కుతింటుండగా గుర్తించిన స్థానికులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ప్రజా భూమి,ప్రత్తిపాడు:

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న టీవీఎస్ షోరూమ్ పక్కన గుర్తుతెలియని వ్యక్తులు ఓ పసికందు మృతదేహాన్ని వదిలివెళ్లడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. రోడ్డు పక్కన ఉన్న శిశువు మృతదేహాన్ని వీధి కుక్కలు పీక్కుతింటుండగా గమనించిన స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం



అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మిగిలిన మృతదేహ భాగాలను స్వాధీనం చేసుకుని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అసలు శిశువును అక్కడ వదిలివెళ్లింది ఎవరు? శిశువు మృతికి గల కారణాలేమిటి? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది. ఒక పసికందు మృతదేహాన్ని ఇలా రోడ్డు పక్కన వదిలివెళ్లిన ఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో

దూసుకుపోతున్న పర్వత సత్యవేణి

- దుర్గ కాలనీ, ఎం.డి. పేటలో విస్తృత ప్రచారం.. మహిళల హారతులు, పూలవర్షంతో ఘన స్వాగతం

ప్రజా భూమి, ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరం గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. సర్పంచ్ అభ్యర్థి పర్వత సత్యవేణి శుక్రవారం గ్రామంలోని దుర్గ కాలనీ, ఎం.డి. పేట ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పాల్గొని తన సతీమణి సత్యవేణికి మద్దతుగా ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా పర్వత సత్యవేణి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ, తనను ఆశీర్వదించి సర్పంచ్గా గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారం సందర్భంగా పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చి, పూలు చల్లుతూ ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామ సమగ్ర అభివృద్ధికి సమర్థవంతమైన నాయకత్వం



అవసరమని, పర్వత సత్యవేణి సర్పంచ్గా ఎన్నికైతే గ్రామ అభివృద్ధికి మరింత కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్కు ఉన్న రాజకీయ అనుభవం, ప్రజలతో ఉన్న అనుబంధం గ్రామానికి ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికల్లో పర్వత సత్యవేణికి తమ మద్దతు ఉంటుందని పలువురు స్థానికులు ఆకాంక్షించారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏలూరులో వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- దొంగతనం కోసం ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

ప్రజాభూమి ఏలూరు



రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోణంగి గ్రామం పాత మాలపల్లి జండా సెంటర్ సమీపంలో జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు.ఈ కేసులో నిందితుడు గూడపాటి అజయ్ (25)ను నవంబర్ 12న సాయంత్రం 4.30 గంటలకు అరెస్ట్ చేశారు.పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. అదే ప్రాంతానికి చెందిన సిగిరెడ్డి మరియమ్మ అలియాస్ కుంటమ్మ (66) వద్ద డబ్బులు ఉన్నాయని తెలుసుకున్న అజయ్, వాటిని దొంగిలించాలనే ఉద్దేశంతో అక్టోబర్ 21వ తేదీ అర్ధరాత్రి ఆమె ఇంట్లోకి ప్రవేశించాడు.ఈ క్రమంలో నిద్రలేచిన వృద్ధురాలు కేకలు వేయడంతో,ఆమెను సిమెంట్ ఇటుకతో తలపై పలుమార్లు కొట్టాడు.తీవ్రంగా గాయపడిన ఆమె ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.ఈ కేసును ఏలూరు-1 టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.ఏలూరు రూరల్ ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు,రూరల్ ఏలూరు-1 టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది దర్యాప్తులో సహకరించారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్ నల్లా శ్రీధర్

- ప్రమాణ స్వీకారానికి మంత్రి సుభాష్‌కు ఆహ్వానం

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను అమలాపురం మున్సిపల్ చైర్మన్ నల్లా శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన నల్లా శ్రీధర్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించి అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన నేపథ్యంలో ఈ మర్యాదపూర్వక భేటీ జరిగింది.ఈ సందర్భంగా జనసేన రామచంద్రపురం ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పార్టీ నాయకులు ఏడిద శ్రీను, కొప్పిశెట్టి మురళీకృష్ణ, ఆర్డీఎస్ ప్రసాద్, నల్లా మూర్తి, నల్లా చైతన్య తదితరులు మంత్రి సుభాష్‌ను కలిసి నల్లా శ్రీధర్ విజయాన్ని పురస్కరించుకొని అభినందనలు తెలియజేశారు. అలాగే ఈ నెల 23వ తేదీన జరగనున్న అమలాపురం మున్సిపల్ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని మంత్రి సుభాష్‌ను సాదరంగా ఆహ్వానించారు.ఈసందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ నల్లా శ్రీధర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రజలు



తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అమలాపురం పట్టణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి పార్టీలు ప్రజల విశేష ఆదరణతో విజయభేరి మోగించాయని అన్నారు. కూటమి పార్టీల మధ్య ఉన్న సమన్వయం, ఐక్యత, నాయకులు మరియు కార్యకర్తల సమష్టి కృషి విజయాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తి, ఐక్యత, ఉత్సాహంతో రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి విజయ పరంపరను కొనసాగించాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, బుంగా రాజు తదితరులు పాల్గొన్నారు.



రథానికి రక్షణ కల్పించలేని స్థితిలో
వెంకన్న ఆలయ అధికారులు!

- పాలకమండలి కనీస బాధ్యతలు కూడా మరిచిపోయిందా?
- మాజీ చైర్‌పర్సన్ దూడల విరీతదేవి తీవ్ర ఆగ్రహం

ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్:

ఇటీవల సంభవించిన ఆర్నబ్ తుఫాను ధాటికి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి రథం షెడ్డు పైకప్పు రేకులు ఎగిరిపోయి, ఎదురుగా ఉన్న రహదారిపై పడిపోయాయి. ఈ ఘటన జరిగి 20 రోజులు గడుస్తున్నా ఆ రేకులను తొలగించి భద్రపరిచే దిశగా ఆలయ సిబ్బంది గానీ, సంబంధిత ఆలయ చైర్మన్ గానీ కనీస చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని దేవస్థానం మాజీ చైర్‌పర్సన్ దూడల విరీతదేవి మండిపడ్డారు. ఇప్పటికీ ఆ రేకులు పడిన చోటే ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రథం ఉండే షెడ్డుకు కనీసం కొత్త రేకులు వేయించలేని పరిస్థితిలో దేవస్థానం ఉందా, లేక ఆలయ పాలకమండలి తన కనీస బాధ్యతలను కూడా నిర్వహించలేని స్థితిలో ఉందా అని ఆమె ప్రశ్నించారు. ఆర్నబ్ తుఫాను తర్వాత మురసు తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు సైతం పురాతన రథాన్ని అలాగే ఆరుబయట వదిలేయడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఈ పురాతన రథాన్ని భద్రంగా సంరక్షించాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉందని, ఎండకు ఎండి వానకు తడిస్తే రథంలోని విలువైన కలప దెబ్బతిని భవిష్యత్తులో రథం పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ఇది కేవలం ఒక రథానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి, ఆలయ చారిత్రక సంపదకు, దేవస్థానం ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. కాకినాడ నుండి వారానికి ఒక్కరోజు మాత్రమే విధులకు హాజరయ్యే కార్యనిర్వహణాధికారి (ఈవో), ఆలయ చైర్మన్ ఇప్పటికైనా నిద్రమత్తు వీడి తమ బాధ్యతలను గుర్తించాలని దూడల విరీతదేవి డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను, వెంకన్న ఆస్తులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే రథం షెడ్డుకు మరమ్మతులు చేయించి, పురాతన రథాన్ని సురక్షితంగా భద్రపరచాలని ఆమె కోరారు.

అన్నవరంలో భక్తులకు ప్రయాణ కష్టాలు..
అధికారులకు పట్టదా?

- దేవస్థానం బస్సుల్లో చిరిగిపోయిన సీట్లు.. కనీస సౌకర్యాలు కరువయ్యాయంటూ భక్తుల ఆవేదన

ప్రజాభూమి, ప్రత్తిపాడు (అన్నవరం)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వచ్చే భక్తులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. దేవస్థానానికి చెందిన బస్సుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం బస్సుల్లో ప్రయాణికులు కూర్చునే సీట్లు పూర్తిగా చిరిగిపోయి, లోపల ఉండాల్సిన కుషన్లు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో భక్తులు సౌకర్యవంతంగా ప్రయాణించడం అటుంచి, కనీసం సీట్లపై కూర్చోవడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సుల నిర్వహణపై అధికారులు ఎంతమాత్రం దృష్టి సారించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు సత్యదేవుని దర్శనార్థం అన్నవరం వస్తుంటారు. భక్తుల నుంచి వివిధ రూపాల్లో ఆదాయం పొందుతున్న దేవస్థానం, కనీసం బస్సుల్లో చిరిగిపోయిన సీట్లను మరమ్మతు చేయించలేదా? భక్తుల సౌకర్యాల పట్ల అధికారులకు ఎందుకింత నిర్లక్ష్యం? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. స్వామివారి దర్శనానికి ఎంతో భక్తిశ్రద్ధలతో వచ్చే భక్తులకు ఇలాంటి అసౌకర్యాలు ఎదురుకావడం విచారకరమని అంటున్నారు. ఇప్పటికైనా దేవస్థానం ఉన్నతాధికారులు స్పందించి బస్సుల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని, చిరిగిపోయిన సీట్లకు మరమ్మతులు చేయించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. మరి భక్తుల ప్రయాణ ఇబ్బందులపై దేవస్థానం అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? బస్సుల నిర్వహణలో మార్పులు తీసుకొస్తారా?



లేక భక్తులు ఇలాగే ఇబ్బందులు పడాల్సిందేనా? అన్నది వేచి చూడాలి.

15 నుండి నల్గొండలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభలు

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఈనెల 15 నుండి 18 వరకు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభలు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం ఏలూరు అన్నే భవనంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలకు ప్రతినిధిగా ఏలూరు జిల్లా నుండి కె.శ్రీనివాస్ తాను ఎన్నికైనట్లు వెల్లడించారు. జిల్లా నుండి జాతీయ రైతు మహాసభలకు హాజరుకానున్నట్లు చెప్పారు. జాతీయ రైతు మహాసభలు ప్రారంభం సందర్భంగా ఈనెల 15న నల్గొండలో లక్ష మంది రైతులతో బహిరంగ సభ, గొప్ప రైతాంగ ప్రదర్శన జరుగుతాయని, జిల్లా నుండి కూడా రైతులు ఈ బహిరంగ సభలో పాల్గొనవలసిందిగా కోరారు.



నాలుగు రోజులపాటు జరిగే ఏఐకేఎస్ జాతీయ మహాసభల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి ఎన్నికైన 1000 మంది రైతు ప్రతినిధులు, మరో 1000 మంది పరిశీలకులు పాల్గొంటారని వివరించారు. దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేస్తారని, భవిష్యత్ రైతు ఉద్యమ కార్యాచరణ నిర్ణయించడం జరుగుతుందన్నారు. అఖిల భారత కిసాన్ సభ దేశంలోని అతిపెద్ద రైతు సంఘం ఉన్నదని, దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతిపెద్ద రైతు సంఘంగా ఉన్నదని చెప్పారు. నేడు రైతు ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం ఒక్క రైతుదే కాదని మొత్తం సమాజ సంక్షోమని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి వ్యవసాయ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు సాగించాల్సి ఉందన్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలు, రైతుకు లాభసాటి వ్యవసాయం కోసం ఏఐకేఎస్ కృషిచేస్తోందని, ఈ కృషిలో రైతాంగం భాగస్వామ్యం కావాలని కోరారు.

జిల్లెల్లగూడెంలో మకాం వేసిన పెద్దపులి!





- పులి సంచారంతో వణుకుతున్న గిరిజనులు!
- అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరిక!

జీలుగుమిల్లి ప్రజాభూమి

తెలంగాణ రాష్ట్రం నుండి గత ఏడాది డిసెంబర్ ఐదో తేదీన కావిడి గుడి నుండి ఆంధ్రప్రదేశ్లోకి ప్రవేశించి ముప్పు తిప్పలు పెట్టిన పెద్దపులి గిరిజన గ్రామాలన్నీ చుట్టుముట్టింది . అటు తర్వాత పాపికొండలోనికి వెళ్లి ఏమనుకుందో ఏమో గాని తిరిగి మళ్ళా ఏపీలో ప్రవేశించింది. తనకు కావలసిన జంతుజాలం పుష్కలంగా దొరకడంతో గ్రామాల్లోనికి పునఃప్రవేశించి అందన కాడికి జంతుజాలను కొట్టి తింటూ ఉంది. ఇప్పటివరకు ఏ మనుషుల ఇబ్బంది పెట్టలేదు. గతంలో పర్యటించినప్పుడు బుట్టాయిగూడెం మండలంలోని వెలుతురుగూడం గ్రామం నుండి జీలుగుమిల్లి మండలంలో ప్రవేశించింది. జీలుగుమిల్లి మండలంలోని స్వర్ణ వారి గూడెం పంచాయతీలో ఎక్కువ రోజులు మాకాం వేసింది. పాములు వారి గూడెం, దర్భ గూడెం గ్రామాలలో తిరిగి తెలంగాణ ప్రాంతంలోనికి ప్రవేశించి పాపికొండలు వైపు వెళ్ళింది. ప్రస్తుతం వేలేరుపాడు మండలం నుంచి జీలుగుమిల్లి మండలంలోకి ప్రవేశించిన సంఘం వాగు వద్ద త్రిష్ట వేసింది.మన్యం పెద్ద పులి రాచన్నగూడెం అటవీ ప్రాంత సమీపం లో ఎద్దు ను వేటాడి చంపిన తిన్నది. గిరిజన గ్రామాలలో అలజడి మొదలైంది. పులి పాతదారినే వస్తుందా లేక మార్గాన్ని మారుస్తుందో తెలియదు. అటవీ శాఖ అధికారులు మాత్రం పెద్ద ఎత్తున అలజడి చేసి ఊరుకుండిపోతున్నారు. పెద్దపులుకున్న ట్రాక్ తో ఇదిగో అదిగో అంటూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పెద్దపులి రాకుండగా నిరోధించడానికి తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఒక పక్కన గిరిజన గ్రామాలలో పంచాయతీ ఎన్నికలు హడావుడి మరో పక్కన పెద్దపులి సంచారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గిరిజనులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.

ప్రజాసేవతో ప్రజల్లో, పార్టీలో గుర్తింపు పొందాలి

- జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు.

ప్రజాభూమి బుట్టాయగూడెం

ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి అందించే సేవలతో ప్రజల్లో, పార్టీలో గుర్తింపు పొందాలని జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అన్నారు. ఈనెల 6వ తేదీన జరిగిన పరిషత్ ఎన్నికల్లో బుట్టాయగూడెం మండలం నుండి ఎంపీటీసీలుగా ఎన్నికైన మిడియం సునీత(బుట్టాయగూడెం-1), మడివి నాగ దుర్గారావు (బుట్టాయగూడెం- 2), మడకం పాపయమ్మ (పులి రామన్నగూడెం), కేరం దుర్గాప్రసాద్ (సీతప్పగూడెం)లు శుక్రవారం పార్టీ అధ్యక్షుడు గోవిందరావును కలిసి, జనసేన పార్టీ తరపున ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోవిందరావు మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని, జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ ఆశయాలను, చేస్తున్న సేవలను ప్రజలకు



వివరించి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. నీతి, నిజాయితీలతో వ్యవహరించి, ప్రజలలో గుర్తింపు పొందాలని కోరారు. ఎంపీటీసీలుగా విజయం సాధించిన అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు గోవిందరావు శాలువాలతో సత్కరించారు. అనంతరం ఉంగుటూరు శాసనసభ్యుడు, స్థానిక ఎన్నికల జిల్లా సమన్వయకర్త పత్సమట్ల ధర్మరాజును ఎంపీటీసీ సభ్యులు కలసి, తమకు అవకాశం ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులతోపాటు రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ సంస్థ డైరెక్టర్ పాదం నాగ క్రిష్ణ, జనసేన పార్టీ బుట్టాయిగూడెం మండలం ప్రధాన కార్యదర్శి గుండుమోగుల సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

వట్టిగుడిపాడులో సర్పంచి పీఠంపై ఉత్కంఠ!

- ఓసీ జనరల్ రిజర్వేషన్తో ఆశావహుల పోటీ.. రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఖర్చవుతుందన్న ప్రచారం.. ఎవరికి దక్కనుందో పల్లె పీఠం!

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల పరిధిలోని వట్టిగుడిపాడు గ్రామంలో ఈ నెల 21న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సర్పంచి పదవిని ఓసీ జనరల్కు కేటాయించడంతో పలువురు ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. సుమారు 4 వేల మంది ఓటర్లు, 12 వార్డులు కలిగిన ఈ గ్రామపంచాయతీలో సర్పంచి పీఠం కోసం వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున ఎలికే నాగరాజు (యాదవ), పిన్ని బోయిన



చింతారావు (యాదవ), నాగ మల్లికార్జునరావు (యాదవ) పేర్లు వినిపిస్తుండగా, జనసేన తరఫున జ్యోతి శ్రీనివాసరావు (కాపు), జ్యోతి శ్రీకాంత్ (కాపు), అనంతనేని శ్రీనివాసరావు (కాపు) ఆశావహులుగా ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నీలపాల రాంబాబు (యాదవ), తూము గోపి (కాపు), వేమవరపు రాంబాబు (కాపు), సింహాద్రి రంగారావు (గౌడ), ఏలూరి రంగాచారి (విశ్వబ్రాహ్మణ) పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే ఆయా పార్టీల అధిష్ఠానాలు చివరకు ఎవరిని అభ్యర్థులుగా ఖరారు చేస్తాయన్నది ఆసక్తిగా మారింది. ఎన్నికల ప్రచారం,

ఇతర ఖర్చులు కలిపి ఒక్కో అభ్యర్థికి భారీగా వ్యయం కానున్నట్లు, గ్రామంలో రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఖర్చు చేసే పరిస్థితి ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో హోరాహోరీ పోరు సాగి చివరకు తెలుగుదేశం పార్టీ విజయం సాధించగా, ఈసారి సర్పంచి ఎన్నికల్లోనూ అదే స్థాయిలో పోటీ నెలకొనే అవకాశముంది. పార్టీ బలాబలాలు, సామాజిక సమీకరణాలు, గ్రామస్థుల మద్దతు ఎవరికి అనుకూలిస్తాయోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చివరకు పల్లె పీఠం ఎవరిని వివరిస్తుందో తేలాలంటే ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.




సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో యాంటీ ర్యాగింగ్పై అవగాహన సదస్సు

ప్రజాభూమి ఏలూరు

స్థానిక సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో యాంటీ ర్యాగింగ్ సెల్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు యాంటీ ర్యాగింగ్పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు ××× టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. వేంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. సుబ్బారావు హాజరై విద్యార్థినులకు ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలు, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.ర్యాగింగ్కు పాల్పడితే కఠినమైన క్రమశిక్షణా, చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.విద్యార్థినులు ఎలాంటి భయం లేకుండా విద్యను అభ్యసించాలని, ర్యాగింగ్ ఎదురైతే కళాశాల యాజమాన్యానికి లేదా యాంటీ ర్యాగింగ్ హెల్ప్లైన్ 1800-180-5522కు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కిలారు ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ జి. సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. హిమబిందు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాభూమి ఏలూరు

నగరంలోని 45వ డివిజన్లో శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏలూరు మేయర్ రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్పొరేటర్ సరిది వెంకటలక్ష్మి రాజేష్, మాజీ కార్పొరేటర్ బొరోతు బాలాజీ, కూటమి నాయకులు గుండాల దుర్గారావు, శేషపు వెంకటేశ్వరరావు, బొంతు చిన్నా, రెడ్డి కుమార్, ఎట్రించి ధర్మేంద్ర, గురుమూర్తి, చలమల నాగు పాల్గొన్నారు.

కె కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన మరియు క్విజ్ పోటీలు



ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు సూచనలు మరియు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నేడు కళాశాల "ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ " ఆధ్వర్యంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు అధ్యక్షతన "నా ఓటు – నా హక్కు– నా బాధ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీ మరియు "విలువలతో కూడిన ఓటు మరియు ఎన్నికలపై అవగాహన" అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటి నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ప్రసంగిస్తూ ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం, ఆలోచనా శక్తి, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు మరియు ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ జి శ్రీనివాసరావు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కోఆర్డినేటర్ ధారావతు మల్లేష్ తో పాటు ఇతర అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వామహస్తం బహుకరణ



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం పార్వతి దేవి అమ్మవారికి దాత కే. సుది రమణ (సుధీర్), లక్ష్మీ సుజాత దంపతులు , వెండి వామహస్తం 411 గ్రాముల 500 మిల్లీలు శ్రీ అమ్మవారి అలంకారం నిమిత్తం సమర్పించి నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దాతలను శేష వస్త్రంతో సత్కరించినారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ ,కృష్ణప్ప ,వీరబాబు వారికి ఆశీర్వచనములు చేసి తీర్థ ప్రసాదములు అందజేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వణాధికారి రాపాక శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ మీసాల రామచంద్ర రావు ఆలయ ధర్మకర్త పినిశెట్టి శ్రీనివాస్ దంపతులు, ధర్మకర్త నాలం సురేఖ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



ప్రజాభూమి – పాలకొల్లు

పట్టణ, మండలం పరిసర ప్రాంతాల్లో హిందువుల పండుగ రోజు అయిన నాగుల చవితి పండుగ శుక్రవారం ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. నాగు పాములను దైవంగా భావించే హిందువులు నాగుపాములు నివాసం ఉండే పుట్ట వద్దకు వెళ్లి భక్తులు నాగుల చవితి రోజున పూజలు నిర్వహిస్తు ఉండడం పూర్వకాలం నుంచి వస్తున్న సంప్రదాయం. ఈ విధంగా ఈ రోజున పూజలు చేస్తే ఏడాది పొడవుగా, భవిష్యత్తులో కూడా విష సర్పాలు వల్ల హాని కలిగించకుండా నాగు పాము దేవుడు కాపాడతారని హిందూ భక్తుల విశ్వాసం. దీంతో చవితి రోజున ఉదయాన్నే పిల్లలు పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున పాములు పుట్ట వద్దకు వెళ్లి పాలు గుడ్లు పోసి పూజలు పూజలు నిర్వహించారు. యువకులు కూడా బాణ సంచా ఉత్సాహంగా కాల్చుకుని పండుగ చేసుకున్నారు.

ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే

- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ప్రజాభూమి
దెందులూరు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పాలనకు ప్రజల మద్దతు ఉందని, రాబోయే ఎన్నికల్లోనూ కూటమి విజయం ఖాయమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.శుక్రవారం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన, కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని నాలుగు జడ్పీటీసీ స్థానాలతో పాటు 66 ఎంపీటీసీ స్థానాలను కూటమి గెలుచుకోవడం ప్రజాబలానికి నిదర్శనమన్నారు.ఇదే స్ఫూర్తితో రాబోయే గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు ఎన్నికల్లోనూ కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కూటమి మద్దతుదారుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 14 నవంబరు 2026

కళ్యాణదుర్గంలో కూటమి విజయోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

కళ్యాణదుర్గం పట్టణంలో కూటమి అభ్యర్థుల ఘన విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున మున్సిపల్ చైర్‌పర్సన్‌గా శ్రీమతి బుట్ట లక్ష్మి, 28 వార్డులలో విజయం సాధించిన కూటమి అభ్యర్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనం అని అన్నారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఉ రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలేని సురేంద్ర బాబు, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, కూటమి నాయకులు, 28 వార్డుల విజేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కళ్యాణదుర్గం పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది. స్థానిక ఎమ్మెల్యే అమిలేని సురేంద్ర బాబు నాయకత్వంలో పట్టణ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు నా వంతు కృషి చేస్తాను. కళ్యాణదుర్గం ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది.

దొడ్డి పెద్దన్న మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు

భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన నార్పల సత్యనారాయణ రెడ్డి

ప్రజా భూమి నార్పల



గొల్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దొడ్డి పెద్దన్న అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ధర్మవరం నియోజకవర్గ పరిశీలకులు నార్పల సత్యనారాయణ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నార్పల సత్యనారాయణ రెడ్డి గొల్లపల్లి గ్రామానికి చేరుకుని దొడ్డి పెద్దన్న భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి పెద్దన్న మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరితో కలిసిమెలిసి ఉండే నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సభ్యులు శంకర్ యాదవ్, శ్రీరాములు, మాజీ ఉపసర్పంచ్ దొడ్డి నరసింహులు, స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండ్లి సూర్యనారాయణ, పల్లె రవీంద్రారెడ్డి, పెద్దిగాని చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ భర్త అదెప్ప నరసప్ప, డీలర్ తిరుపాలు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని దొడ్డి పెద్దన్నకు ఘనంగా నివాళులర్పించారు.

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు బసవనపల్లి విద్యార్థిని

-అభినందించిన డాక్టర్ వెంకటరమణ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం రూరల్ మండల పరిధిలోని కే. బసవనపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల లో చదువుతున్న విద్యార్థిని ఏ.ప్రవస్థి జాతీయస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయింది. ఈ విద్యార్థిని ఈ నెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు పంజాబ్ లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననుంది. ఈ సందర్భంగా శుక్రవారం ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు, సమాజ సేవకులు డాక్టర్ వెంకటరమణ విద్యార్థినిని అభినందించారు. క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో క్రీడలో నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని డాక్టర్ వెంకటరమణ విద్యార్థికి సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థిని ప్రయాణ ఖర్చులకోసం రూ.5 వేల ఆర్థిక సహాయం డాక్టర్ వెంకటరమణ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా అవగాహన -ఎస్సై కే ప్రసాద్

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండలం పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయంగా సున్నితమైన గ్రామంగా గుర్తించిన నరసాపురం గ్రామాన్ని పోలీసులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలు పాటించాల్సిన నియమాలు, చేయకూడని పనుల గురించి వివరించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. సమస్యలు సృష్టించే వ్యక్తులకు తగిన హెచ్చరికలు జారీ చేసి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

జనగణన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది-జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం





భారత రాజ్యాంగంలో జనాభా గణనకు ఇచ్చిన ప్రాముఖ్యత కారణంగా ఇది మన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఉదయం జె.ఎన్.టి.యు లోని ఈ ఈ ఈ బ్లాక్ సెమినార్ హాల్ లో జిల్లా మరియు చార్జ్ లెవెల్ అధికారుల జనాభా గణన ప్రక్రియ రెండవ దశ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ లాంఛనంగా ప్రారంభించారు. డి ఆర్ ఓ మాలోల, డిప్యూటీ డైరెక్టర్ సెన్సెస్ దిబాకర్ బరిహ, జనగణన ఏడి డెహౌరీ, అనంతపురం ఆర్ డి ఓ ప్రేమాంత్ కుమార్ కళ్యాణ్ దుర్గం ఆడియో వసంత బాబు సిపిఓ బాలాజీ నాయక్ కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగం పర్యవేక్షకురాలు యోగేశ్వరి దేవి సెన్సెస్ డిటి మధుసూదన్ రావు, ఎస్ ఓ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శిక్షణ కార్యక్రమంలో తాసిల్దారులు మున్సిపల్ కమిషనర్లు టెక్నికల్ అసిస్టెంట్లు, మాస్టర్ ట్రైనర్లు ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకులు జి ఎల్ ఎన్ ప్రసాద్, కిరణ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జనాభా గణన ప్రక్రియను మనం ప్రారంభిస్తున్న ఈ తరుణంలో మొదటి దశ అనగా ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన గతంలో మన జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాలలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అతిపెద్ద పరిపాలన, గణాంక ప్రక్రియలలో ఒకటైన జనాభా గణన రెండవ దశ ప్రారంభమైందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లు, ఇతర జనాభా గణన క్షేత్ర అధికారులు ఈ ప్రక్రియను బాధ్యతాయుతంగా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా పట్టణ గ్రామస్థాయిలోని వ్యక్తుల అందరి జనాభా వివరాలు సామాజిక సాంస్కృతిక ఆర్థిక అంశాలతో పాటు వలసలు సంతాన వివరాలకు సంబంధించిన డేటాను నవోదు విధులను అంకితభావంతో పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లా మరియు చార్జ్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలోని ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని వారికి ఎలాంటి సందేహాలు ఉన్నా కూడా ఎప్పటికప్పుడు నివృత్తి చేసి అనుమానాలను అపోహాలను తొలగించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జనాభా గణన - 2027 దేశంలో 16వ జనాభా గణన కాగా స్వాతంత్ర అనంతరం 8వ జనాభా గణన అవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా గ్రామం పట్టణం మరియు వార్డు స్థాయిలో ప్రాథమిక డేటాను అందించే అతిపెద్ద మూలాధారం సెన్సెస్ మాత్రమే అని భారత దేశ జనాభా గణనకు గృహముల నివాసయోగ స్థితి, వసతులు, ఆస్తులు జనాభా వివరాలు మతము షెడ్యూల్ కులాలు మరియు షెడ్యూల్ తెగలు, భాష అక్షరాస్యత విద్య, ఆర్థిక కార్యకలాపాలు వలసలు సంతాన వివరాల వంటి వివిధ అంశాలపై సూక్ష్మ స్థాయి సమాచారాన్ని తప్పులు లేకుండా డిజిటల్ ఉపకరణాలు ఇతర మాధ్యమాల ద్వారా డేటా సేకరణ జరగాలన్నారు. భారతదేశంలో మొట్టమొదటి డిజిటల్ సెన్సెస్ కావడం వల్ల ఈ జనాభా గణన ఎంతో ప్రత్యేకంగా మరియు విశిష్టమైనదిగా ఉందన్నారు. ఎనుమరేటర్లు తమ సొంత స్మార్ట్ ఫోన్లలో ప్రత్యేకమైన మొబైల్ యాప్లను ఉపయోగించి కుటుంబాల నుండి డేటాను సేకరించాలని అదే కాకుండా ఆయా కుటుంబాలకు ఒక నిర్దిష్ట పోర్టల్ ద్వారా స్వీయ గణన చేసుకుని అవకాశం కూడా కల్పించబడిందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ జనాభా గణన రెండవ దశలో ప్రజలలో ఉన్న సందేహాలను అపోహాలను కూడా క్షేత్రస్థాయిలో మరియు సూపర్వైజర్లు తొలగించాలని అన్నారు. 2027 జనవరి 10 నుంచి 24 వరకు స్వీయా నమోదు రెండవ విడత చేసుకోవాల్సి ఉంటుందని,దేశవ్యాప్తంగా జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28వరకు జరిగే ఈ కార్యక్రమంలో దేశ ప్రణాళిక-సమగ్రమైన అభివృద్ధికి అవసరమైన సమాచారాన్ని అందించడం ఈ డేటా అత్యంత ప్రాముఖ్యత కలిగిందని పేర్కొన్నారు. అనంతరం సెన్సెస్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జనాభాగణన ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.

బాలల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు -బాల్య వివాహాలతో అనర్థాలు

-అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట

ప్రజాభూమి, హిందూపురం టౌన్



బాలల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సురక్షిత్ బచపన్ అభియాన్ లో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, బాలల సంరక్షణ కోసం అనేక ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఫోక్సు చట్టం ద్వారా లైంగిక వేధింపులకు గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా సమాజంలో ఓ ప్రధాన రుగ్మతగా ఉంటున్న బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలకు ఎక్కడైనా వివాహాలు నిర్వహిస్తుంటే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్యవివాహాల వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం 14 ఏళ్ల లోపు బాలబాలికలందరికి నిర్బంధ ఉచిత విద్యను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనికి తోడు 14 ఏళ్ల లోపు పిల్లలను ఎట్టి పరిస్థితులలోనూ పనుల్లోకి పెట్టుకోరాదన్నారు. సంబంధిత బాలలతో పనులు చేయిస్తే చట్టరీత్యా శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేకుండా అమ్మాయిలను ఎవరూ తాకరాదన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు సైతం ఆయా చట్టాలపై వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నానుడికి అనుగుణంగా విద్యార్థి దశలో విద్యాభ్యాసం సాగించి తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత స్థాయికి చేరుకోవాలని న్యాయమూర్తి సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో న్యాయమూర్తి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి, ఉప ప్రిన్సిపాల్ ఇందిరా, లోక్ అదాలత్ సిబ్బంది రాజా, పారా లీగల్ వాలంటీర్లు సురేష్, మాళప్ప తదితరులు పాల్గొన్నారు.

జతిన్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలు

-32 ఆరోగ్య బీమా సంస్థలు, టీపీఏలతో ఒప్పందం -డాక్టర్ ఎం. వెంకటరమణ నాయక్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య ఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచేందుకు హిందూపురంలోని జతిన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మరో కీలక ముందడుగు వేసింది. ఆస్పత్రిలో ఆరోగ్య బీమా కలిగిన వారికి నగదు రహిత వైద్య చికిత్స (క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్) సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎం. వెంకటరమణ నాయక్ వెల్లడించారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రోజురోజుకూ వైద్య చికిత్సల ఖర్చులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఉంటోందన్నారు. ఆరోగ్య బీమా పాలసీలు ఉన్నప్పటికీ, నగదు చెల్లించి చికిత్స పొందిన తర్వాత బీమా మొత్తాన్ని తిరిగి పొందే ప్రక్రియలో కొంత సమయం, ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రోగులకు మరింత సౌకర్యవంతంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో తమ ఆస్పత్రిలో క్యాష్‌లెస్ వైద్య సదుపాయాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఈ సదుపాయం కోసం దేశంలోని ప్రముఖ ఆరోగ్య బీమా సంస్థలు, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్లతో (టీపీఏ) కలిపి మొత్తం 32 సంస్థలతో ఆస్పత్రి అనుసంధానం చేసుకున్నట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, స్టార్ హెల్త్, యునైటెడ్ హెల్త్‌కేర్, ఎల్ఐసీ, బజాజ్ అలియాంజ్, న్యూ ఇండియా అస్యూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, చోళ ఎంఎస్, డిజిట్, టాటా ఏఐజీ, లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్, రాయల్ సుందరం, యూనివర్సల్ సోంపో, మాగ్మా హెచ్‌డీఐ, భారతి ఏఎక్స్ఏ, ఎడెల్‌వైస్, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్, కోటక్ జనరల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరలి, అకో, మణిపాల్‌సిగ్నా, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, అపోలో మ్యూనిక్, రిలిగేర్ తదితర సంస్థలతో పాటు వలుమ టీపీఏల సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. క్యాష్‌లెస్ వైద్య విధానం ద్వారా అర్హత కలిగిన బీమా పాలసీదారులు చికిత్స పొందే సమయంలో ఆస్పత్రి, సంబంధిత బీమా సంస్థ లేదా టీపీఏ మధ్య అనుమతుల ప్రక్రియ పూర్తయిన అనంతరం పాలసీ పరిధిలోకి వచ్చే అర్హమైన వైద్య ఖర్చులను నేరుగా బీమా సంస్థ భరించే అవకాశం ఉంటుందని వివరించారు. దీనివల్ల రోగులు చికిత్స సమయంలో నగదు సమకూర్చుకోవడానికి పడే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. అయితే ప్రతి పాలసీకి సంబంధించిన నిబంధనలు, బీమా పరిమితి, వెయిటింగ్ పీరియడ్, మినహాయింపులు, చికిత్సకు ముందస్తు అనుమతి వంటి అంశాల ఆధారంగా నగదు రహిత సదుపాయం వర్తిస్తుందని స్పష్టం చేశారు. హిందూపురం పట్టణంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య బీమా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి తగిన బీమా పాలసీ కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా కుటుంబంలో ఒకరికి అనారోగ్య సమస్య ఎదురైనప్పుడు మొత్తం కుటుంబ ఆర్థిక పరిస్థితిపై భారం పడకుండా ఆరోగ్య బీమా రక్షణగా నిలుస్తుందని వివరించారు. జతిన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్‌గా తాను వైద్య సేవలు అందిస్తున్నానని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు వారికి అందుబాటులో ఉన్న బీమా సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా సహకరిస్తామని డాక్టర్ వెంకటరమణ నాయక్ తెలిపారు. క్యాష్‌లెస్ వైద్య సేవలకు సంబంధించి మరిన్ని వివరాలు, ఏయే పాలసీలకు ఏయే చికిత్సలు వర్తిస్తాయి, అవసరమైన పత్రాలు, అనుమతుల ప్రక్రియ తదితర వివరాల కోసం ఆస్పత్రిని నేరుగా సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

24న ఉచిత ఆస్తమా ఆయుర్వేద శిబిరం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆనందమార్గ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన హిందూపురం పట్టణంలోని లింకంపల్లి రోడ్డులో ఉన్న సరస్వతి విద్యామందిరంలో ఉచిత ఆస్తమా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆచార్య ప్రబోధ ఆత్మబోధనాద్ అవధూత పేర్కొన్నారు. ఈ విషయంపై శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనందమార్గ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక అవగాహనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఆత్మమోక్షార్థం జగద్ధితాయచ అనే ఆదర్శంతో వ్యక్తిగత ఆత్మోన్నతికి కృషి చేస్తూనే సమాజ శ్రేయస్సు కోసం సేవలందిస్తున్నట్లు తెలిపారు. సంస్థకు చెందిన పలువురు సన్యాసులు తమ జీవితాలను సమాజ సేవకు అంకితం చేశారని, విద్య, వైద్య రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. హిందూపురంలో గత 24 సంవత్సరాలుగా ఆనందమార్గ ఆధ్వర్యంలో విద్యాసంస్థను నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నామన్నారు. అదేవిధంగా వైద్య సేవా కార్యక్రమాల ద్వారా వేలాది మందికి ప్రయోజనం చేకూర్చినట్లు తెలిపారు. 2002 సంవత్సరం నుంచి ఆస్తమా సంబంధిత వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 2024లో నిర్వహించిన శిబిరానికి కూడా విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీన నిర్వహించే శిబిరంలో ఆస్తమా, అలర్జీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ఆయుర్వేద వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ఉదయం 10 గంటలకు ప్రార్థనలు, మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభ కార్యక్రమం, 12.30 గంటల నుంచి వైద్య సేవలు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ సమావేశంలో ఆచార్య సదాశివానంద అవధూత, చారుకీర్తి, రామాంజనేయులు, ప్రకాష్, మిశ్రమల్ తదితరులు పాల్గొన్నారు.

విజయం సాధించిన ఎంపీటీసీలకు అభినందనలు తెలిపిన -ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజా భూమి శింగనమల



శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా మండలాల నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా పోటీ చేసి ఎంపీటీసీలుగా విజయం సాధించిన అభ్యర్థులు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ విజయం సాధించిన ఎంపీటీసీలను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు కూటమిపై, నాయకత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ, మరింత ఐక్యతతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కూటమి బలాన్ని మరింత పెంచుతూ ప్రజల మద్దతును, కూడగట్టుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కూటమి నాయకులు, విజయం సాధించిన ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శనివారం 14 నవంబరు 2026

నేటి నుంచి పులివెందుల మార్కెట్ యార్డులో సన్న బియ్యం విక్రయాలు

కిలో రూ.49, రూ.50లకు రెండు రకాల సన్న బియ్యం

ప్రజాభూమి,పులివెందుల

పట్టణంలోని మార్కెట్ యార్డులో నేటి నుంచి ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పులివెందుల మండల ప్రజలకు సన్న బియ్యం విక్రయాలు చేపట్టనున్నట్లు ఆర్డీవో చిన్నయ్య తెలిపారు .ప్రభుత్వం ద్వారా అందించే కేఎన్ఎమ్ సన్న బియ్యం కిలో రూ.50 చొప్పున 26 కిలోల బియ్యం రూ.1,300లకు, బిపిటి సన్న బియ్యం కిలో రూ.49 చొప్పున 26 కిలోల బియ్యం రూ.1,274లకు విక్రయించనున్నట్లు అయన తెలిపారు. లబ్ధిదారులు కుటుంబానికి ఒక ఆధార్ కార్డు ద్వారా బియ్యం కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో చిన్నయ్య కోరారు.

కార్తీక దీపాల వెలుగులో చౌడమ్మ తల్లి

ప్రజాభూమి,పులివెందుల



పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించా రు. కార్తీక మాసము మొదటి శుక్రవారము పురస్కరించుకుని ఉదయా స్తమానమున ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన , మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం విశేష అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు, అమ్మవారి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించిన వారికి సకల నరఘోష తొలగి జన,ధన ఆకర్షణ శక్తి పెరుగుతుంది అని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకేతు పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ కష్టాలలో ఉన్నపుడు శుక్రవారము లేదా పౌర్ణమి అమావాస్య రోజున 108 ప్రదక్షిణములు చేసి అమ్మని వేడుకుంటే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకము,.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.

హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్ బి వ్యాధుల త్రిపుల్ ఎలిమినేషన్ పై అవగాహన

హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్ బి లేని సమాజం నిర్మిద్దాం

-నివారణ అధికారి ఆనంద్ కుమార్



ప్రజాభూమి, పులివెందుల

హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్ బి వ్యాధుల త్రిపుల్ ఎలిమినేషన్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించు కోవాలని, వ్యాధి నిర్ధారణ అయినట్లయితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి పూర్తిస్థాయిలో చికిత్స, మందులు తీసుకోవాలని నివారణ అధికారి ఆనంద్ కుమార్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవ చ్చని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అదేవిధంగా సుఖ వ్యాధులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణకు సంబంధించిన పలు ముఖ్యమైన ఆరోగ్య సూచనలు వివరించారు.ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్ బి లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సముదాయ అభివృద్ధి సంఘ నిర్వాహకులు టోపి వల్లి మరియు సిబ్బంది, వాలంటీర్లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల కృషి, సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శం

- రూ.8 లక్షల వార్షిక వేతనంతో 8 మందికి ఉద్యోగాలు

- ఆర్కే వ్యాలీ డైరెక్టర్ జి. విజయ్ ప్రకాష్



ప్రజాభూమి, వేంపల్లె

ఆర్జీయూకేటి పరిధిలోని ఆర్కే వ్యాలి ట్రిపుల్ ఐటీకి చెందిన 8 మంది విద్యార్థులు, హైదరా బాద్‌లోని కోవాసెంట్ టెక్నాలజీస్ సంస్థలో రూ. 8 లక్షల వార్షిక వేతనంతో ఎంపి కయ్యారు. ఎంపికైన విద్యార్థుల పట్ల డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ్ ప్రకాష్ అభినందిస్తూ వీరి కృషి, పట్టుదల, సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనమన్నారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకుని పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే పరిపాలన అధికారిణి డా.రత్నకుమారి, ప్లేస్మెంట్ అధికారులు సత్యానంద రామ్, సుందర్, సిఎస్సి విభాగం అధిపతి డా.రవికుమార్ విద్యార్థుల పట్ల ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆర్జీయూకేటి, ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ కృషి చేస్తోందన్నారు.

పంచాయతీ ఏకగ్రీవ ప్రోత్సాహకాలకు షరతులు.

ప్రజాభూమి, పుట్టూరు.

గ్రామ పంచాయతీ ఏకగ్రీవ నగదు ప్రోత్సాహకాలను పొందేందుకు ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది.సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల స్థానాలన్నీ అధికారికంగా ఏకగ్రీవమైతేనే ఈ ప్రోత్సాహకానికి అర్హత లభిస్తోంది.ఈ నజరానా నగదును కేవలం గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులకు మాత్రమే ఉపయోగించాలి.ఏకగ్రీవమైన పంచాయతీల పదవీకాలంలోనే.. ఈ పెంచిన నగదును విడతల వారిగా ప్రభుత్వం విడుదల చేస్తుంది.ఈ తాజా ఉత్తర్వులు కేవలం రాబోయే గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు-2026 కు మాత్రమే వర్తిస్తాయి.ఏకగ్రీవాల పేరుతో పోటీ చేసే అభ్యర్థుల హక్కుకు గానీ, ఓటర్ల స్వేచ్ఛకు గానీ ఎలాంటి ఆటంకం కలిగించకూడదని స్పష్టం చేసింది.

గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల గ్రంథాలయంలో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఏ. కృష్ణ కిషోర్ రెడ్డి తెలిపారు. నేడు గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ బాలల దినోత్సవం, నవంబర్ 15 పుస్తక ప్రదర్శన, 16 వతేది జాతీయ గ్రంథాలయ ఉద్యమ నాయకుల స్మరణ.17 న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 18న చిత్రలేఖన పోటీలు,19 న మహిళా దినోత్సవం, నవంబర్ 20వ తేదీ వారోత్సవాల ముగింపు కార్యక్రమం, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు, పాఠకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి కోరారు.

శ్రీ చైతన్య హైస్కూల్‌లో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు

- విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో సందడి

- కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థులు రంగురంగుల దుస్తులు, ఆకర్షణీయమైన వేషధారణలతో హాజరై సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. చాచా నెహ్రూ వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలే దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని తెలిపారు. చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని సూచించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయనను చాచా నెహ్రూ అని పిలిచేవారని గుర్తుచేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూరు ఉన్నత పాఠశాలలో ఘనంగా కాలిగ్రఫీ మాస్టర్ శ్రీనివాసులుకు సన్మానం

చక్కని చేతిరాత విద్యార్థుల భవిష్యత్తుకు అందమైన బాట

-ముఖ్య అతిథులు



ప్రజా భూమి తొండూరు: విద్యార్థుల్లో చక్కని చేతిరాత నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా తొండూరు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కాలిగ్రఫీ శిక్షణ తరగతులను నిర్వహించిన తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన కాలిగ్రఫీ మాస్టర్ శ్రీనివాసులును పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి తొండూరు పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్స్పెక్టర్ శ్రీ శివ నాగిరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి శ్రీ శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో విద్యతో పాటు చక్కని చేతిరాతకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. అందమైన చేతిరాత అనేది కేవలం అక్షరాల పొందిక మాత్రమే కాదని, అది విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, శ్రద్ధ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే గొప్ప సాధనమని తెలిపారు. కాలిగ్రఫీ మాస్టర్ శ్రీనివాసులు సుమారు 267 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి, వారి చేతిరాతలో గణనీయమైన మార్పు తీసుకురావడం అభినందనీయమని అతిథులు కొనియాడారు. తక్కువ సమయంలోనే విద్యార్థుల్లో చక్కని చేతిరాతపై ఆసక్తిని పెంపొందించి, వారిలో నూతన ఉత్సాహాన్ని నింపిన ఆయన సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల సమక్షంలో శ్రీనివాసులును శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. శిక్షణ పొందిన ప్రతి విద్యార్థికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే మరిన్ని వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

దివ్యాంగ చిన్నారులతో బాలల దినోత్సవ వేడుకలు

- చిన్నారులకు ప్రత్యేక విందు ఏర్పాటు

- భవిష్యత్తులోనూ భవిత కేంద్రానికి అండగా ఉంటాం..

- సంఘమిత్ర అధ్యక్షుడు సిరాజుద్దీన్



ప్రజాభూమి, వేంపల్లె

భవిత దివ్యాంగుల విద్యా వనరుల కేంద్రంలో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులతో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించి, వారికి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంఘమిత్ర అధ్యక్షుడు సిరాజుద్దీన్, డాక్టర్ భాషా, డాక్టర్ షాహిన్, ఎంఈఓలు వెంకట రామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంఘమిత్ర అధ్యక్షుడు సిరాజుద్దీన్ చిన్నారులతో ఆప్యాయంగా గడిపి శుభాకాంక్షలు తెలిపారు. గత ఆరేళ్లుగా దివ్యాంగ చిన్నారులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని, భవిష్యత్తులోనూ భవిత కేంద్రానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. డాక్టర్ భాషా మాట్లాడుతూ చిన్నారులు వివిధ రంగాల్లో అభివృద్ధి చెందుతూ రాణించడం అభినందనీయమన్నారు. డాక్టర్ షాహిన్ మాట్లాడుతూ సిరాజుద్దీన్ దివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఎంఈఓలు వెంకట రామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌టీ యశోద మాట్లాడుతూ చిన్నారులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేసిన సిరాజుద్దీన్‌కు, కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు భవిత కేంద్రం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సిరాజుద్దీన్, డాక్టర్ భాషా ఆయురారోగ్యాలతో ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి దివ్యాంగ చిన్నారులకు అండగా నిలవాలని చిన్నారులు ఆకాంక్షించారు.



భాకరాపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం భాకరాపేటలోని జెడ్పీహెచ్ఎస్ 11వ బెటాలియన్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు సంయుక్తంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక కడప జిల్లా అధ్యక్షుడు సమీర్ బాషా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రమణయ్య మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో విద్యలో రాణించాలని, చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు. సమీర్ బాషా మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, సృజనాత్మకతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కోరారు. తెలుగు ఉపాధ్యాయుడు నరసింహులు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే మంచి నడవడి, మానవీయ విలువలు, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, నరసింహులు, రాజమ్మ, పారమేశ్వరి, పద్మలత, మాధవీలత, చంద్రశేఖర్, షేక్ మౌలాలి, హేమంత్‌కుమార్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ మానసా దేవి ఆలయంలో వైభవంగా వార్షికోత్సవం



ప్రజాభూమి,సిద్ధవటం: కడప--చెన్నై జాతీయ రహదారిపై కనుమలోపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీ మానసా దేవి ఆలయంలో శుక్రవారం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, గోపూజ, నవగ్రహ పూజ, కలశ స్థాపన, పంచామృత అభిషేకం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. వార్షికోత్సవాల్లో భాగంగా కడప, ప్రొద్దుటూరు, ఒంటిమిట్ట, కమలాపురం, సిద్ధవటం మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ ఉత్సవాలు రెండు రోజులపాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల అధికారులకు శిక్షణ



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలంలో తొలి విడతగా నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఆర్ఓలు, ఏఆర్ఓలు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు డీఎల్‌డీఓ మైథిలి తెలిపారు. శుక్రవారం సిద్ధవటం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. నామినేషన్లతో అభ్యర్థులు సమర్పించే సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నామినేషన్ల పరిశీలనలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పత్రాలు గుర్తిస్తే నామినేషన్‌ను తిరస్కరించాలని, అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యువ పీఆర్‌డీ మెహతాబ్ యాస్మిన్, ఏవో సోమశేఖర్, ఎన్నికల శిక్షణకు హాజరైన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నామినేషన్లకు ఆటంకం కలిగిస్తే క్రిమినల్ కేసులు

- ఎస్ఐ హారిక హెచ్చరిక



ప్రజాభూమి, సిద్ధవటం: స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియకు ఆటంకం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిద్ధవటం ఎస్ఐ హారిక హెచ్చరించారు. శుక్రవారం సిద్ధవటం పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలు, డీఎస్పీ వెంకట రామయ్య సూచనల మేరకు నవంబర్ 15, 16, 17 తేదీల్లో మండలంలోని 18 గ్రామాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అనవసరంగా గుమిగూడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అభ్యర్థులు తమ నామినేషన్ దాఖలు చేసేందుకు అనవసరమైన గుంపులతో కాకుండా అవసరమైన వారితో మాత్రమే క్లస్టర్ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో గొడవలు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే ఎలాంటి మినహాయింపు లేకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ స్పష్టం చేశారు.

నగరవనంలో విద్యార్థులకు ప్రకృతి పరిరక్షణపై అవగాహన



ప్రజాభూమి, సిద్ధవటం: కడప ఫారెస్ట్ ఆఫీసర్ అభ్యర్థన మేరకు సిద్ధవటం మండలం మాధవరం--1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం ఎస్పీవీడీ సభా హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు కడప నగరవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు విద్యార్థులకు వివిధ రకాల ఔషధ మొక్కలు, వాటి ఉపయోగాలు, ప్రకృతి పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ రకాల జంతువులు, పక్షుల శబ్దాలను 'మ్యూజిక్ యానిమల్ సిస్టమ్' ద్వారా వినిపించి వాటి గురించి విద్యార్థులకు వివరించారు. నగరవనంలోని వివిధ ఆటలు, వినోద కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. మధుసూదన్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 14 నవంబరు 2026

ఏఐతో వ్యాపార విప్లవం.. సుస్థిరతతోనే భవిష్యత్తు!

మోహన్ బాబు వర్సిటీ అంతర్జాతీయ సదస్సులో నిపుణుల పిలుపు..



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:

మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 'సస్టైనబుల్ ప్రాక్టీసెస్ ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్'పై నాలుగో అంతర్జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు 'ఏఐ, సుస్థిరత, డిజిటల్ పరివర్తనతో వ్యాపార వ్యవస్థల పునర్నిర్వచనం' అనే థీమ్‌ను ఎంపిక చేశారు. ప్రారంభోత్సవానికి నేపాల్ త్రిభువన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మరియు మిడ్-వెస్ట్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ధృబ కుమార్ గౌతమ్, ఐఐఎం తిరుచ్చి సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ నిత్యానందం, ఆక్టోపి హెల్త్ సీఈఓ లోకేష్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ఏఐ, సుస్థిర ఆవిష్కరణల ప్రాధాన్యతను వివరించారు.సదస్సులో భాగంగా నిర్వహించిన ప్యానెల్ చర్చలో ఏఐ ఆధారిత వ్యాపార రంగంలో ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, నైతిక నాయకత్వంపై ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వ్యాపార సంస్థలు స్వల్పకాలిక లాభాలకే పరిమితం కాకుండా సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అవిరేని శ్రీనివాసులు, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ కంప్యూటింగ్ డీన్ ప్రొఫెసర్ దేవసేనాపతి, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డీన్ డా. టి. మాధవి, కన్వీనర్ డాక్టర్ బి. ఉజ్వల, కో-కన్వీనర్లు డాక్టర్ ఎస్. కిషోర్, డాక్టర్ కె. వాణిశ్రీ, విద్యావేత్తలు, పరిశోధకులు, పారిశ్రామిక నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో గల శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన "టాప్ యువర్ టాలెంట్" కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. చిన్నారులు వివిధ రకాల పండ్ల వేషధారణలో ఫ్రూట్స్ ఫాన్సీ డ్రెస్సెస్ ధరించి వచ్చి, తమ అందమైన వేషధారణతో, చక్కని అభినయంతో అందరినీ అలరించారు.అనంతరం విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహిస్తూ వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆటపాటలు, వినోదభరితమైన కార్యక్రమాలతో చిన్నారులందరూ ఎంతో ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ... "పిల్లల నవ్వుల్లోనే రేపటి ప్రపంచపు ఆనందం దాగి ఉంది. వారి కలలకు రెక్కలిస్తే, భవిష్యత్తు అద్భుతంగా రూపుదిద్దుకుంటుంది. చదువుతో పాటు ఆటలు, కళలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయి" అని తెలిపారు.ఎ.జి.ఎం సురేష్ మాట్లాడుతూ... "పిల్లల బాల్యాన్ని ఆనందమయం చేస్తూ, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్స్ శ్రీనివాసులు, లావణ్య, అమ్మాజీ, డీన్ త్రివేణి, ఇన్చార్జులు కల్పన, వాసంతి, శ్రీహరి, వంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొట్టంబేడు మండలంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఖరారు

ప్రజా భూమి ప్రతినిధి – తొట్టంబేడు:

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తొట్టంబేడు మండలంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అధికారులు ఖరారు చేశారు. తొట్టంబేడు స్వర్ణ గ్రామం: బోనుపల్లె, చిట్టత్తూరు, చోడవరం, గుండెలిగుంట, కంచనపల్లె, తొట్టంబేడు. తొట్టంబేడు రైతు సేవా కేంద్రం: కారకొల్లు, శివనాధపాలెం, తంగెళ్లపాలెం, రౌతుసురమాల, లింగమనాయుడుపల్లి, సంబయ్యపాలెం.పెద్ద కానపర్తి స్వర్ణ గ్రామం: కాసారం, చియ్యవరం, కొనతనేరి, పిల్లమేడు, ఇలగనూరు, పెద్దకనపర్తి, శేషమనాయుడు కండ్రిగ. పెద్ద కన్నాలి స్వర్ణ గ్రామం: బసవయ్యపాలెం, కొత్త కండ్రిగ, పెద్ద కన్నాళి, తాటిపర్తి, పెన్నలపాడు, పూడి, చిన్నసింగమాల, పొయ్య. అభ్యర్థులు తమ గ్రామానికి కేటాయించిన కేంద్రంలోనే నిర్దిష్ట గడువులోగా నామినేషన్లు దాఖలు చేయాలని అధికారులు సూచించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం



రామచంద్రపురం మండలంలో నాగుల చవితి పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలంలో నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సికేపల్లి పంచాయతీ చిట్టత్తూరు గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో నాగదేవతలకు పూజ చేశారు. , పలు గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నాగుల పుట్టల వద్దకు చేరుకున్నారు. నాగదేవతకు పసుపు, కుంకుమ సమర్పించి, పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్లు, పూలు, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని నాగదేవతను ప్రార్థించారు. చిన్నారులతో పాటు పెద్దలు కూడా ఈ పూజలో పాల్గొనడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సంప్రదాయబద్ధంగా నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

శ్రీ నాగాలమ్మ ఆలయంలో వైభవంగా నాగుల చవితి వేడుకలు..!

- పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్న భక్తులు..
- వేకువజాము నుంచే నూరు జంక్షన్ వద్ద ఉన్న ఆలయానికి పోటెత్తిన మహిళలు, భక్తులు..
- పసుపు, కుంకుమ, చందనంతో నాగదేవతల ప్రతిమలకు ప్రత్యేక అలంకరణలు..

ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:



పవిత్ర కార్తీక శుద్ధ చవితి (నాగుల చవితి) పర్వదినాన్ని పురస్కరించుకుని చంద్రగిరి నూరు జంక్షన్ వద్ద కొలువై ఉన్న ప్రసిద్ధ శ్రీ నాగాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే వందలాదిగా తరలివచ్చిన మహిళలు, స్థానిక భక్తులతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలోని నాగదేవతల ప్రతిమలకు, పుట్టలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చందనం, వివిధ రకాల సుగంధ పుష్పాలతో నాగదేవతలను సుందరంగా అలంకరించారు. అనంతరం నాగేంద్రుడికి అత్యంత ప్రీతిపాత్రమైన చిమ్మిలి, చలిమిడి నైవేద్యంగా సమర్పించి.. పిండి దీపాలు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇస్తూ తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ భక్తుల నామస్మరణలు, మంగళహారతులతో మార్మోగాయి.వండుగ సందర్భంగా పలువురు భక్తులు, దాతలు తమ మొక్కుబడులలో భాగంగా భారీ ఎత్తున వివిధ రకాల ప్రసాదాలను సిద్ధం చేసి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలో దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ ప్రేమతో, భక్తిశ్రద్ధలతో వాటిని పంచిపెట్టారు. భక్తుల సేవాభావంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక ఆనందం వెల్లివిరిసింది.

నాగుల చవితి విశిష్టత: కార్తీక మాస శుక్లపక్షంలో వచ్చే చవితి తిథిని నాగుల చవితిగా జరుపుకోవడం భారతీయ సనాతన ధర్మంలో విశిష్ట సంప్రదాయం. ఈ పర్వదినాన పుట్టలో నివసించే సర్పజాతిని సాక్షాత్తు నాగేంద్రుడి ప్రతిరూపంగా భావించి ఆవుపాలు పోయడం, కోడిగుడ్లు వంటి ఆహారాన్ని సమర్పించడం అనాదిగా ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా పంటపొలాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు, గ్రామీణ ప్రజలు.. తమ పొరపాటు వల్ల ఏదైనా హాని జరిగినా ఎలాంటి పగ పట్టకుండా తమ వంశాన్ని, సంతానాన్ని చల్లగా కాపాడాలని వేడుకుంటూ పుట్టలో పాలు పోసి నాగదేవతలను ప్రార్థించడం ఈ పండుగలోని ప్రధాన ఆంతర్యం. ప్రకృతిలోని సకల జీవరాశులను గౌరవిస్తూ, వాటితో సహజీవనం సాగించాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుంది.

రేణిగుంట మండలంలో 19 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు 6 చోట్ల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు.

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



ఈ నెల 15 నుంచి 17 వరకు నామినేషన్ల స్వీకరణ 26న పోలింగ్ మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు మొదటి విడతలో భాగంగా ఈ నెల 26వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల పంచాయతీ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవిచంద్ర మాట్లాడుతూ సర్పంచ్,వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల స్వీకరణ కోసం మండల వ్యాప్తంగా ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రతి కేంద్రానికి ఒక రిటర్నింగ్ అధికారిని నియమించినట్లు పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాలు కరకంబాడి పంచాయతీ కార్యాలయం -- 1)కరకంబాడి, వెంకటాపురం,మామండూరు. 2)రేణిగుంట పంచాయతీ కార్యాలయం -- రేణిగుంట. 3)ఆర్. మల్లవరం సచివాలయం --ఆర్. మల్లవరం, వెదుళ్లచెరువు, గుత్తివారిపల్లి, ఎస్సీపురం, కృష్ణాపురం. 4)ఎలమంద్యం పంచాయతీ కార్యాలయం -- ఎలమంద్యం, గురవరాజపల్లి, జీపాళెం. 5)గాజులమండ్యం పంచాయతీ కార్యాలయం -- గాజులమండ్యం, సూరప్పకసము, విప్పమానుపట్టెడ, తండ్లము, అత్తూరు. 6)తూకివాకం పంచాయతీ కార్యాలయం -- తూకివాకం, కొట్టరమంగళం.నవంబర్ 21 మధ్యాహ్నం 3 గంటల వరకు -- నామినేషన్ల ఉపసంహరణ.

నవంబర్ 26 -- పోలింగ్. :జిల్లా కలెక్టర్,జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నామినేషన్ కేంద్రాలు,పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా,ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

జడ్పిటిసి మేకల తిరుమల రెడ్డి, ఎంపీపీ అభ్యర్థి రాధికలకు ఘన సన్మానం

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం



స్థానిక ఎన్నికలలో రామచంద్రపురం జడ్పిటిసి గా అఖండ మెజార్టీతో గెలుపొందిన తిరుమల రెడ్డిని, ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఈతముక్కల రాధిక ఉమాపతి నాయుడులను తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఎంపీపీ, జడ్పిటిసిలను శాలువులతో సన్మానించి పుష్ప గుచ్ఛం, శ్రీవారి ప్రసాదాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయగలరనే విశ్వాసంతో ప్రజలు ఎంపీపీ రాధికను ఏకగ్రీవంగా, జడ్పిటిసిగా తిరుమలరెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి టిడిపికి పట్టం కట్టారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిని ప్రజలు గెలిపించారని వారి పేర్కొన్నారు.. ఈ సందర్భంగా ఎంపీపీ రాధిక, జడ్పిటిసి మేకల తిరుమలరెడ్డిలు మాట్లాడుతూ మండల ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కృషి చేస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలలో మమ్మల్ని ఆదరించి గెలిపించిన మండల ప్రజలకు, నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, బీసీ నాయకులు కాయం చంద్రశేఖర్ యాదవ్, చేకూరు వెంకటప్రసాద్, ఎంపీటీసీ కల్లూరు నల్లని రమేష్ నాయుడు, మాజీ సర్పంచులు వెంకటరమణ, ప్రతాప్సాహెబ్, రాఘవేంద్ర నాయుడు, సాయి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ భారంతో ఆర్థికంగా చితికిపోతున్న డ్వాక్రా సంఘాలు

- పెండింగ్ వడ్డీ బకాయిలు వెంటనే చెల్లించాలి
- ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె

వడ్డీ భారంతో డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పట్టణంలో తులసి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ డ్వాక్రా వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో డ్వాక్రా మహిళలపై వడ్డీ భారం తగ్గించి, ఆర్థికంగా ఆదుకునేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పావలా వడ్డీ రుణాల పథకాన్ని ప్రారంభించిందన్నారు. మహిళలకు మరింత ప్రయోజనం కల్పించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్కో సంఘానికి రూ.5 లక్షల వరకు సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా మర్చిపోయిందని, వడ్డీ భారం కారణంగా మహిళలు రుణగ్రస్తులవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న వడ్డీ బకాయిలను వెంటనే చెల్లించి డ్వాక్రా మహిళలను ఆదుకోవాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్ గౌడ్, విజయ భాస్కర్, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస మంగాపురం శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని..!

నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు..
గర్భాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు..
వేదపండితుల ఆశీర్వచనం, తీర్థప్రసాదాల స్వీకరణ..

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:




చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీనివాస మంగాపురంలో కొలువైన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారిని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యేకు టీటీడీ ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు మంగళవాయిద్యాలతో సాదర స్వాగతం పలికి గర్భాలయంలోకి ఆహ్వానించారు.గర్భాలయంలో కొలువైన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారికి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రం కప్పి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం ఆలయ వెలుపల ఎమ్మెల్యే పులివర్తి నాని మీడియాతో మాట్లాడుతూ.. "చరిత్రాత్మక, పరమ పవిత్రమైన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని, దివ్యానుభూతిని కలిగించింది. స్వామివారి కరుణాకటాక్షాలతో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో ఆనందమయమైన జీవితాన్ని గడపాలని మనస్ఫూర్తిగా ప్రార్థించాను. నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందేలా స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బందితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ తరగతులు ప్రారంభం

ఎన్నికల విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహనతో నిబంధనల మేరకు విధులు నిర్వహించాలి
-జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి



రానున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) తమకు కేటాయించిన విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు సూచించారు. శుక్రవారం తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో తిరుపతి, సూళ్లూరుపేట పరిధిలోని ఆర్వోలు, ఏఆర్వోలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతులను జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవితో కలిసి జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో ప్రతి అధికారి ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకొని నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. శిక్షణలో వివరించే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకొని, ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ శిక్షణ తరగతుల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలు, అధికారుల విధులు, బాధ్యతలు, ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డి ఎల్ డి ఓ గంగాభవాని సంబంధిత ఎన్నికల అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
శనివారం 14 నవంబరు 2026

అనంతపురాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం

- నూతన కార్పొరేటర్లు, ఎంపీటీసీల సన్మాన సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- కూటమి తరఫున గెలిచిన 41 మంది కార్పొరేటర్లు, 9 మంది ఎంపీటీసీలకు ఘన సత్కారం
- గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నగరానికి చేసిందేమీ లేదని విమర్శ
- రూ.1,400 కోట్లతో నగరాభివృద్ధి చేశామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
- నగరాభివృద్ధికి సమిష్టిగా పనిచేస్తామన్న ఎమ్మెల్సీ రమాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జనసేన నగర అధ్యక్షుడు బాబురావు





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ సిటీగా అభివృద్ధి చేసి చూపిస్తామని.. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం నగరపాలక సంస్థ మరియు నియోజకవర్గ రూరల్ పరిధిలో కూటమి తరఫున నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జనసేన నగర అధ్యక్షుడు బాబురావుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థలో కూటమి తరఫున విజయం సాధించిన 41 మంది కార్పొరేటర్లను, రూరల్ పరిధిలో గెలిచిన 9 మంది ఎంపీటీసీలను నాయకులంతా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన 41 మంది కార్పొరేటర్లు, 9 మంది ఎంపీటీసీలు నగర మరియు గ్రామాల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతపురం నగరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ సిటీగా అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, మేయర్ అభ్యర్థి ఓటమికి గల పరిస్థితులను సమీక్షించుకుం టామని, ఎక్కడ లోపాలు జరిగాయో పరిశీలించి సరిదిద్దుకుంటామని తెలిపారు. గత వైసీపీ పాలనపై, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తీరుపై ఎమ్మెల్యే దగ్గుపాటి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అనంతపురం నగరంలో కనీసం ఒక్క కొత్త రోడ్డు గానీ, డ్రైనేజీ గానీ వేయలేదన్నారు. ఆయన కేవలం టవర్ క్లాక్ మీదుగా ఉన్న రోడ్డు మాత్రమే వేశారని.. అది కూడా 2018లో టీడీపీ హయాంలో మంజూరైన రోడ్డు అని అన్నారు. 40ఏళ్ల ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే ఆయన, నగరానికి చేసిందేమీ లేదని.. కేవలం ఆయన తండ్రి విగ్రహం పెట్టుకోవడం తప్ప ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో సమర్థవంతమైన పనితీరు వల్ల రాష్ట్రానికి రూ. 20లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతోందన్నారు. ఒక్క అనంతపురం నగరంలోనే రూ. 1,400 కోట్లతో భారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. భవిష్యత్తులో మరింత వేగంగా అభివృద్ధి పనులు చేస్తామని వివరించారు. రాయలసీమ ప్రగతి గురించి ప్రస్తావిస్తూ.. మదనపల్లిలో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ప్రారంభించామని, పుట్టపర్తిలో లక్ష కోట్ల పెట్టుబడులతో డిఫెన్స్ ఇండస్ట్రీస్‌ను తీసుకువచ్చామని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో రైతులకు ఒక్క డ్రిప్ కూడా ఇవ్వలేదని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలోనే రూ. 300 కోట్ల సబ్సిడీతో అనంతపురం జిల్లా రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పించామన్నారు. అలాగే హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 1,800 క్యూసెక్కుల నుంచి 3,500 క్యూసెక్కుల వరకు పెంచి సాగునీరు అందించామన్నారు. ఎమ్మెల్సీ రమాదేవి, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జనసేన నగర అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ.. నూతనంగా గెలిచిన కార్పొరేటర్లు, ఎంపీటీసీలందరికీ అభినందనలు తెలిపారు. ప్రజలు కూటమిపై ఎంతో నమ్మకంతో ఈ విజయాన్ని అందించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ ద్వారా చదువు కొనసాగించండి

- దూరవిద్యతో భవిష్యత్తు కు బాటలు వేసుకోవాలి- మంత్రి మండిపల్లి!



ప్రజాభూమి, రాయచోటి

ఇంటి పరిస్థితులు సరిగా లేక బడి మానివేసిన వాళ్ళు, ఆర్థిక స్థోమత లేని వారు, చిరుఉద్యోగులు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో చేరి మంచి భవిష్యత్తు కు బాటలు వేసుకోవాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలోని ఏఐ సెంటర్లను ఉపయోగించుకుని అందరూ ఓపెన్ స్కూల్లో చేరి పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పాస్ కావాలన్నారు. రాష్ట్ర కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ గారు అన్నమయ్య జిల్లా రాయచోటి, డైట్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఏఐ కోఆర్డినేటర్ల సమావేశంలో నియమ నిబంధనలపై పూర్తిగా చర్చించడం జరిగింది. అన్నమయ్య జిల్లా నందు అడ్మిషన్లను మరింత పెంచాలని రాష్ట్రస్థాయిలో నిర్దేశించిన స్థాయికి చేరాలన్నారు. ఈ ప్రాంత ఏఐ కోఆర్డినేటర్ల స్థితిగతులను విచారించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాసాపేట, ఉర్దూ పాఠశాల మరియు ప్రభుత్వ పాఠశాల నేతాజీ సర్కిల్ ఉపాధ్యాయులతో మాట్లాడి అడ్మిషన్ల పెంపుకు సహకరించవలసిందిగా కోరడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాస్ గారు మాట్లాడుతూ 14 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన వారు పదవ తరగతి లోను, పదవ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్ చేరవచ్చు అన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పొందిన సర్టిఫికెట్స్ రెగ్యులర్ విద్యార్థులు పొందిన సర్టిఫికెట్స్ కు సమానమన్నారు. రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఏ కోర్సులో అయినా చేరవచ్చునని తెలియజేసిరి. డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాడి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తన వంతు బాధ్యతగా తమ ఆవాస ప్రాంతాలలోని బడి మానివేసిన పిల్లలను ఓపెన్ స్కూల్ లో చేర్పించవలసిందిగా కోరారు. అదేవిధంగా ఇందులో ప్రవేశం పొంది అర్హత సాధించిన వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలలో చేరడానికి ఉపయోగపడుతాయన్నారు.

అద్దె లావాదేవీల్లో జీఎస్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి...!


అద్దెలపై జీఎస్టీ, రివర్స్ ఛార్జ్ విధానంపై పన్ను నిపుణులకు అవగాహన కల్పించిన జాయింట్ కమిషనర్ సుమతి



ప్రజాభూమి, కడప కలెక్టరేట్

అద్దె చెల్లింపులకు సంబంధించి వస్తు సేవల పన్ను (జీఎస్టీ) నిబంధనలు, రివర్స్ ఛార్జ్ విధానం (ఆర్‌సీఎం) అమలుపై పన్ను నిపుణులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పన్నుల శాఖ కడప డివిజన్ జాయింట్ కమిషనర్ జి. సుమతి సూచించారు. శనివారం కడపలోని "మానస ఇన్" హోటల్‌లో రాష్ట్ర పన్నుల శాఖ కడప డివిజన్ ఆధ్వర్యంలో అద్దెలపై జీఎస్టీ, రివర్స్ ఛార్జ్ విధానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అద్దె చెల్లించే వ్యక్తి, అద్దె పొందే వ్యక్తికి జీఎస్టీ చట్టం ప్రకారం ఉండే బాధ్యతలను వివరించారు. పన్ను చెల్లింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిటర్నులలో నమోదు చేయాల్సిన వివరాలు, సంబంధిత నిబంధనలను తెలియజేశారు. జీఎస్టీ చట్టం ప్రకారం అద్దెలపై పన్ను వర్తించే సందర్భాలు, పన్ను చెల్లించాల్సిన బాధ్యతలు, నమోదు అవసరాలు, పన్ను వివరాలను దాఖలు చేసే విధానాలపై స్పష్టత కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా పన్ను నిపుణులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. పన్ను చెల్లింపుదారులు చట్టంలోని నిబంధనలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించాలని సూచించారు. ఆడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ అద్దెలపై జీఎస్టీ, రివర్స్ ఛార్జ్ విధానంపై పన్ను నిపుణులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సదస్సులో జిల్లాకు చెందిన ఆడిటర్లు, పన్నుల శాఖలో నమోదు చేసుకున్న పన్ను ప్రతినిధులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఇతర పన్ను నిపుణులు పాల్గొన్నారు. జీఎస్టీ నిబంధనల అమలుపై శాఖాధికారులు, పన్ను నిపుణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప డివిజన్ డిప్యూటీ కమిషనర్ కె. కేదారేశ్వరరావు, కడప-1 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ పి. వద్మావతి, కడప-2 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ డి. రవి కుమార్ రెడ్డి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

నందలూరులో జవహర్ లాల్ నెహ్రూ ముందస్తు పుట్టినరోజు వేడుకలు



ప్రజాభూమి, నందలూరు

భారతదేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ 138వ జయంతి నేపథ్యంలో మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు మండల విద్యాశాఖ అధికారి 2 అనంతకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసారు. అందరూ ఉపా ధ్యాయినీ ఉపాధ్యాయులు జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి ప్రధానమంత్రిగా 17 సంవత్సరాల పాటు పనిచేస్తూ ప్రధానమంత్రి గానే పరమపదించిన గొప్ప దేశనాయకుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని కొనియాడారు. ప్రధానమంత్రిగా ఆయన ప్రవేశపెట్టిన పథకాలను, దేశ ప్రజలకు ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, జీ.వి.ప్రసాదరావు, విజయ కుమారి, గౌరీ, జ్యోతిప్రియ, గీత, రాజేంద్ర, సురేష్, గాయత్రి, సుమలత, తోట శివ సాయిరాం, వెంకటరమణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట మండలంలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ కేంద్రాల వివరాలు

- వెల్లడించిన ఎంపీడీవో రవిచంద్ర.



రేణిగుంట : రేణిగుంట మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలు, 206 వార్డులకు సంబంధించి ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు మొత్తం ఆరు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రేణిగుంట ఎంపీడీవో రవిచంద్ర తెలి పారు. ఈ నెల నవంబర్ 15 నుండి 17 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 18వ తేదీన నామినేషన్ల పరిశీలన, 20వ తేదీన అప్పీళ్ల పరిష్కారం ఉంటుందని ఆయన వివరించారు. నవంబర్ 21వ తేదీన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం నవంబర్ 26వ తేదీన ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం నుండి ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రక్రియ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ఆరు నామినేషన్ కేంద్రాలు మరియు వాటి పరిధిలోని పంచాయతీల వివరాలను ఎంపీడీవో వెల్లడించారు. ఎలమండ్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎలమండ్యం, గురవరాజుపల్లె, జీపాలెం పంచాయతీలకు; గాజులమండ్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆతూరు, గాజులమండ్యం, సూరప్పకాశం, తండ్లం, విప్పమాని పట్టెడ పంచాయతీలకు; కరకంబాడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కరకంబాడి, మామండూరు, వెంకటాపురం పంచాయతీలకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ కేంద్రాలు మరియు కౌంటింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలియజేశారు.

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ముఖ్య అతిథిగా: ఎంపీ అంబిక



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా, పెద్దపప్పూరు మండల్, కే నర్సాపురం గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ముఖ్య అతిథిగా అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆయనకు ఘన నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి రచించిన రామాయణం యుగయుగాలుగా మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. ఆయన జీవితం, ఆదర్శాలు, బోధనలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అని అన్నారు. ధర్మం, సత్యం, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని కోరారు. వాల్మీకి మహర్షి ఆశయాలను భావితరాలకు అందిస్తూ, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజ శ్రేయస్సు, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, వాల్మీకి సోదరులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్చక, పురోహిత కుటుంబాలకు అండగా శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ

నాగుల చవితి సందర్భంగా ఏడుగురు అర్చకులకు స్వయంపాకం, కూరగాయల పంపిణీ





ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నిర్వహిస్తున్న శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అర్చక, పురోహిత కుటుంబాలకు స్వయంపాకం, కూరగాయలను పంపిణీ చేశారు. చెన్నై వాస్తవ్యులు పొక్కాళి సతీష్ జన్మదినాన్ని పురస్కరించుకుని, నాగుల చవితి పర్వదినం సందర్భంగా స్థానిక ప్రాంతానికి చెందిన ఏడుగురు అర్చకులు, పురోహితులకు ఆలయ ధర్మకర్తలు, మాజీ సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర రెడ్డి చేతుల మీదుగా ఫలసరుకులు, కూరగాయలను అందజేశారు.ఈ సందర్భంగా దామోదర రెడ్డి మాట్లాడుతూ ఇతర రాష్ట్రంలో నివసిస్తున్నప్పటికీ స్వగ్రామంపై మమకారంతో తన జన్మదినాన్ని, నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకులు, పురోహితులకు స్వయంపాకం అందించడం అభినందనీయమని అన్నారు. ఈ సేవా కార్యక్రమానికి ముందుకొచ్చిన దాత పొక్కాళి సతీష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దీవి అనంతాచార్యులు, నరేష్ శర్మ, సాయిబాబు, సుబ్రహ్మణ్య శర్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

బాలల చదువు, క్రమశిక్షణే దేశాభివృద్ధికి పునాది- హెచ్ఎం శ్రీనివాస రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

పిల్లలే దేశ భవిష్యత్తు అని, బాలల చదువు, క్రమశిక్షణే దేశాభివృద్ధికి పునాది అని స్థానిక పట్టణంలోని తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల సిబ్బందితో కలిసి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి, బాలల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం సర్వస్వం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని, పిల్లలంటే ఆయనకు ఎంతో ఇష్టమని, గులాబీ పువ్వును అభిమానించేవారని తెలిపారు. ఆయన జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం జరుపుకుంటామని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి, ఉన్నత లక్ష్యాలను సాధించి భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చాచా పుట్టినరోజు పండుగ



ప్రజాభూమి, పుల్లంపేట

భారత్ దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ముందస్తు పుట్టినరోజు కార్యక్రమాన్ని కొత్తపేట మోడల్ స్కూల్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలీ జిపి హైమావతి విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ,నెహ్రూ గారికి పిల్లలు అంటే ఎంతో ఇష్టమని అందుకే ఆరోజు ను బాలల దినోత్సవంగా పరిగణించారని వారు దేశానికి ఎన్నో మంచి పనులు చేశారని కొనియాడారు. పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. స్వీట్ కంచి పెట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో సహాపాధ్యాయు లు ఇందిర, అరుణ సుధ పూర్ణిమ, సుబ్బారెడ్డి ,గార్లు వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 10

శనివారం 14 నవంబరు 2026

మహిళా వైద్య అధికారులపై సమాచార హక్కు చట్టం ఫిర్యాదుదారు వేధింపులు

– తీవ్రంగా స్పందించిన సమాచార హక్కు చట్టం బెంచ్
–విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని గుంటూరు ఎస్పీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఆదేశాలు



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: సమాచార హక్కు చట్టాన్ని అడ్డుపెట్టుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు అందిస్తున్న ఇద్దరు వైద్యురాళ్లు పట్ల అనుచితంగా, ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్న సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారు ఫిర్యాదును రాష్ట్ర సమాచార హక్కు చట్టం బెంచ్ కొట్టివేసింది. కమిషనర్లు డా. రెహానా బేగం, గాజుల ఆదెన్న, వి.ఎస్.కె.చక్రవర్తి కూడిన బెంచ్ ఈ సందర్భంగా ఫిర్యాదుదారు మద్దిరాల సుబ్బారావును మందలించింది. గుంటూరు జిల్లా మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా వైద్య అధికారులుగా పనిచేస్తున్న డాక్టర్ నేహా, డాక్టర్ ప్రియాంకలను స.హ. చట్టం ఫిర్యాదుదారు మద్దిరాల సుబ్బారావు, అతని సహచరులు వైద్యురాళ్లకు ఇష్టానుసారం అర్ధరాత్రి వేళల్లో ఫోన్లు చేసి బెదిరించడం, సందేశాలు పంపడం, అనుమతి లేకుండా వీడియోలు ఫోటోలు, చిత్రీకరించడం వంటి విషయాలపై కమిషన్ తీవ్రంగా స్పందించింది. సమాచార హక్కు చట్టం అనేది పారదర్శకంగా, జవాబుదారీతనంగా ఉండాలి తప్ప వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు వేదిక కాకూడదని బెంచ్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా "సీబీఎస్ఈ వర్సెస్ ఆదిత్య బందోపాధ్యాయ (2011) 8 ఎస్సీసీ 497" కేసులో గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, కేంద్ర సమాచార కమిషన్ సంబంధిత నిర్ణయాలను ప్రస్తావిస్తూ– పదేపదే ఇబ్బంది పెట్టేలా ఆర్టీఐ దరఖాస్తులు పెట్టడం, ప్రభుత్వ అధికారుల పనికి ఆటంకం కలిగించేలా ఉండకూడదని ధర్మాసనం తేల్చి చెప్పింది. దీంతోపాటు వైద్యురాళ్ల పట్ల అభ్యంతరకరంగా వ్యవహరించిన విషయంపై గుంటూరు జిల్లా ఎస్పీ తగిన విచారణ చేయాలని ఆదేశించింది. మహిళా వైద్యురాళ్ల భద్రత, రాత్రివేళ పని ప్రదేశాల్లో తీసుకోవలసిన చర్యలను పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి కమిషన్ బెంచ్ సూచించింది. సమాచార హక్కు చట్టాన్ని నిబద్ధతగా, నిజాయతీ గా ఉపయోగించాలని ఈ సందర్భంగా బెంచ్ అభిప్రాయపడింది.

9.24 లక్షల బీసీ కుటుంబాలకు సౌర విద్యుత్ దిశగా ఏపీ అడుగులు

రూ.5,544 కోట్ల కేంద్ర ఆర్థిక సాయానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
'పీఎం సూర్య ఘర్' బీసీలకు వర్తింపచేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ
రూ.1,848 కోట్ల సబ్సిడీని భరించనున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం:

ఆంధ్రప్రదేశ్‌లోని 9,24,069 బీసీ కుటుంబాలకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ప్రయోజనాలను విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ సమర్పించారు. తొలి విడతలో సుమారు 1,848 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయదలిచినట్టు సీఎం తెలిపారు. ప్రతి అర్హులైన బీసీ కుటుంబానికి కేంద్ర ఆర్థిక సహాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల సబ్సిడీ అందించనుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.5,544 కోట్ల కేంద్ర ఆర్థిక సహాయం, రూ.1,848 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ సహాయం అవసరమవుతాయని వివరించారు. మిగిలిన ప్రాజెక్టు వ్యయాన్ని సంస్థాగత రుణాల ద్వారా సమీకరించాలని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. దీనివల్ల లబ్ధిదారులపై ముందస్తు ఆర్థిక భారం పడకుండా సౌర విద్యుత్ సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికలను ఈ ఏడాది సెప్టెంబర్ 8న కేంద్రానికి సమర్పించినట్లు సీఎం వెల్లడించారు. వాటికి ఆమోదం తెలుపుతూ 9,24,069 బీసీ కుటుంబాలకు పథకం వర్తింపజేయాలని, దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే 4,56,235 గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేశామని, ఈ ఏడాది అక్టోబర్ 13 నాటికి ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో నాలుగో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో పేర్కొన్నారు. తాజా ప్రతిపాదన ఆమోదం పొందితే రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగం మరింత విస్తరించడంతో పాటు బీసీ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

పోర్టులు, పెట్రో కెమికల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు సహకరించండి

అమరావతిలో ఖతార్ కార్యాలయం ఏర్పాటు చేయండి : సీఎం చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం:లి సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భారత్‌లో ఖతార్ రాయబారి మహ్మద్ హసన్ జబీర్ అల్ జబీర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భవిష్యత్ ప్రాజెక్టులపై ఇరువురు చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, లాజిస్టిక్స్ పార్కులు, హాస్పిటాలిటీ రంగాల్లో అత్యుత్తమ ప్రాజెక్టులు ఉన్నాయని హసన్ అల్ జబీర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఎయిర్‌లైన్స్ రంగంలో ఖతార్ అత్యంత ప్రీమియం సేవలను అందిస్తోందని అన్న పేర్కొనగా... భారత్–ఖతార్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని, రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా కల్చర్‌తో పాటు ఫుడ్ ఇండస్ట్రీలోనూ అత్యుత్తమ నాణ్యతను అందిస్తున్నామని సీఎం వివరించారు. సాంకేతికతను వినియోగించుకుని రాష్ట్రంలో సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. భారత్‌లో పెట్టుబడులకు ఖతార్ ఆసక్తి చూపడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల అభివృద్ధి పట్ల తమ విజన్‌ను అభినందించినందుకు రాయబారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని పోర్టులు, పెట్రో కెమికల్ ప్లాంట్లు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు ఖతార్ సహకారం అందించాలని కోరారు. ఖతార్ ఎయిర్‌వేస్ కనెక్టివిటీ పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తుందని చెప్పారు. అమరావతిలో ఖతార్ దేశ కార్యాలయాన్ని ఏర్పాట చేసే అంశాన్ని పరిశీలించాలని రాయబారిని సీఎం చంద్రబాబు కోరారు. గతంలో భారత్‌లో ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు ఖతార్ ఆసక్తి ప్రకటించిందని రాయబారి మహ్మద్ హసన్ అల్ జబీర్ సీఎం చంద్రబాబుతో అన్నారు. ఏపీలో ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రాజక్టులు, భవిష్యత్ ప్రణాళికలపై మీర ఇచ్చిన ప్రజెంటేషన్లు అద్భుతంగా ఉన్నాయని సీఎం చంద్రబాబును ప్రశంసించారు. ఖతార్ నుంచి అధికారిక బృందం త్వరలోనే ఏపీలో పర్యటిస్తుందని హామీ ఇచ్చారు. ఇతర దేశాల్లో పనిచేస్తోన్న ఖతార్ కంపెనీలు ఏపీలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఖతార్ ఎయిర్‌వేస్ కనెక్టివిటీని దేశంలోని వివిధ నగరాలకు పెంచే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గేట్ వే భోగాపురం ఎయిర్‌పోర్ట్

- **యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది**
- **ఔత్సాహికుల ఆలోచనలను ఆచరణలో తేవడమే బ్రాండ్ ఆంధ్ర ప్రత్యేకత**
- **విశాఖలో సినిమా, క్రియేటర్ ఎకానమీ అభివృద్ధికి సహకారం అందిస్తాం**
- **నటుడు రానా దగ్గుబాటితో పాడ్‌కాస్ట్‌లో మంత్రి నారా లోకేష్**



ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం: విశాఖ నగరం రాష్ట్రానికి ప్రవేశ ద్వారం అయితే, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గేట్ వే లాంటిదని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖలో 31వ సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ లో 'ది పవర్ ఆఫ్ పాసిబిలిటీ: బిల్డింగ్ పార్ట్‌నర్‌షిప్స్, క్రియేటింగ్ ది ఫ్యూచర్' అనే అంశంపై ప్రముఖ సినీనటుడు రానా దగ్గబాటి నిర్వహించిన పాడ్ కాస్ట్ కు మంత్రి లోకేష్ అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... భోగాపురం ఎయిర్ పోర్టు హైదరాబాద్ విమానాశ్రయం కంటే పెద్దదిగా ఎదిగిన రోజే తనకు నిజమైన సంతృప్తి కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇలాంటి పెద్ద లక్ష్యాలు కీలకమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల అవకాశాలు, బ్రాండ్ ఆంధ్ర, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పర్యాటక అభివృద్ధి, సినిమా పరిశ్రమ, క్రియేటర్ ఎకానమీ, యువతకు ఉపాధి––వ్యాపార అవకాశాలు తదితర అంశాలపై రానా అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సూటిగా సమాధానాలిచ్చారు.

రాష్ట్రాభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్

రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై ప్రభుత్వానికి స్పష్టమైన రోడ్ మ్యాప్ ఉంది. విశాఖను దేశానికి ఆర్థిక శక్తి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న నమ్మకంతో పనిచేస్తున్నాం. క్వాంటం కంప్యూటింగ్ ప్రాజెక్టును ఉదాహరణగా వివరిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఆలోచనను ముందుకు తీసుకొచ్చి, నిపుణులు, ప్రపంచ స్థాయి సంస్థలను ఒకచోట చేర్చి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రయత్నంలో భాగంగా అమరావతిలో భారతదేశంలోనే తొలి 156 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయబోతున్నాం.

పర్యాటక రంగంలో అపారమైన అవకాశాలు విశాఖపట్నంలో ప్రస్తుతం సుమారు 17 స్టార్ హోటళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ లాంటి భారీ అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించాలంటే మరింత పెద్ద స్థాయిలో ఆతిథ్య రంగ మౌలిక సదుపాయాలు అవసరం. ఆలయ పర్యాటకం, బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు, అరకు వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయాల్సి ఉంది. అరకు లోయలో మారథాన్ నిర్వహణకు మహీంద్రా సంస్థతో చర్చలు జరుపుతున్నాం. చంద్రబాబు నాయుడు అరకు కాఫీని ప్రపంచ బ్రాండ్‌గా తీర్చిదిద్దిన విధానం అద్భుతం. మన ప్రాంతీయ ప్రత్యేకతలపై మనకు నమ్మకం ఉండాలి, వాటికి తగిన గుర్తింపు తీసుకొచ్చేలా ఆ బ్రాండ్ ను ప్రమోట్ చేయాలి.

విశాఖలో క్రియేటర్ ఎకానమీకి పెద్దపీట

సినిమా పరిశ్రమ మద్రాసు నుంచి హైదరాబాద్‌కు మారి అక్కడ స్థిరపడినట్టే, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలన్న రానా ప్రశ్నకు లోకేశ్ సమాధానమిస్తూ.. క్రియేటర్ ఎకానమీ భవిష్యత్తులో అతిపెద్ద అవకాశాల్లో ఒకటి. సినిమాలు, యూట్యూబ్, గేమింగ్ అన్నీ ఇందులో భాగమే. నా కుమారుడు దేవాన్ష్‌కు కూడా సొంత యూట్యూబ్ ఛానల్ ఉంది. రాష్ట్రంలోని పిల్లలు, కళాశాల విద్యార్థుల్లోనూ ఇలాంటి సృజనాత్మకత ఉంది, చేతిలో ఉన్న ఫోన్‌తోనే వీడియోలు రూపొందించే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. హైదరాబాద్‌లో నిర్మాతలు, దర్శకులకు స్థలాలు కేటాయించి స్టూడియోలు నిర్మించుకునేలా ప్రోత్సహించడంతో షూటింగ్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ వరకు అవసరమైన సదుపాయాలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ సినిమా నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలు ఒకేచోట అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

ఉమ్మడి ప్రణాళికకు ప్రభుత్వం సిద్ధం

ప్రభుత్వం నుంచి సహకారం, పరిశ్రమ నుంచి చొరవ ఉంటే విశాఖలోనూ సినిమా పరిశ్రమకు మంచి అవకాశాలు సృష్టించవచ్చని రానా చెప్పారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. రానా ఇందుకు ఈ బాధ్యత తీసుకోవాలని, సినిమా, గేమింగ్ రంగాల్లో ఆయనకున్న అనుభవాన్ని ఉపయోగించి ఆంధ్రప్రదేశ్‌లో క్రియేటర్లకు అవసరమైన సదుపాయాలపై ఉమ్మడి ప్రణాళిక రూపొందిద్దామని ప్రతిపాదించారు. ఇందుకు రానా స్పందిస్తూ...వైజాగ్‌లో సినిమా రంగంతో పాటు ఇతర క్రియేటివ్ రంగాల వారికి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. దీనిపై బ్లూప్రింట్ ను సోమవారం ఉదయానికల్లా సిద్ధం చేస్తానని రానా చెప్పగా, అదే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని లోకేష్ చమత్కరించారు.

ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త

విశాఖలో ఐటీ, డేటా సెంటర్లు, హాస్పిటాలిటీ రంగాల్లో పెట్టుబడులు పెరుగుతున్నాయి. 58కి పైగా దేశాల ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు ఈ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యారు. రష్యా, జపాన్, యూరప్ తదితర ప్రాంతాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాం. ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్‌లో ఒక సంస్థ భారీ యంత్ర పరికరాల తయారీతో పాటు క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన విడిభాగాలను కూడా తయారు చేస్తోంది. ఇది రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక ప్రతిభకు నిదర్శనం. పెట్టుబడుల ఒప్పందాలు, ఉద్యోగాల కల్పన ఒక లక్ష్యమైతే.. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే మా ప్రధాన ధ్యేయం.

వైఫల్యాలను అవకాశాలుగా మలచుకోవాలి

ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మంత్రి లోకేష్ మాట్లాడుతూ...ముందుగా మనపై మనకు నమ్మకం ఉండాలి. ప్రతికూల అభిప్రాయాలను పట్టించుకోకుండా లక్ష్యం వైపు సాగాలి. కొత్త ఆలోచనలను మొదట్లో సమాజం వ్యతిరేకించవచ్చు. అయితే మారేకొద్దీ సానుకూలత లభిస్తుంది. వైఫల్యాన్ని ఎదుగుదలలో భాగంగా స్వీకరించాలి. వైఫల్యం ఎదురైతే సమాజం ఏమనుకుంటుందోనన్న భయాన్ని అధిగమించాలి. ఫీూ×ూ అంటే ప్రతి ప్రయత్నం నుంచి నేర్చుకుంటూ మానసికంగా దృఢంగా ఎదగాలి. ఈ విషయంలో చంద్రబాబు గారిని యువత ఆదర్శంగా తీసుకోవాలి. పాతికేళ్ల వయసులో ఎమ్మెల్యే కావాలని చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకుని అనుకున్నది సాధించారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రారంభానికి ముందు ఆయన చేసిన మూడు వ్యాపార ప్రయత్నాలు విఫలమైనప్పటికీ వెనక్కి తగ్గలేదు, స్వయంగా నిలదొక్కుకుని వ్యాపారాన్ని నిర్మించాలన్న లక్ష్యాన్ని వదులుకోలేదు. అదే పట్టుదలను రాజకీయాల్లోనూ కొనసాగించారు. లక్ష్యాన్ని సాధించాలనే తపన, కష్టాలను అధిగమించే పట్టుదల ఉండాలన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

యువత రాజకీయాల్లోకి రావాలి. ప్రస్తుతం రాజకీయాల్లో యువతకు మంచి అవకాశాలున్నాయి. విశాఖ మేయర్‌తో పాటు పలువురు యువ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు బాధ్యతలు ఇటీవల ఎన్నికయ్యారు. 25 మంది మంత్రుల్లో 17 మంది యువకులే. విదేశాల నుంచి తిరిగొచ్చి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన కొండపల్లి శ్రీనివాస్ ఇందుకు ఉదాహరణ. వ్యవస్థలో లోపాలున్నాయని విమర్శించడం కాదు, వాటికి పరిష్కారాలు చూపించే ప్రక్రియలో యువత భాగస్వాములు కావాలి. సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులు, సంస్థలు, ప్రజాప్రతినిధులను కలుస్తూ పట్టుదలతో పనిచేయాలి. పెద్ద కలలు కనడంతోపాటు వాటిని సాధించేందుకు ప్రణాళికలు రూపొందించడం, ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి పనిచేయడం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుంది.

వినోద రంగంలో యువతకు శిక్షణ

సినిమా, సంగీతం, యానిమేషన్, గేమింగ్ వంటి రంగాల్లో యువతకు శిక్షణ అందించేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. సంగీత దర్శకులు, సినిమా రంగంలోని అనుభవజ్ఞులతో కలిసి యువతకు శిక్షణ కార్యక్రమాలు రూపొందిస్తాం. సంగీత శిక్షణ కోసం థమన్‌తో కలిసి పనిచేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం. తిరుపతిలోనూ ఇందుకోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. దర్శకత్వం, సినిమాటోగ్రఫీ సహా వివిధ విభాగాల్లో నిపుణుల అనుభవాన్ని యువతకు అందించాలన్నది మా ఆలోచన. దీనికి కృత్రిమ మేధస్సు (ూ×) వంటి ఆధునిక సాంకేతికతను జోడిస్తాం. తద్వారా వినోద రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తాం. యువతలో ఏదో ఒకటి సాధించాలనే బలమైన తపన ఉండాలి, అదే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుందని మంత్రి లోకేష్ అన్నారు.

ఏడాదిలో విశాఖలో సినీ నిర్మాణ కార్యకలాపాలు

రాబోయే ఏడాదిలో విశాఖపట్నంలో తమ సంస్థ తరఫున సినీ నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా కృషిచేస్తానని నటుడు రానా చెప్పారు. విశాఖపట్నం సిటీ ఆఫ్ డెస్టినీ, ఈ నగరానికి ప్రత్యేకమైన ఆకర్షణ ఉందని పేర్కొంటూ.. ఏపి ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలతో పాటు ప్రపంచానికి ఇంకా పూర్తిగా పరిచయం కాని ఎన్నో అందమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా మా ప్రయత్నాలను కొనసాగిస్తాం. తెలుగు ప్రేక్షకులు ఇతర భాషలు, దేశాల సినిమాలను కూడా ఆదరిస్తారు. భారతీయ వినోద పరిశ్రమ ఆదాయంలో తెలుగు ప్రేక్షకుల వాటా దాదాపు 70 శాతంగా ఉందని, భారత జనాభాలో తెలుగు ప్రజలు దాదాపు పదో వంతు మాత్రమే ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ఆదరణ ఉండటం మన ప్రత్యేకత. కొరియా, జపాన్ తదితర దేశాల సినిమాలు, సంస్కృతికి ఆంధ్రప్రదేశ్ స్వాగతం పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల ద్వారా దాదాపు 100 కోట్ల మంది భారతీయ ప్రేక్షకులకు చేరువయ్యే అవకాశం ఉంది. బాహుబలి సినిమాను దేశవ్యాప్తంగా పరిచయం చేసినట్టే, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గాథను ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని రానా పేర్కొన్నారు.

అంతరిక్ష రంగంలో నూతన గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దుతాం

స్పేస్ ఎకానమీ ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం -అంతరిక్ష ఆర్థిక వ్యవస్థపై ప్రత్యేక చర్చలో మంత్రి నారా లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం: అంతరిక్ష రంగంలో నూతన గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సీఐఐ సదస్సుల్లో భాగంగా రెండో రోజు 'కక్ష్య నుంచి అవకాశాల దిశగా: భారతదేశ నూతన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై జరిగిన ప్రత్యేక చర్చలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మోడరేటర్ గా బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ సీఈవో, సీటీవో రోహన్ గణపతి వ్యవహరించారు. ఈ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా నియంత్రించే అంతరిక్ష రంగంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమిటి అని అడిగారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను ఎలా అభివృద్ధి చేస్తున్నామో పరిశీలిస్తే, ముందుగా ఒక రంగాన్ని ఎంపిక చేసుకోవడం, ఆ రంగంలో పనిచేస్తున్న సంస్థలు, భాగస్వాములను గుర్తించడం, క్రమపద్ధతిలో పెట్టుబడులను ఆకర్షించడం, ఆయా రంగాలకు చెందిన కంపెనీలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం మా విధానం. దీనినే వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ అంటారు. వర్టికల్ ఇంటిగ్రేషన్ ద్వారా స్కైరూట్ వంటి అంతరిక్ష సంస్థలకు అవసరమైన విడిభాగాలను తయారు చేసే ఉపకరణాల తయారీ సంస్థలను ఒకే ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావడం లక్ష్యం. ఈ సంస్థలు తయారు చేసే విడిభాగాలు, ఉపవ్యవస్థల సహకారంతో స్కైరూట్ వంటి కంపెనీలు తమ రాకెట్ వాహనాలను రూపొందించి అంతరిక్షంలోకి ప్రయోగించగలుగుతాయి.

పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి

హారిజాంటల్ ఇంటిగ్రేషన్ విషయానికి వస్తే.. ఇక్కడ విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేయడం కీలకం. మన అకడమిక్ కరిక్యులమ్ ను ఆధునీకరించడం, పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ద్వారా పరీక్షలు, సర్టిఫికేషన్ వంటి సదుపాయాలను అభివృద్ధి చేయడం ఇందులో భాగం. ఇప్పటికే ఇంధన రంగంలో ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడానికి ఐఐటీ తిరుపతితో కలిసి పనిచేస్తున్నాం. ఎందుకంటే ఆ ప్రాంతంలోని పారిశ్రామిక క్లస్టర్‌కు అనేక ఇంగాట్, సోలార్, వేఫర్, సెల్ తయారీ సంస్థలు వచ్చాయి.



స్పేస్ సిటీ అభివృద్ధికి అవసరమైన పాలసీని రూపొందించాలి

ప్రస్తుతం దేశానికి అవసరమైనది స్పేస్ సిటీ అభివృద్ధికి అనుసంధానమైన సమగ్ర విధానం. అంతరిక్ష పరిశ్రమల ఏర్పాటు, వాటికి సంబంధించిన సంస్థలన్నింటినీ ఒకే వ్యవస్థలో అనుసంధానించే విధానాన్ని భారతదేశం ఇప్పుడు రూపొందించాల్సిన అవసరం ఉంది. ఆ తర్వాత రాష్ట్రాలు దూకుడుగా ముందుకు వెళ్లాలి. స్కైరూట్ వంటి కంపెనీలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్రాలకు తీసుకురావాలి. అనంతరం ఆ రంగానికి సంబంధించిన అన్ని సంస్థలు, విడిభాగాల తయారీదారులు, సరఫరాదారులను క్రమపద్ధతిలో గుర్తించాలి. వీరిలో అత్యధికులు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమదారులే. ఈరోజు నేను ఒక ఎంఎస్ఎంఈ సంస్థను కలిశాను. వారు రాకెట్‌కు అవసరమైన షీల్డ్‌ను తయారు చేస్తున్నారు. వారు ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్‌లో కూడా పాల్గొన్నారు. ఇలాంటి సంస్థలన్నింటినీ ఒకే ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావడమే అసలైన మార్పును తీసుకొస్తుంది. ఏపీ ఎన్డీయే పాలిత రాష్ట్రం. రాజకీయంగా కూడా కేంద్ర ప్రభుత్వంలో మాకు భాగస్వామ్యం ఉంది. అందువల్ల రాష్ట్ర ప్రయోజనాలతో పాటు దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విధానాల్లో సానుకూల మార్పులు తీసుకురావడంలో మా వంతు పాత్ర పోషించే అవకాశం మాకు ఉంది. అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో మాత్రం డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ఎందుకంటే ఇతర రాష్ట్రాలు అందుకోలేని వేగంతో ముందుకు వెళ్లగలిగే ఇద్దరు గొప్ప నాయకులు మనకు ఉన్నారు. మొత్తం అంతరిక్ష ఎకోసిస్టమ్ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం పోషించగలిగే పాత్ర ఇదే.

ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0, ప్రతిపాదిత తిరుపతి స్పేస్ సిటీ వంటి కార్యక్రమాల ద్వారా అంతరిక్ష, ఏరోస్పేస్ పరిశ్రమలకు ఒక ముఖ్యమైన గమ్యస్థానంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోంది. రాబోయే ఐదేళ్లలో భారతదేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ ఏ విధమైన గుర్తింపు పొందాలని మీరు కోరుకుంటున్నారు, అలాగే ఇతర ప్రాంతాలతో పోలిస్తే ప్రపంచస్థాయి అంతరిక్ష సంస్థలు ఏపీని ఎంచుకునేలా చేసే ఒక ప్రధాన ప్రత్యేకత ఏమిటనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత స్పీడ్. మేం పనులను చాలా వేగంగా పూర్తి చేస్తాం. ఎందుకంటే ఇక్కడ ఉన్న యువత అవకాశాల కోసం అన్వేషిస్తున్నారు. తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని కోరుకుంటున్నారు. అందుకే ఇతర రాష్ట్రాలతో పోటీపడటంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన బలం మా పని వేగమే. ఇది మొదటి అంశం.

ప్రయోగ వ్యయాన్ని తగ్గించాలి

పాశ్చాత్య దేశాల్లో, అలాగే చైనాలో జరుగుతున్న పరిణామాలను మీరందరూ గమనిస్తూనే ఉంటారు. వారు అంతరిక్ష ప్రయోగాల ఖర్చును ఏ విధంగా తగ్గించగలుగుతున్నారు? ఈ అంశంపై మనమందరం కలిసి ఆలోచించాలి. సమష్టిగా ఒక వ్యూహాన్ని రూపొందించాలి. అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించడానికి ప్రైవేట్ రంగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధంగా కలిసి పనిచేయాలన్నది మనం నిర్ణయించుకోవాలి. ఎందుకంటే అంతరిక్ష రంగంలో అసలైన ప్రత్యేకత ఇదే. ఈ రంగం మధ్యకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధికి, సుస్థిరతకు ఇది ఎంతో కీలకమని నేను విశ్వసిస్తున్నాను.

స్పేస్ ఎకానమీ ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేయాలి అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ చుట్టూ ఒక సమగ్ర ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందాలని నేను కోరుకుంటున్నాను. ప్రస్తుతం మనం ఈ రంగంలో అవకాశాలను అర్థం చేసుకునే ప్రారంభ దశలోనే ఉన్నాం. ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్భుతమైన స్టార్టప్ సంస్థలను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఈ రంగంలో మనం ఒక సానుకూల ఉత్సాహాన్ని, ఆసక్తిని సృష్టించగలిగామని నేను భావిస్తున్నాను. కేవలం ప్రోత్సాహకాలతో ఒక ఎకోసిస్టమ్‌ను నిర్మించలేం. ఇందుకు విధానపరమైన ఆలోచనలు, నాయకత్వం కలిగిన వారందరినీ ఒకచోట చేర్చడం అవసరం. పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావాలి. విద్యాసంస్థలను భాగస్వాములుగా చేయాలి. పరిశ్రమలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారుల మధ్య సమన్వయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ కలిసినప్పుడే ఒక బలమైన, అభివృద్ధి చెందుతున్న ఎకోసిస్టమ్‌ను సృష్టించగలం. ఆంధ్రప్రదేశ్‌లో మనం చూడబోయేది ఇదే. గౌరవ సీఎం గారు ఒక లక్ష్యాన్ని కలగంటే.. దాన్ని సాకారం చేస్తారు. ఆయన కలలను నిజం చేయడం మా బాధ్యత అని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇస్రో ఇండియన్ ఆస్ట్రోనాట్ ఎయిర్ కమోడోర్ ప్రశాంతి బి.నాయర్, అగ్నికుల్ కో–ఫౌండర్, సీఈవో శ్రీనాథ్ రవిచంద్రన్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కే.ఎన్.సత్యనారాయణ, గెలాక్స్ఐ ఫౌండర్, సీఈవో సుయాష్ సింగ్, స్కైరూట్ ఏరోస్పేస్ కో–ఫౌండర్, సీటీవో డాకా నాగ భరత్ పాల్గొన్నారు.

ప్రజాభూమి
పోలవరం
11
శనివారం 14 నవంబరు 2026

కుందులూరు సర్పంచ్ అభ్యర్థిగా సాధల నరేంద్రరెడ్డి ఏకగ్రీవ ఎంపిక!

ఎస్టీ కొండరెడ్డి సామాజిక వర్గానికి చెందిన నరేంద్రరెడ్డికి పంచాయతీ పెద్దలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల మద్దతు.. ఏకాభిప్రాయంతో అభ్యర్థిత్వానికి ఆమోదం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలంలోని కుందులూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సాధల నరేంద్రరెడ్డి (ఎస్టీ కొండరెడ్డి) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన అభ్యర్థిత్వానికి పంచాయతీ పెద్దలు, వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో అందరి సమక్షంలో సాధల నరేంద్రరెడ్డి పేరును సర్పంచ్ అభ్యర్థిగా ప్రతిపాదించగా, నాయకులు, గ్రామ పెద్దలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గ్రామంలో ఐక్యతను కాపాడుతూ, ప్రజలందరినీ కలుపుకొని ముందుకు సాగేందుకు ఏకాభిప్రాయంతో అభ్యర్థిని ఎంపిక చేయడం శుభపరిణామమని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. సర్పంచ్ అభ్యర్థిగా ఎంపికైన సాధల నరేంద్రరెడ్డికి గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ బంధం రాజు, మాజీ వార్డు మెంబర్ మడివి లక్ష్మయ్య, తెల్లం తమ్మయ్య, గొంది రాజు, కుంజా దూలయ్య, కొక్కెర వెంకటేష్, తెల్లం రాజు, బంధం రాజారావు, కదల గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు.. పుట్టల వద్ద పోటెత్తిన భక్తజనం!

- తెల్లవారుజాము నుంచే నాగేంద్రునికి ప్రత్యేక పూజలు.. పాలు, చిమ్మిలి, గుడ్లు, తాటితేగలు నైవేద్యంగా సమర్పణ
- కుటుంబ క్షేమం, సంతాన సౌభాగ్యం, సర్పదోష నివారణ కోసం భక్తుల మొక్కులు







ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలంలో నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే మండలంలోని పలు గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు కుటుంబ సమేతంగా సమీపంలోని అటవీ ప్రాంతాలకు చేరుకుని నాగేంద్రుని పుట్టల వద్ద భక్తిపారవశ్యంతో పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా మహిళలు, పురుషులు, చిన్నారులు తెల్లవారుజామునే నిద్రలేచి పవిత్ర స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి పూజా సామగ్రితో నాగేంద్రుని పుట్టల వద్దకు తరలివెళ్లారు. అక్కడ పుట్టల పరిసరాలను శుభ్రపరిచి, పసుపు, కుంకుమలు సమర్పించి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగదేవతకు ప్రీతికరమైనవిగా భావించే పాలు, చిమ్మిలి, గుడ్లు, తాటితేగలు తదితర పదార్థాలను నైవేద్యంగా సమర్పించి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలు కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు ఉపవాసాలు కాచి పండుగ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

సర్పదేవత ఆరాధనకు ప్రత్యేక ప్రాధాన్యం

హిందూ ధార్మిక సంప్రదాయంలో నాగులచవితికి విశేషమైన ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కార్తీక మాసంలో వచ్చే నాగులచవితి పర్వదినాన్ని భక్తులు అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారు. సర్పజాతికి అధిదేవతలుగా భావించే నాగేంద్రుడిని ఆరాధించడం ద్వారా కుటుంబానికి శుభం కలుగుతుందని, సర్పభయం తొలగిపోతుందని, సర్పదోషాల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. పురాణ గాథలు, పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాల నేపథ్యంలో నాగపూజకు ఎంతో ప్రాముఖ్యత ఏర్పడింది. నాగదేవతను పూజించడం ద్వారా సంతాన సౌభాగ్యం, కుటుంబ అభివృద్ధి, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తులు నమ్ముతారు. ముఖ్యంగా మహిళలు తమ కుటుంబ సభ్యుల క్షేమం, పిల్లల ఆయుష్షు, సుఖసంతోషాల కోసం ప్రత్యేకంగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రకృతితో ముడిపడిన ఆధ్యాత్మిక సంప్రదాయం

నాగులచవితి పండుగ కేవలం పూజా కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రకృతిలోని జీవరాశుల పట్ల గౌరవం, జీవవైవిధ్య పరిరక్షణ సందేశాన్ని కూడా అందిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ ఆధారిత గ్రామీణ జీవనంలో పాములు ఎలుకల సంఖ్యను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల సర్పాలను దైవ స్వరూపంగా భావించి పూజించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. మండలంలోని గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పుట్టల వద్ద భక్తుల రాకపోకలు కొనసాగాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పూజల్లో పాల్గొనడంతో పలు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు సైతం పెద్దలతో కలిసి పూజల్లో పాల్గొని సంప్రదాయాల గురించి తెలుసుకున్నారు. మొత్తంగా నాగులచవితి వేడుకలు మండలవ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని భక్తుల ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా ముగిశాయి.

చింతూరు లేదా ఎటపాకలో రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మంజూరు చేయాలని హైకోర్టు న్యాయమూర్తులకు వినతి

- సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న గిరిజన కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులు
- ప్రయాణ ఖర్చులతో పాటు రోజువారీ కూలీ నష్టం.. స్థానికంగానే సత్వర న్యాయం అందించాలని విజ్ఞప్తి







ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

పోలవరం జిల్లాలోని నాలుగు విలీన మండలాల ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో చింతూరు లేదా ఎటపాకలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును శాశ్వతంగా ఏర్పాటు చేయాలని విలీన మండలాల న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ బట్టు దేవానంద్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌లకు అధికారికంగా వినతిపత్రాలు సమర్పించారు. పోలవరం జిల్లాలోని చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైనప్పటి నుంచి స్థానికంగా పూర్తిస్థాయి న్యాయస్థానం లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యాయవాదులు వినతిపత్రంలో వివరించారు. ముఖ్యంగా గిరిజన కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులు కోర్టు విచారణల కోసం సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీంతో ప్రయాణ ఖర్చుల రూపంలో ఆర్థిక భారం పడటమే కాకుండా, రోజువారీ కూలీ పనులకు వెళ్లే పేద గిరిజనులు విచారణలకు హాజరయ్యే సమయంలో ఉపాధిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా కోర్టు అందుబాటులో లేకపోవడం వల్ల కేసుల విచారణలో జాప్యం జరుగుతోందని, ప్రజలకు సత్వర న్యాయం అందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో నాలుగు మండలాలకు అనుకూలమైన రవాణా సౌకర్యాలు ఉన్న చింతూరు రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో గానీ, ఎటపాక మండల కేంద్రంలో గానీ పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు ఏర్పాటు ద్వారా గిరిజనులు, పేద ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లే వ్యయప్రయాసలు తగ్గడంతో పాటు న్యాయ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయం ప్రజల గడప వద్దకే చేరాలంటే విలీన మండలాల్లో శాశ్వత న్యాయస్థానం ఏర్పాటు ఆవశ్యకమని, ఈ అంశంపై ఉన్నత న్యాయస్థానం, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల బృందం కోరింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, విలీన మండలాల న్యాయవాదుల సంఘం సభ్యులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, వలవల సురేష్ కుమార్, కొత్తపల్లి రాంబాబు, విజ్జగిరి రవితేజ, సున్నం వెంకటరమణ, మోసం సంజీవరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

దోమల నివారణకు దోమతెరలే రక్షణ కవచం!

ఐదు గ్రామాల్లో మూడో విడత దోమతెరల పంపిణీ.. వినియోగంపై ప్రజలకు అవగాహన





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

మలేరియా, డెంగ్యూ వంటి దోమకాటు ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణే లక్ష్యంగా రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మూడో విడత దోమతెరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పోలవరం జిల్లా కలెక్టర్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్ఓ, జిల్లా మలేరియా అధికారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సహకారంతో రేఖపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలోఫర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ విడతలో భాగంగా తమ్మాయిపేట, కిష్టవరం, ప్రతిపాక, తుష్టివారిగూడెం, గుండుగూడెం గ్రామాల్లో ప్రజలకు దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రాజేష్ మాట్లాడుతూ దోమతెరలను సరైన పద్ధతిలో వినియోగించడం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. దోమతెరలను మొదటిసారి ఉపయోగించే ముందు నీడలో ఆరబెట్టాలని, ప్రతిరోజూ సాయంత్రం వేళ మంచానికి నాలుగు వైపులా కర్రల సహాయంతో సక్రమంగా కట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన దోమతెరలను ఇతరులకు విక్రయించకూడదని, బహుమతిగా కూడా ఇవ్వకూడదని తెలిపారు. నెల రోజుల తర్వాత దోమతెరను శుభ్రం చేయాల్సి వస్తే చల్లటి నీటితో మాత్రమే కడిగి నీడలో ఆరబెట్టాలని సూచించారు. దోమతెరలకు ముందుగానే క్రిమిసంహారక మందు పూసి ఉంటుందని, అందువల్ల సబ్బు, సర్ఫ్ లేదా ఇతర డిటర్జెంట్లను ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. దోమతెరలను బండకేసి బాదకూడదని, చేపలు పట్టడానికి ఇతర అవసరాలకు వినియోగించకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు అడ్డుకట్ట!

అదేవిధంగా శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి తొట్లలో నిల్వ ఉన్న నీటిని ప్రతి మూడు రోజులకు ఒకసారి మార్చుకోవాలని సూచించారు.

పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పనికిరాని వస్తువుల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వాటిని బోర్లించి ఉంచాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందడానికి అవకాశం లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రాజేష్, పీహెచ్ఎన్ భద్రకాళి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, రత్తయ్య, ఏఎన్ఎంలు మహేశ్వరి, శశికళ, ఆశా కార్యకర్తలు రత్నం, సంధ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన మండల అధ్యక్షుడు కుంజం సిద్దు



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

మండల కేంద్రం గంగవరం గ్రామంలో నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కుంజం సిద్దు నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని భక్తులు, మహిళలు గ్రామస్తులు నాగేంద్రుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు కుటుంబాల సుఖసంతో షాలు, ఆయురారోగ్యాలు,గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం భక్తులు ప్రార్థనలు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

-ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేత



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

పోలవరం జిల్లాలోని రంపచోడవరం,మారేడుమిల్లి,గంగవరం,అడ్డతీగల రాజమౌమ్మంగి, వై.రామవరం మండలాల పరిధిలో ఈ నెల 14వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది గోకవరం మండలం బావోజీపేట 220/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నుంచి రంపచోడవరం 220/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌కు వచ్చే హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ విద్యుత్ లైన్లలో వార్షిక మరమ్మతులు,ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు ప్రణాళిక రూపొందించారు ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు అయితే వినియోగదారులకు ఇబ్బందులు తగ్గించేందుకు గోకవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి రంపచోడవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ లైన్ల ద్వారా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు అయినప్పటికీ అధిక విద్యుత్ లోడ్, భద్రతా ప్రమాణాల కారణంగా కొంత సమయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు కావున విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అచ్యుతచారి ఒక ప్రకటనలో కోరారు.

పుస్తక పఠనంతో బాలల్లో మనోవికాసం, ఊహాశక్తి పెంపొందుతాయి

కథల పుస్తకాలు పిల్లల్లో జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి

బాలల సంక్షేమ శాఖ డైరెక్టర్ వి.వసంత బాల



ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

పిల్లలు కథల పుస్తకాలను చదవడం ద్వారా వారిలో మనోవికాసం కలుగుతుందని, ఊహాశక్తి పెంపొందడంతో పాటు జీవన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని బాలల సంక్షేమ శాఖ డైరెక్టర్ వి.వసంత బాల అన్నారు. కథల ద్వారా పొందే జ్ఞానం వారి భవిష్యత్తు జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. విజయవాడలోని కబేళా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో (జువెనైల్ హోం) శుక్రవారం పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 'లెర్న్ అండ్ హెల్ప్' కార్యక్రమంలో భాగంగా సి.ఎ. ప్రసాద్, హరి వెంకట రమణ అందించిన సహకారంతో సుమారు 100 కథల పుస్తకాలను బాలుర పరిశీలన గృహానికి అందజేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ వి.వసంత బాల మాట్లాడుతూ, పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం ద్వారా వారిలో మంచి ఆలోచనా విధానం, సృజనాత్మకత, విలువలు అలవడతాయని తెలిపారు. కథల పుస్తకాలు పిల్లలకు వినోదాన్ని అందించడంతో పాటు జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని కూడా పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ శరత్, అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

శనివారం, నవంబర్ 14, 2026

12

జనగణన రెండవ దశ ప్రక్రియ అత్యంత కీలకం

అధికారులు పూర్తి అవగాహనతో, కచ్చితత్వంతో విధులు నిర్వహించాలి

సెల్ఫ్ ఎన్యూమరేషన్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి ... జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

రాబోయే జనగణన (సెన్సస్) రెండవ దశ జనాభా గణన ప్రక్రియ అత్యంత కీలకమైనదని, చార్జ్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పూర్తి అవగాహనతో, సమన్వయంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఆదేశించారు. ప్రజలు స్వయంగా తమ వివరాలను https ://sc.census.gov.in నందు జనవరి 10,2027 నుండి జనవరి 24,2027 వరకు నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో పాల్గొనేలా విస్తృత ప్రచారం నిర్వహిం చాలని సూచించారు.స్థానిక కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శుక్రవారం జనగణన రెండవ దశ (పాపులేషన్ ఎన్యూమరేషన్)పై జిల్లా, చార్జ్ స్థాయి అధికారు లకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణా కార్యక్ర మాన్ని జాయింట్ కలెక్టర్ ప్రారం భించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ, జనాభా గణనలో భాగంగా మొత్తం 40 ప్రశ్నలతో కూడిన వివరాలను మొబైల్ యాప్ ద్వారా సేకరించాల్సి ఉంటుందని తెలిపారు.

జనవరి మొదటి వారం నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియను చివరి నిమిషంలో హడావుడి లేకుండా ముందస్తు ప్రణాళికతో 55 రోజుల వ్యవధిలో, ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని 647 బ్లాక్‌ల వారీగా ఎన్యూమరేటర్లకు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, సమాచారాన్ని కచ్చిత త్వంతో నమోదు చేసేలా నిరంతరం పర్యవేక్షించాల న్నారు. జనగణన అనేది చట్టబద్ధమైన ప్రక్రి య అని, ఎన్నికల విధుల తరహాలోనే దీనికి అ త్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జేసీ స్పష్టం చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లకు మొబైల్ యాప్ వినియోగం, బ్లాక్‌ల సరిహద్దుల సవరణ, సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానంపై ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అనంతరం మండ ల స్థాయిలో ఫీల్డ్ ట్రైనర్లు, ఎన్యూమరేటర్లకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలని సూచించారు.జిల్లా



రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం మాట్లా డుతూ, జనగణన రెండవ దశ షెడ్యూల్‌ను వివరించారు. జనవరి 10 నుంచి 24 వరకు 15 రోజుల పాటు సెల్ఫ్ ఎన్యూమరేషన్, జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు 35 రోజుల పాటు ఇంటింటి జనాభా గణన, అనంతరం మార్చి 1 నుంచి 5 వరకు రివిజన్ రౌండ్ నిర్వహించను న్నట్లు తెలిపారు.రాష్ట్ర జనగణన కార్యకలాపాల శాఖ జాయింట్ డైరెక్టర్ / సీఈఓ జి.ప్రసన్నకు మార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రెండవ దశ జనగణనలో ఎదురయ్యే సాంకేతిక అంశాలు, మొబైల్ యాప్ పనితీరు, బ్లాక్‌ల విభజన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచు కుని ఈసారి సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని, కన్వర్షన్ రేటును పెంచేందుకు అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు.ఈ శిక్షణా కార్యక్ర మంలో విజయవాడ ఆర్డిఓ వెన్నెల శ్రీను, తిరు వూ రు ఆర్డీఓ ఎ.కుమార్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఎ.రవీంద్రరావు మాస్టర్ ట్రైనర్ కొల్లేటి రమేష్, ఎన్టీఆర్, గుంటూ రు జిల్లాల సెన్సస్ ఇన్‌స్ట్రక్టర్లు సిహెచ్. వెంకటర మణ, వి.ఆదిలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు, చార్జ్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి బంగారు కానుక విరాశం

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి భక్తులు తమ భక్తిశ్రద్ధలతో బంగారు కానుకను సమర్పించారు.ముంబై (చెంబూరు) ప్రాంతానికి చెందిన భక్తులు శ్రీ జి.వి. వంశీకృష్ణ అమ్మవారికి కానుకగా 38.700 గ్రాముల (ముప్పై ఎనిమిది గ్రాముల ఏడు వందల మిల్లీగ్రాములు) బరువు గల బంగారు హారం (1) ను సమర్పించారు.ఈ బంగారు హారాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఈవో సీనా నాయక్ అందజేయగా, ఆలయ అధికారులు దానికి సంబంధించిన అధికారిక రసీదును దాతకు అందజేశారు. అనంతరం దాతకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి, వేద పండితుల ఆశీర్వచనా లతో పాటు అమ్మవారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయాలి



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

ఇటీవల జరిగిన మున్సిపల్, జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలలో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మచిలీపట్నం నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఇన్చార్జ్ హరి కుమార్ రాజు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హరి కుమార్ రాజు మాట్లాడుతూ అభ్యర్థులందరూ తమ తమ డివిజన్, మండల పరిధిలో ప్రజలతో మమేకమవ్వాలని వారి సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థులందరిని సుశిక్షితులైన సైనికుల మాదిరిగా పనిచేయాలని ప్రజాసేవకు పునరంకితం అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోటీ చేసిన అభ్యర్థులంద రినీ మచిలీపట్నం నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మచిలీపట్నం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ మతీన్ అధ్యక్షత వహించగా, ఏపీ బీసీ సెల్ చైర్మన్ శొంఠి నాగరాజు, పిసిసి డెలిగేట్ కోకా ఫణి భూషణ్, మేయర్ అభ్యర్థిని షేక్ రహీమున్నీసా, కార్పొరేటర్ అభ్యర్థులు షేక్ చోటే బాజీ, చిలుకోటి ప్రసాద్, వంక శ్రీను, అబ్దుల్ రౌఫా, పొట్లూరి అమ్మాజీ, షేక్ బాజీ వలి, మచిలీపట్నం సౌత్ జడ్పీటిసి అభ్యర్థి జన్ను వెంకటేశ్వరరావు, జిల్లా అసంఘటిత కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అయ్యూబ్, మహమ్మద్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో మంతెన రామరాజు జన్మదిన వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి మోపిదేవి

మోపిదేవి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన మోపిదేవిలో గల మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం రామరాజు పుట్టినరోజు వేడుకలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును రామరాజు కట్ చేయగా, పార్టీ నేతలు ఆయనకు కేకును తినిపిస్తూ, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మంతెన రామరాజు భవిష్య త్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. తన పుట్టినరోజు వేడుకలను మోపిదేవిలో ఏర్పాటుచేసిన పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా రామరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సి.డి.సి మాజీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావి రత్నగిరి, శ్రీ సకలేశ్వర స్వామి వారి దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ గవిని సమరామకృష్ణ, కో ఆప్షన్ మాజీ సభ్యులు చందన రంగారావు, మాజీ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, బీసీ సెల్ నేత కందుల బసవయ్య, యూనిట్ ఇంచార్జ్ గొరిపర్తి సత్యనారాయణ, కుక్కిలిగడ్డ గ్రామ ప్రధాన కార్యదర్శి మీసాల శివరాం, డోకిపర్తి బాలకోటేశ్వరరావు, బొర్రా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.





పచ్చదనం పెంపుదలకు ప్రత్యేక కార్యాచరణ

❖ డిస్ట్రిక్ట్ గ్రీనింగ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సొసైటీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి ❖ మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టి రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి ❖ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఎన్టీఆర్ జిల్లాలో పచ్చదనాన్ని మరింతగా పెంపొందించి, పర్యావరణ పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టే దిశగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారుజిల్లాలో గ్రీన్ కవర్‌ను విస్తరించడంతో పాటు మొక్కల పెంపకం, సంరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచిం చారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎన్టీఆర్ జిల్లాలో పచ్చదనం అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబ ద్ధంగా అమలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్న 'డిస్ట్రిక్ట్ గ్రీనింగ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ' సొసైటీ రిజిస్ట్రేషన్, భవిష్యత్ కార్యాచరణపై శుక్రవారం కలెక్టరేట్ ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరం నందు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏజెన్సీ సొసైటీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ఏర్పాటుకు సంబంధించిన అవసరమైన చర్యలను సమన్వయంతో చేపట్టి, తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలని సూచించారు. జిల్లాలో పచ్చదనం విస్తీర్ణాన్ని పెంచేందుకు అన్ని సంబంధిత శాఖలు తమ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమా లను సమగ్రంగా రూపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాలను గుర్తించడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించు కోవడం, నాటిన మొక్కల సంరక్షణకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై దృష్టి సారించా లన్నారు. పచ్చదనం పెంపుదల అనేది కేవలం మొక్కలు నాటడంతోనే పరిమితం కాకుండా, వాటిని సంరక్షించి పెరిగేలా చూడటంతోనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ దిశగా అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో పచ్చదనం అభివృద్ధి కార్యక్రమాలను ఒక ఉద్యమంలా చేపట్టి, ప్రజల భాగస్వామ్యంతో విస్తృతంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతూ, గ్రీనింగ్ కార్యక్రమాల అమలులో రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వర్తిస్తూ, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆమె సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో డిస్ట్రిక్ట్ గ్రీనింగ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి సుబ్రహ్మణ్యం రాఘవరావు, జిల్లా అటవీ శాఖ అధికారి జి.సతీష్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.సుశీల, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.బాలాజీ కుమార్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి సీతామహాలక్ష్మి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.రాము, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎవియన్. నాంచారారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల దేవి, తదితరులు పాల్గొన్నారు.

9.24 లక్షల బీసీ కుటుంబాలకు సౌర విద్యుత్ దిశగా ఏపీ అడుగులు

❖ రూ.5,544 కోట్ల కేంద్ర ఆర్థిక సాయానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి ❖ 'పీఎం సూర్య ఘర్' బీసీలకు వర్తింపచేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ ❖ రూ.1,848 కోట్ల సబ్సిడీని భరించనున్న రాష్ట్ర ప్రభుత్వం



ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం:

ఆంధ్రప్రదేశ్‌లోని 9,24,069 బీసీ కుటుంబాలకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ప్రయోజనాలను విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ సమర్పించారు. తొలి విడతలో సుమారు 1,848 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయదలిచినట్లు సీఎం తెలిపారు. ప్రతి అర్హులైన బీసీ కుటుంబానికి కేంద్ర ఆర్థిక సహాయానికి అదనంగా రాష్ట్ర ప్రభు త్వం రూ.20 వేల సబ్సిడీ అందించనుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.5,544 కోట్ల కేంద్ర ఆర్థిక సహాయం, రూ.1,848 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ సహాయం అవసరమవుతాయని వివరిం చారు. మిగిలిన ప్రాజెక్టు వ్యయాన్ని సంస్థాగత రుణాల ద్వారా సమీకరించాలని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. దీనివల్ల లబ్ధిదారులపై ముందస్తు ఆర్థిక భారం పడకుండా సౌర విద్యుత్ సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికలను ఈ ఏడాది సెప్టెంబర్ 8న కేంద్రానికి సమర్పించినట్లు సీఎం వెల్లడించారు. వాటికి ఆమోదం తెలుపుతూ 9,24,069 బీసీ కుటుంబాలకు పథకం వర్తింపజేయాలని, దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే 4,56,235 గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేశామని, ఈ ఏడాది అక్టోబర్ 13 నాటికి ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో నాలుగో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో పేర్కొన్నారు. తాజా ప్రతిపాదన ఆమోదం పొందితే రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగం మరింత విస్తరించడంతో పాటు బీసీ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

శబరిమల యాత్రికుల భద్రతకు సమగ్ర చర్యలు చేపట్టాలి

కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు డా. బూరగడ్డ శ్రీనాథ్ వినతి



మచిలీపట్నం, (ప్రజాభూమి ప్రతినిధి):

శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి దేశవ్యా ప్తం గా తరలివచ్చే లక్షలాది మంది భక్తుల భద్రతకు అ త్యం త ప్రాధాన్యతనిస్తూ సమగ్ర మౌలిక సదుపా యాలు కల్పించాలని డా. బూరగడ్డ శ్రీనాథ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రజా ఫిర్యాదుల పరిష్కార పోర్టల్ ద్వారా నవంబర్ 13న వినతిని నమోదు చేశా రు. శబరిమల యాత్రా సమయంలో భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రైల్వే స్టేషన్లు, రహదారులు, ప్రవేశ మార్గాల్లో రద్దీ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో చోటుచేసుకున్న విషాద ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.భక్తుల సంఖ్యకు అనుగుణంగా వసతి, విశ్రాంతి కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు, యాత్రికులు అధికంగా ప్రయాణించే రైల్వే స్టేషన్లలో అదనపు సౌకర్యాలు కల్పిం చాలని సూచించారు. రైల్వే స్టేషన్లు, బస్సు కేంద్రాలు, రహదారులు, యాత్రా ప్రాంతాల మధ్య సమర్థవంతమైన రవాణా అనుసంధానం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. శాస్త్రీయ విధానాలతో రద్దీ నియం త్రణ, అత్యవసర వైద్య సేవలు, తాగునీరు, మరుగుదొడ్లు, సమాచార కేంద్రాలు వంటి ప్రాథ మిక సౌకర్యాలను విస్తరించాలని కోరారు.అదేవి ధంగా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అత్యవసర తరలింపు మార్గాలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రతి యాత్రా సీజన్ ప్రారంభానికి ముందే సమగ్ర భద్రతా సమీక్ష నిర్వహించి, ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరం

శబరిమల యాత్ర కేరళ రాష్ట్రానికే పరిమితమైనది కాదని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల భక్తుల విశ్వాసంతో ముడిపడి ఉన్న ఆధ్యాత్మిక యాత్ర అని డా. శ్రీనాథ్ పేర్కొన్నారు. అందువల్ల కేంద్ర రైల్వే, పర్యాటక, హోంశాఖలతో పాటు కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.యాత్రి కుల భద్రతను తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం చేయకుండా, దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

దక్షిణ రైల్వే పరిశీలనలో వినతి

డా. బూరగడ్డ శ్రీనాథ్ సమర్పించిన వినతికి కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో MORLY/E/2026/0062712 రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించారు. ఈ ఫిర్యాదు రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలో నమోదై, ప్రస్తుతం దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయం పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారిగా దక్షిణ రైల్వే అదనపు జనరల్ మేనేజర్ విపిన్ కుమార్ పేరు నమోదైంది.ఈ సందర్భంగా డా. శ్రీనాథ్ మాట్లాడుతూ, ప్రతి భక్తుడు సురక్షితంగా అయ్యప్ప స్వామిని దర్శించుకుని, క్షేమంగా తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు జాగ్రత్తలతో ప్రాణనష్టాన్ని నివారించడం ముఖ్యమని పేర్కొన్నారు.శబరిమల యాత్రికుల భద్రతను జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రజా భద్రతా అంశంగా పరిగణించి, తొక్కిసలా టలు, నివారించగల ప్రాణనష్టాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మచిలీపట్నం సత్యసాయి మందిరంలో విశ్వశాంతి కోసం అఖండ భజన



మచిలీపట్నం,ప్రజాభూమి ప్రతినిధి

విశ్వశాంతిని ఆకాంక్షిస్తూ ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అఖండ భజన కార్యక్రమం మచిలీపట్నం ఈడేపల్లిలోని శ్రీ సత్యసాయి మందిరంలో జరగనుంది. ఈ నెల రెండో శనివారం సాయంత్రం 6 గంట లకు అఖండ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమయ్యే ఈ భజన కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు 24 గంటల పాటు నిరంతరంగా కొనసాగనుంది.ప్రపంచ దేశాలన్నీ శాంతి, సుఖసంతోషాలతో వర్ధిల్లాలనే సంకల్పం తో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా పుట్టప ర్తిలోని ప్రశాంతి నిలయంలో అఖండ నామ సంకీర్తనకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ నెల రెండో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు 24 గంటల పాటు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈడేపల్లి సత్యసాయి మందిరంలో నిర్వహించే అఖండ భజనలో భక్తులు, వివిధ భజన కేంద్రాల సభ్యులు, బాలవికాస్ చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలని సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్, సమన్వయకర్త అనుమకొండ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి అనుగ్రహ ఆశీస్సులు పొందాలని సమితి విద్యా విభాగ సమన్వయకర్తలు పి. వరప్రసాద్, కళ్యాణి, ఆధ్యాత్మిక సమన్వయకర్తలు మల్లంపల్లి శ్రీనివాసరావు, ఎస్.బి.టి. సుందరి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.బి. రామ్మూర్తి, దారా సూర్యచంద్రరావు, తుర్లపాటి స్వరాజ్యలక్ష్మి, ఎస్. లక్ష్మీబాయి, మైలవరపు అనురాధ, కొట్టి నాగమణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొననున్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

శనివారం 14 నవంబర్ 2026

తాడిపూడి సర్పంచ్ అభ్యర్థిగా లింగంపల్లి అరవాలమ్మ

- అభ్యర్థిత్వానికి జనసేన నేతల సంపూర్ణ మద్దతు.. కూటమి పార్టీల ఏకగ్రీవ బలపరచడం

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి





తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా లింగంపల్లి సుధీర్ కుమార్ తల్లి లింగంపల్లి అరవాలమ్మ బరిలో నిలవనున్నారు. ఆమె అభ్యర్థిత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావు, తాడిపూడి గ్రామ జనసేన నాయకుడు కొలుకుల సత్యనారాయణ (పెద్దబ్బులు) వెల్లడించారు. అరవాలమ్మకు కూటమి పార్టీల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న సుధీర్ కుమార్, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కీలకపాత్ర పోషించారు. గ్రామంలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తూ, యువతను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు. యువతతో సత్సంబంధాలు కలిగి ఉండటంతో పాటు గ్రామ యువతకు అండగా నిలుస్తున్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. అలాగే సుధీర్ కుమార్ తండ్రి గతంలో సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబంగా గ్రామంలో గుర్తింపు ఉంది. సుధీర్ కుమార్ పార్టీ కోసం చేసిన కృషి, యువతలో ఉన్న ఆదరణ, కుటుంబానికి ఉన్న రాజకీయ అనుభవం అరవాలమ్మ అభ్యర్థిత్వానికి కలిసివస్తాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. కూటమి పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి అరవాలమ్మకు మద్దతు ప్రకటించడంతో ఆమె విజయంపై కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా కూటమి బలంతో ఎన్నికల బరిలో ముందుకు సాగుతామని వారు పేర్కొన్నారు.



మొక్కల పెంపకంతోనే
పర్యావరణ పరిరక్షణ సాధ్యం

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రావులపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం సుమారు 75 మొక్కలను నాటారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్. అరుణ్ కుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రావులపాలెం శాఖ అధ్యక్షుడు డాక్టర్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీ వరం మాట్లాడుతూ మనిషి మనుగడకు ప్రాణవాయువును అందించే మొక్కల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనకిరెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ నాగిరెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎన్. రెడ్డి, సంస్థ సభ్యులు గోపాలకృష్ణ, జగపతిరాజు, వెంకటపతి, అధ్యాపకులు నాగేశ్వరరావు, విజయ్, చిన్నబాబు, రాజేంద్ర, రజిని, శ్రీనివాస్, దుర్గాదేవి, రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుండి పురపాలక సంఘ ఎన్నికలకు
నామినేషన్ల స్వీకరణ

- మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుపురపాలక సంఘ ఎన్నికల లో పోటీ చేయు అభ్యర్థుల నుంచి ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉదయం 11గం. నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ లు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.


44 వార్డులకు సంబందించి మెప్మా భవనంలోనూ, చైర్పర్సన్ నామినేషన్లు ఇంజనీరింగ్ భవనంలోనూ స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.17 న పరిశీలన 19 న ఉపసంహారణ ఉదయం 11నుండి మధ్యాహ్నం 3గం. వరకు ఉంటుందని కమషనర్ తెలిపారు.

అదే రోజు అభ్యర్థులు జాబితా ప్రచురణ చేస్తామని తెలిపారు.26న ఎన్నికలు, 30న లెక్కింపు ఉంటుంది అని కమిషనర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రావులపాలెం విద్యార్థులు

- జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానాలు కైవసం
- 400, 200 మీటర్ల పరుగులో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపిక.

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట



అథ్లెటిక్స్ పోటీల్లో రావులపాలెం సంహిత కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అండర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో కొత్తపల్లి అవినాష్ 400 మీటర్ల పరుగు పందెంలో, పగిళ్ల యోద 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానాలు సాధించి విజేతలుగా నిలిచారు. వీరు కనబరిచిన ప్రతిభతో ఈ నెల 14వ తేదీ నుంచి పెదవేగిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. వీరిరువురూ రావులపాలెంలో ప్రముఖ అథ్లెటిక్స్ కోచ్ గుత్తుల త్రిమూర్తులు వద్ద శిక్షణ పొందుతున్నారు.

కోచ్ మార్గదర్శకత్వంలో క్రమశిక్షణతో సాధన చేస్తూ జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంపై సంహిత కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, కోచ్, స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేసి
నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- పురోగతిలో ఉన్న సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆయా మౌలిక వసతులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి
- పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తూ పనుల్లో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ



వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో పురోగతిలో ఉన్న సివిల్ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆయా మౌలిక వసతు లను ప్రజలకు అందుబా టులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో వివిధ ఇంజనీరింగ్ శాఖల జిల్లా స్థాయి అధికారులతో నిర్వహిం చిన సమీక్షా సమావేశం లో వివిధ ఇంజనీరింగ్ విభాగాలు మండలాల వారీ గా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా వివిధ శాఖల పరిధిలో చేపట్టిన నిర్మాణాలు,మరమ్మతులు, రహదారుల విస్తరణ, రహదారి భద్రతా చర్యలు, మౌలిక వసతుల కల్పన తదితర పనుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మొదటగా రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యం లో చేపట్టిన రహదారుల నిర్మాణాలు,మరమ్మతులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల పురోగతిని సమీక్షించారు. ఆయా పనులకు నిర్దిష్ట గడువులను నిర్ణయించి, ఎటువంటి జాప్యానికి తావులేకుండా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్‌డీబీ,సీఆర్ఐఎఫ్, సీఎస్ఆర్,డీఎంఎస్, నాబార్డు నిధులతో చేపట్టిన పనుల పురో గతిని సమీక్షిస్తూ,పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించు కోవాలన్నారు. సీఎస్ఆర్,డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన పనులను కూడా వేగవంతం చేసి ఆశించిన పురోగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యా సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాల యాల్లో వసతుల కల్పన, అదనపు తరగతి గదుల నిర్మాణాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, పీఎం శ్రీ పాఠశాల భవన నిర్మాణాల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతం గా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇంజనీర్లను ఆదేశించారు. జలవనరుల శాఖ పరిధిలో చేపట్టిన కార్యక్రమాలు, పంట కాలువలు, మురుగు కాలువల్లో పూడికతీత పనుల పురోగతిని సమీక్షించారు. వ్యవసాయ అవసరాలకు, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా ఆయా పనుల ను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. టెండర్ల దశలో ఉన్న పనులకు తక్షణమే టెండర్లు ఆహ్వానించి, డిసెంబర్ మొదటి వారంలో శంకుస్థాపనలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు.

అదేవిధంగా పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల్లో పెండింగ్ లో ఉన్న పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో వాటిని తక్షణమే పరిష్కరించు కోవాలని స్పష్టం చేశారు.

ఎన్నికల ఖర్చు బిల్లులుపై కలెక్టర్‌కి జనసేన కంప్లెంట్

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడు మునిసిపల్ ఎన్నికల్లో ఖర్చులు చేసినట్లుగా చూపిస్తూ నకిలీ బిల్లులు పెడుతున్న వాటి పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన నాయకులు ముత్యాల కామేష్ తదితరులు ఏలూరు జిల్లా కలెక్టర్ కి కంప్లెంట్ చేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన నూజివీడు పురపాలక సంఘ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుండి ఎన్నికల రోజు మరియు పోలింగ్ రోజున కలిపి సుమారు 26 లక్షల రూపాయలు వరకు భోజనాలు ఖర్చులు చేసినట్లుగా మున్సిపల్ ఫండ్స్ నుండి డ్రా చేస్తున్న మునిసిపల్ కమిషనర్ కూరపాటి పేరయ్య, మరియు మున్సిపల్ మేనేజర్ అప్పినేని వీర వెంకట నరసింహారావు (బుజ్జి)వ్యవహార శైలి పై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అసలు నూజివీడు మున్సిపాలిటీ తరపున పోలింగ్ రోజు నా గాని కౌంటింగ్ రోజు గానీ ఏ విధమైన సౌకర్యాలు కల్పించారో పోలింగ్ లో పాల్గొన్న అధికారులు , పోటీ చేసిన అభ్యర్థులు , వారి తరపున ఉన్న ఏజెంట్లను విచారించవలసిందిగా విన్నవించారు. అత్యంత నాసిరకమైన భోజనాన్ని ఏర్పాటు చేసి , అధికారుల ఆగ్రహానికి గురైన కమీషనర్ ఈ భోజనము ఏర్పాట్లకి సుమారు 26 లక్షల ఖర్చుపెట్టినట్టుగా చూపించడం అనేది అత్యంత బాధాకరమైన విషయం. అని వాపోయారు. అసలు కౌంటింగ్ రోజున మంచినీళ్లు దొరక్క అనేక ఇబ్బందులు గురైన విషయం మీ దృష్టిలో ఉన్నది. అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ఇండిపెండెంట్ పోటీదారులు, పాత్రికేయ మిత్రుల అభిప్రాయాలు కూడా సేకరించవలసిందిగా కోరుతున్నాంమని భోజనాలు సప్లై చేసిన కాంట్రాక్టర్లను, వ్యక్తులను విచారించి వాస్తవాలను ప్రజలకుతెలియజేయవల సిందిగా విజ్ఞప్తి చేస్తునట్లు జనసేన నాయకులు తెలిపారు.

ఏలూరు అభివృద్ధికి రూ.21 కోట్ల నిధులు

- ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా టీడీపీ అధ్యక్షులు,ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.ఏలూరు నగర అభివృద్ధి కోసం రూ.21 కోట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు మంజూరైనట్లు వెల్లడించారు.శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగర, పురపాలక, పరిషత్ ఎన్నికల్లో కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించిందన్నారు.రానున్న పల్లెపోరులోనూ కూటమి మద్దతుదారులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో సుహృద్భావ వాతావరణం కోసం స్థానిక నాయకులు కృషి చేయాలని సూచించారు.రూ.21 కోట్ల నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు,ఎన్నికల కోడ్ అడ్డంకులు లేకుంటే పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు.నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి మరడాని రంగారావు,ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, నాయకులు జుంజు మోజెస్,మల్లెపు రాము, త్రిపర్ణ రాజేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ ఏర్పాట్లను పరిశీలించిన పోలీసు అధికారులు



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ దుగ్గిరాల బాలరావమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ధర్మశాస్త్ర (అయ్యప్ప స్వామి) ఆలయాన్ని నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్, నూజివీడు గ్రామీణ పోలీసు వృత్తాధికారి ఐ.వి. నాగేంద్ర కుమార్, ఆగిరిపల్లి ఎస్సై బి. సురేష్ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం సందర్శించారు. శనివారం నిర్వహించనున్న అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ, జీవ ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో చేపట్టిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, వేడుకలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆలయ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఆర్యవైశ్య సంఘ నాయకుడు తాళ్లూరుకి జడ్పిటిసి కోర్స బాలకృష్ణ పరామర్శ



ప్రజాభూమి, బుట్టాయగూడెం

ఆర్యవైశ్య సంఘ నాయకుడు, వర్జీనియా పొగాకు రైతు తాళ్లూరు వెంకటేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో బుట్టాయగూడెం జడ్పిటిసి కోర్స బాలకృష్ణ పరామర్శించారు. ఏలూరు జిల్లా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు తాళ్లూరు ప్రసాద్ తండ్రి తాళ్లూరు వెంకటేశ్వరరావు శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న బుట్టాయిగూడెం జడ్పిటిసి కోర్స బాలకృష్ణ ముప్పినవారిగూడెంలోని బాధితుని స్వగృహంలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బానోతు కృష్ణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కో అప్షన్ సభ్యురాలిగా గోగినేని వెంకట శశిరేఖా!

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు



నూజివీడు మండలం, మండల ప్రాదేశిక కో ఆప్షన్ సభ్యురాలు గా గొల్లపల్లి గ్రామంకి చెందిన బీజేపీ క్రియాశీల సభ్యురాలు, సంఘ సేవకురాలు, చైర్మన్ జి ఎస్ ఎన్ ఫౌండేషన్ ఏలూరు , మాజీ సర్పంచ్ గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు, సతీమణి శ్రీమతి గోగినేని వెంకట శశిరేఖ కి అవకాశం కల్పించే అవకాశం ఉనట్లు విశ్వాస నీయ వర్గాల ద్వారా తెలిసింది. శ్రీమతి శశిరేఖ 2021లోజరిగిన ఎన్నికల్లో గొల్లపల్లి 1ఎంపీటీసీ బీజేపీ అభ్యర్థిని గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినా గత 8 సంవత్సరాల నుండి పార్టీ కి వెన్ను దన్నుగా ఉంటూ, అనేక మంది కి నియోజకవర్గ పరిధిలో విద్య వైద్య సేవలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వారి కుటుంబశీ గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థల దాతలు మరియు దానికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా మొన్న జరిగిన స్థానిక ఎన్నికల్లో బీజేపీ తరపున అభ్యర్థులను పోటీ చేయించారు. తరువాత పార్టీ నేతలు సూచన మేరకు నామినేషన్లు విరమింప చేసి కూటమి ఎన్నికల్లో సహరించారు. కూటమి ప్రభుత్వం మండల ప్రాదేశిక కో అప్షన్ సభ్యురాలుగా గోగినేని వెంకట శశిరేఖకి ఇవ్వడం అన్ని విధాలా సమంజసం అని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 14 నవంబర్ 2026




గ్రామ పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన డి.ఎస్.పి.

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా.

అగడాలలంక గ్రామ పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్. గ్రామ పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, నిర్వహణను పరిశీలించుటకు అగడాలలంక గ్రామం, భీమడోలు మండలం, భీమడోలు ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐ మదీనా భాష అగడాలలంక గ్రామంలోని జీపీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద కల్పించిన మూడంచెల భద్రత, బందోబస్తు ఏర్పాట్లను డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ క్షుణ్ణంగా పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రం లోపల ,బయల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భీమడోలు ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐ మదీనా భాష లతో సమీక్షించి, కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారుల రాకపోకల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఉద్రిక్తతలకు తావు లేకుండా, ఎన్నికల నిబంధనలకు లోబడి కౌంటింగ్ ప్రక్రియను సజావుగా ముగించేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని అధికారులు సిబ్బందిని డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ ఆదేశించారు.

కాజులూరులో పంచాయతీ ఎన్నికల తేదీ మార్పు

- మొదటి విడతకు బదులు రెండవ విడతలోకి
- 18 న నామినేషన్లు స్వీకరణ
- 29 న ఎన్నికలు అదేరోజు పలితాలు వెల్లడి



ప్రజాభూమి ప్రతినిధి కాజులూరు

కాజులూరు మండల పరిధిలో గల గ్రామ పంచాయతీలకు మొదటి విడతకు బదులు రెండవ విడతలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదట తోలి విడత ఎన్నికలలో భాగంగా కాజులూరు మండల గ్రామాలలో ఈ నెల 15 వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించి ఈ నెల 26 వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్టు అధికారులు ప్రకటించారు. అయితే అదే రోజు కాకినాడ కార్పోరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నియోజకవరంలోని రామచంద్ర పురం, కే గంగవరం మండలాల్లో రెండవ విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగనుండటంతో కాజులూరు మండల పరిధిలో ఎన్నికలను రెండవ విడతకు మార్పు చేసారు.దీంతో మండల పరిధిలో 26 గ్రామ పంచాయతీలకు, ఈ నెల 18 వ తేదీ నుంచి 21 వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ స్క్రూట్ ని తరువాత 24 వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం ఉంది. 29వ తేదిన ఎన్నికలు నిర్వహించి అదేరోజు పలితాలు వెల్లడిస్తారు.

ఏకగ్రీవ పంచాయతీలకు భారీ ప్రోత్సాహకాలు



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలన్నీ ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు అందించే ప్రోత్సాహక మొత్తాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. 2026 గ్రామ పంచాయతీ ఎన్నికలకు మాత్రమే ఈ పెంపు వర్తిస్తుందని పేర్కొన్నారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10 వేల జనాభా ఉన్న పంచాయతీలకు రూ.25 లక్షలు, 10 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షలు ప్రోత్సాహకంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల అధికారులు అన్ని పదవులకూ ఏకగ్రీవ ఎన్నికను అధికారికంగా ప్రకటించిన పంచాయతీలకే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందని, అర్హతను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం నిధులను దశలవారీగా విడుదల చేస్తామని తెలిపారు. ఈ మొత్తాన్ని గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులకే వినియోగించాలని స్పష్టం చేశారు.

విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్‌పై వైద్య విద్యార్థిని దాడి

- బాధితురాలి ఫిర్యాదు పై కేసు నమోదు చేసిన ఏలూరు రూరల్ పోలీసులు

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా.

విధి నిర్వహణలో ఉన్న ఏపీఎస్ఆర్టీసీ కండక్టర్ పై వైద్య విద్యార్థి అమానుషంగా దాడి చేసిన సంఘటనలో బాధితురాలు తీవ్ర గాయాలపాలయ్యింది. ఏలూరు కొత్త బస్టాండ్ నుంచి భీమవరం ఏపీఎస్ఆర్టీసీ బస్సు వెళుతున్న క్రమంలో ఏలూరు రూరల్ ప్రాంతమైన మాదేపల్లి గ్రామం చేరుకునే సమయంలో బస్సులో ఉంచిన లగేజీ ఒక్కసారిగా కండక్టర్ మీద పడిన సంఘటనపై బస్సులో ప్రయాణిస్తున్న వైద్య విద్యార్థి బాధితురాలు ఇరువురు కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో వైద్య విద్యార్థి విచక్షణ రహితంగా తనపై దాడి చేసినట్లు మహిళా కండక్టర్ లక్ష్మి ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు నుంచి ఫిర్యాదు స్వీకరించిన ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం

ప్రతిరోజు వందలాదిమంది ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తున్న ఆర్టీసీ సిబ్బందిపై చిన్నపాటి వివాదాలకే దాడులకు దిగి వారిపై విసక్షణారహితంగా దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని స్థానిక ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న తమ తోటి కండక్టర్ పై వైద్య విద్యార్థి అమానుషంగా దాడి చేయటం



హర్షించదగ్గ విషయం కాదని సదరు విద్యార్థిపై పోలీసులు విచారణ చేపట్టి బాధితురాలికి తగిన న్యాయం చేయాలని తోటి ఉద్యోగస్తులు కోరుకుంటున్నారు. విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బందిపై ఇటువంటి దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు కోరుకుంటున్నారు. ప్రమాదంలో గాయపడిన కండక్టర్ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

నాగేంద్రునికి పాలాభిషేకాలు.. భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

- పుట్టల వద్ద ప్రత్యేక పూజలు.. బాలరావమ్మ ఆలయంలో పోటెత్తిన భక్తజనం



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లి మండల వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగేంద్రునికి పూజలు నిర్వహించారు. వేకువజామునే మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని పుట్టల వద్దకు చేరుకుని పుట్టలో కొలువై ఉన్న నాగేంద్రునికి ఆవుపాలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. హిందూ సంప్రదాయంలో నాగుల చవితికి విశేష ప్రాధాన్యత ఉంది. సర్పజాతిని నాగదేవతా స్వరూపంగా భావించి పూజించడం, కుటుంబ క్షేమం, సంతాన సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని నాగేంద్రుని వేడుకోవడం ఈ పర్వదినం విశిష్టత. ఈ సందర్భంగా ఆగిరిపల్లి గ్రామంలోని శ్రీ దుగ్గిరాల బాలరావమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న నాగేంద్రస్వామి సన్నిధి భక్తులతో సందడిగా మారింది. భక్తులు పుట్ట వద్దకు చేరుకుని ఆవుపాలు, పండ్లు సమర్పించి నాగేంద్రునికి భక్తిపూర్వకంగా పూజలు నిర్వహించారు. 'నాగేంద్రహారాయ నమః' అనే మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం శ్రీ బాలరావమ్మ అమ్మవారిని దర్శించుకుని పాలు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. నాగదేవత అనుగ్రహంతో తమ కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని, సర్వశుభాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంలో నాగుల చవితి పర్వదినాన్ని జరుపుకున్నారు.

తుఫాన్ నష్టాన్ని పరిశీలిస్తున్న అంతర్- మంత్రిత్వ శాఖ కేంద్ర బృందం



ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

మురసు తుఫాను కారణంగా ఏలూరు జిల్లాలో జరిగిన నష్టాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని ఏలూరు జిల్లాలో తుఫాను నష్టాల పరిశీలనపై కేంద్ర ప్రభుత్వం నియమించిన అంతర్ –మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం చైర్మన్ అలోక్ జవహర్ చెప్పారు. నిడమర్రు మండలం అడవికొలను గ్రామంలో మురసు తుఫాన్ కారణంగా ఏర్పడిన పంట నష్టాలను శుక్రవారం కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్న అలోక్ జవహర్ ఆధ్వర్యంలోని కేంద్ర బృందం శుక్రవారం పరిశీలించింది. అనంతరం రైతులతో మాట్లాడి తుఫాను కారణంగా వారికి జరిగిన పంట నష్టాలను అక్కడకు వచ్చిన ప్రతీ రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం చైర్మన్ జవహర్ మాట్లాడుతూ మురసు తుఫాన్ కారణంగా జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలు, వివిధ శాఖలకు జరిగిన నష్టాలను పరిశీలించామని, వీటిపై సవివర నివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందిస్తామన్నారు. తుఫాన్, ప్రకృతి వైపరీత్యాలపై రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలనీ, వరద నీరు పంటపొలాల్లో నిలిచి ఉండకుండా ఇరిగేషన్ శాఖ వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలనీ సూచించారు. . ఈ సందర్భంగా అక్కడి రైతులు కేంద్ర బృందానికి తమకు కలిగిన పంట నష్టాలను తెలియజేస్తూ, మురసు తుఫాన్ కారణంగా తాము పంటనంతా నష్టపోయామని, వారం రోజులైనప్పటికీ తమ పొలాల్లో వరద నీరు కిందకు వెళ్లలేదని తెలిపారు. కింద ప్రాంతంలోని కొల్లేరు నీరు వెనక్కి రావడంతో తమ పొలాల్లోని వరదనీరు కిందకు వెళ్లే పరిస్థితి లేదని, రైతులు తాము వేసిన పంట మొత్తాన్ని కోల్పోయారని ఆ ప్రాంత రైతు ప్రతినిధి పైడికొండల శివాజీ బృందం దృష్టికి తీసుకువచ్చి, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాల్సిందిగా కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేయవలసిందిగా కోరారు. హైదరాబాద్ కు చెందిన ఇస్రో ఆధ్వర్యంలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సైంటిస్ట్ డా. ఎస్.వి.ఎస్.పి . శర్మ, హైదరాబాద్ లోని సెంట్రల్ వాటర్ కమిషన్ ఎస్ఈ రేఖ రాణి కొల్లు , విజయవాడలోని రవాణా, జాతీయరహదారుల శాఖ ప్రాతీయ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శశాంక్ శేఖర్ రాజ్ బృందంలో సభ్యులుగా ఉన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, ట్రాన్స్కో, పంచాయతీరాజ్, ఇరిగేషన్, రహదారులు, భవనాల శాఖల ఎస్ఈ లు కె. ఎం. అంబేద్కర్ , జెడ్. రమేష్, గుణకనకారావు, విజయరత్నం, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవనాలు శాఖ డిడి సాజానాయక్, గృహ నిర్మాణ శాఖ పిడి సత్యనారాయణ, ప్రభృతులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంలో ధర్మశాస్త్ర స్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలోని శ్రీ దుర్గిరాల బాలరావమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ధర్మశాస్త్ర స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు గణపతి హోమం, మృత్యుంజయ హోమం, సుదర్శన హోమం, భగవత సేవ, ప్రసాద శుద్ధి, బింబ శుద్ధి, గోపికా బంధనం, విగ్రహ జలవాసనం తదితర పూజా కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. శనివారం ఉదయం 5.30 గంటలకు గణపతి హోమం, కలశ పూజ, కలశ ఉద్వాటన, ఉదయం 11.44 నుంచి మధ్యాహ్నం 12.27 గంటల వరకు అభిజిత్ కుంభాభిషేకం, సాయంత్రం దీపారాధన, పడిపూజ, అధాల పూజ, రాత్రి హరివరాసనం నిర్వహించనున్నారు. ముఖ్యంగా శనివారం ఉదయం 11 గంటలకు అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం 12 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరగనున్నాయి. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పవిత్ర ప్రతిష్ఠా మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఆలయ నిర్మాణ దాతలు దేవా గణేష్ స్వామి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఆహ్వానం పలికారు. అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.



డిగ్రీ కళాశాలలో ఫోక్సో చట్టంపై అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు, ముఖ్యంగా యువతులు తమ హక్కులను తెలుసుకోవాలని, సురక్షితంగా ఉండాలని కోరారు. ముఖ్య అతిథులుగా రామచంద్రపురం జిల్లా సీనియర్ న్యాయవాదులు రామచంద్ర రావు, పి. వి. ఎస్. జానకి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్ర రావు మాట్లాడుతూ, చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులను నిరోధించడానికి 2012లో కేంద్ర ప్రభుత్వం ఫోక్సో చట్టాన్ని తీసుకొచ్చిందని, బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పి. వి. ఎస్. జానకి మాట్లాడుతూ, బాలికలు తమపై జరిగే వేధింపులను ధైర్యంగా చెప్పాలని, మౌనంగా ఉండకూడదని, చట్టం వారికి పూర్తి రక్షణ కల్పిస్తుందని సూచించారు.రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు కే. రవి బాబు, ఎన్ సుజాత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసంర్భంగా వీరు మాట్లాడుతూ, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో జరిగే అన్యాయాలపై స్పందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.దుర్గారావు, జె రాజేష్ 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ 43వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



ప్రజాభూమి ఏలూరు

ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 43వ జాతీయ మహాసభలు నవంబర్ 22 నుంచి 26 వరకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరగనున్నాయని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే తెలిపారు. 1920 అక్టోబర్ 31న లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఏర్పడిన ఏఐటీయూసీ, 106 ఏళ్లుగా కార్మిక హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. కార్మికులు సాధించుకున్న హక్కులు,చట్టాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్లను వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ,కార్మిక హక్కుల రక్షణ కోసం జాతీయ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.మహాసభలను విజయవంతం చేయడానికి ఉద్యోగులు,కార్మికులు, కార్మిక వర్గ శ్రేయోభిలాషులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బాలల దినోత్సవము



ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు

నూజీవీడు మండలము అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నవంబర్ 14 బాలలదినోత్సవము సంధర్భముగా శుక్రవారం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలునిర్వహించడమైనదని పాఠశాల ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర తెలిపారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్ విభాగంలో ప్రధమబహుమతి రోహిత్ కుమార్ సాధించినాడు. డ్రాయింగ్ పోటీల్లో ప్రధమ బహుమతి హారిక,ద్వితీయ బహుమతి ధనశ్రీ, త్రుతీయ బహుమతి తేజశ్రీ సాధించారు.సీనియర్ విభాగంలో వ్యాస రచనలో ప్రధమ బహుమతి మోక్షిత,ద్వితీయబహుమతి తేజశ్రీ ,త్రుతీయబహుమతి శివశంకర్.డ్రాయింగ్ పోటీల్లో ప్రధమ బహుమతి అఖిల, ద్వితీయ బహుమతి గణేష్, త్రుతీయ బహుమతి మహేశ్వరి సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీఉపాధ్యాయులు నాగరాజు, ఫిలోమిన, జయకుమారి, దుర్గామల్లేశ్వరరావు, శ్రీమంగలక్ష్మి, వెంకటరమణ, రాజేంద్రప్రసాద్, భోగిప్రసాద్ పాల్గొన్నారు. న్యాయనిర్ణేతగా సోషల్ ఉపాధ్యా యని జయకుమారి వ్యవహరించారు.

ప్రజాభూమి

జనరల్ 15

శనివారం 14 నవంబరు 2026

నవంబర్ 25లోపు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

- సొసైటీ చైర్మన్ బూర్లె హరిబాబు

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎ స్) ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అడ్డతీగల మండల సొసైటీ చైర్మన్ బూర్లె హరిబాబు సూచించారు. అడ్డతీగల మండల పరిధిలో ఇప్పటికే పీఏసీఎస్ ఓటు హక్కు కలిగిన రైతులందరూ నవంబర్ 25వ తేదీ లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు. ఇందుకోసం సొసైటీ ఖాతాదారులు తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధా నమైన మొబైల్ ఫోన్‌తో సొసైటీ కార్యాలయానికి రావాలని తెలిపారు. కార్యాలయానికి వ్యక్తిగ తంగా రాలేని వారు ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీ పీ) ద్వారా కూడా ఈ-కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం ఉందని వివరించారు.ఈ-కేవైసీ ప్రక్రియకు సంబంధించి మరిన్ని వివరాల కోసం అడ్డతీగల మండల సొసైటీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రతి ఖాతాదారుడు గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకుని, రాబోయే సొసైటీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ బూర్లె హరిబాబు విజ్ఞప్తి చేశారు.

పోలవరం జిల్లాలో
రెండు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

నవంబర్ 26, 29 తేదీల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలోని 12 మండలాల పరిధిలో ఉన్న 186 గ్రామ పంచాయతీలకు రెండవ సాధారణ ఎన్నికలు-2026ను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 1,734 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 2,78,545 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. మొదటి దశ ఎన్నికలు నవంబర్ 26న, రెండవ దశ ఎన్నికలు నవంబర్ 29న నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రెండు దశల్లోనూ పోలింగ్ ముగిసిన అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగు, అనంతరం 2 గంటల నుంచి కౌంటింగ్ అదే పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు.మొదటి దశ నవంబర్ 26 న 5 మండలాల్లో అడ్డతీగల (22), దేవీపట్నం (14), గంగవరం (17), రాజమ్మంగి (19), రంపచోడవరం (19) గ్రామాల్లో మొత్తం 91 గ్రామ పంచాయతీ లలో పోలింగు నిర్వహించనున్నట్లు తెలిపారు.అదే విధంగా రెండవ ద నవంబర్ 29 న ఏడు మండలాల్లో గుర్తేడు (5) , వై.రామవరం (12) , చింతూరు (18) , మారేడుమిల్లి (12) , కూనవరం (16) , వి.ఆర్. పురం (11) , ఏటపాక (21) గ్రామాల్లో మొత్తం 95 గ్రామ పంచాయతీ లలో పోలింగు నిర్వహించనున్నట్లు తెలిపారు.మొదటి దశలో భాగంగా నవంబర్ 13న రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. నవంబర్ 15న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల ప్రకటన విడుదల చేస్తారని తెలిపారు. నవంబర్ 17వ తేదీ నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ కాగా, నవంబర్ 18న నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారని పేర్కొన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై నవంబర్ 19న అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, నవంబర్ 20న అప్పీళ్ల పరిష్కారం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు నవంబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారని, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారని వెల్లడించారు. నవంబర్ 26న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండవ దశలో భాగంగా నవంబర్ 16న రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుండగా, నవంబర్ 18న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల ప్రకటన విడుదల చేస్తారని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 20వ తేదీ నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీగా, నవంబర్ 21న నామినేషన్ల పరిశీలనగా నిర్ణయించారని పేర్కొన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై నవంబర్ 22న అప్పీల్ చేసుకోవచ్చని, నవంబర్ 23న అప్పీళ్ల పరిష్కారం ఉంటుందని తెలిపారు. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు నవంబర్ 24 చివరి తేదీ కాగా, అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారని వెల్లడించారు. నవంబర్ 29న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ తెలిపారు

600 ఓట్ల భారీ మెజారిటీతో
గొంది చంద్రయ్య ఘన విజయం.. అభినందనల వెల్లువ!

- బీసీ కాలనీ మహిళల ఆధ్వర్యంలో ఘన సత్కారం.. శాలువా కప్పి, స్వీట్లు తినిపించి సంబరాలు
- ఓటర్లకు కూటమి నాయకుల కృతజ్ఞతలు.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న చంద్రయ్య

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం





వి.ఆర్.పురం మండలం వడ్డిగూడెం ఎంపీటీసీ స్థానంలో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గొంది చంద్రయ్య 600 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని, అభిమానాన్ని ఈ విజయం ప్రతిబింబిస్తోందని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందుకున్న చంద్రయ్యకు గ్రామంలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా వడ్డిగూడెంలోని బీసీ కాలనీ మహిళలు ప్రత్యేకంగా ఆనందం వ్యక్తం చేస్తూ గొంది చంద్రయ్యను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. స్వీట్లు తినిపించి తమ అభిమానం, ఆప్యాయతను చాటుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సాహాన్ని పంచుకున్నారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ ఆధ్వర్యంలో కూటమి ముఖ్య నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వడ్డిగూడెం ఎంపీటీసీ అభ్యర్థిగా గొంది చంద్రయ్యను అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్క ఓటరుకు శతకోటి వందనాలు తెలియజేశారు. ప్రజలు చూపిన ఆదరణ, అభిమానాన్ని ఎప్పటికీ మరచిపోమని, ఇదే విధమైన సహకారం భవిష్యత్తులోనూ అందించాలని కోరారు. ఈ సందర్భంగా విజయం సాధించిన గొంది చంద్రయ్య మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి, భారీ మెజారిటీతో గెలిపించిన వడ్డిగూడెం ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం తన ఒక్కడిదే కాదని, తనకు అండగా నిలిచిన కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, గ్రామ ప్రజలందరిదని అన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల ఆదరణే తనకు కొండంత బలమని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం ప్రజాసేవలో ముందుంటానని చంద్రయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముత్యాల రామారావు, బొర్రా నరసింహారావు, బీరాపు ప్రకాశరావు, బొర్రా ఆదినారాయణ, పట్టి సత్యనారాయణ, ముత్యాల జలబాబు, బింగి విష్ణు, సర్పాజ్, బొర్రా సూరి, కడుపు రాజు, కడుపు రమణయ్య, అంజన్నావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్ క్యాంప్ కోర్టుకు
పూర్తి రికార్డులతో అధికారులు హాజరుకావాలి

- నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో నెలవారీ క్యాంప్ కోర్టు
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న నెలవారీ క్యాంప్ కోర్టుకు పోలవరం జిల్లాకు చెందిన సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో, అవసరమైన రికార్డులతో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. పై తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాజమహేంద్రవరం లోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ క్యాంప్ కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పోలవరం జిల్లాలను కలుపుకొని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ప్రతి నెల మూడవ వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు రాజమహేంద్రవరంలో నెలవారీ క్యాంప్ కోర్టు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలవరం జిల్లా లోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి మానవ హక్కుల కమిషన్ ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటికి సంబంధించిన పూర్తి వివరాలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. క్యాంప్ కోర్టు నిర్వహణ సమయంలో అవసరమైనప్పుడు సంబంధిత అధికారులు స్వయంగా హాజరై కేసుల పూర్వాపరాలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన వివరాలను కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించారు. కమిషన్‌కు సమర్పించాల్సిన పూర్తి రికార్డులు, సంబంధిత నివేదికలు, వివరణలు, వ్యాఖ్యలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని, అవసరమైన సమాచారాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు.ఈ మేరకు సంబంధిత జిల్లా స్థాయి అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాల అధికారుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మానవ హక్కుల కమిషన్ విచారణకు సంబంధించిన అంశాల్లో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, నిర్దేశించిన సమయానికి పూర్తి సమాచారంతో హాజరుకావాలని, కమిషన్ జారీ చేసే ఆదేశాలను సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.నాలుగు జిల్లాలకు సంబంధించిన మానవ హక్కుల కమిషన్ క్యాంప్ కోర్టు వ్యవహారాల సమన్వయం కోసం తూర్పు గోదావరి జిల్లా రంగంపేట తహసీల్దార్ పి.హెచ్.జి.ఆర్. పాపారావును లైజన్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. పోలవరం జిల్లాతో పాటు సంబంధిత జిల్లాల శాఖల అధికారులు లైజన్ అధికారితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సమాచారాన్ని, రికార్డులను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు

కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- 66 వార్డులకు సంబంధించి 306 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు చర్యలు
- ఈ నెల 26న పోలింగ్.. 30వ తేదీన ఓట్ల లెక్కింపు.
- రంగరాయ మెడికల్ కాలేజీలో రిసెప్షన్ సెంటర్,స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాట్ల పరిశీలన
- నగరపాలక సంస్థ పరిధి లోని ఓటర్లు స్వచ్ఛందం గా తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్ల ను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానికరంగరాయ మెడికల్ కాలేజీలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేయనున్న రిసెప్షన్ సెంటర్,స్ట్రాంగ్ రూమ్,కౌంటింగ్ హాల్ లకు సంబంధించిన వసతులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల ను అధికార యంత్రాంగం వేగవంతం చేసిందన్నారు.నగరంలోని మొత్తం 66 వార్డులకు సంబంధించి 306 పోలిం గ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ కు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 26వ తేదీన పోలింగ్ నిర్వహించ నున్నామని,30వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ఇతర వసతులను ముందుగానే సిద్ధం చేయాలని అధికా రులకు సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను స్థానిక రంగరాయ మెడి కల్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించనున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రం,బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను కాకినాడ ఆర్డీవో, నగరపాలక సంస్థ కమిషనర్‌లతో కలిసి పరిశీలించారు.

కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు,బ్యాలెట్ బాక్సుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు,నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియలో ఎటు వంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయం తో పనిచేయాలని,ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎన్నికలను విజయవంతంగా నిర్వ హించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన దని పేర్కొంటూ, కాకినాడ నగరపాలక సంస్థ పరిధి లోని ప్రజలందరూ ఎన్నికల్లో స్వచ్ఛందంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయడం ద్వారా అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యేలా సహకరించాలని నగరవాసులకు పిలుపునిచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో తుఫాన్లను తట్టుకున్న పంటలు

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్
- రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా సాగు చేసిన పంటల్లో మెరుగైన స్థిరత్వం
- ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు అలవర్చుకోవాలి - రైతులకు కలెక్టర్ సూచన

ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం





ప్రకృతి వ్యవసాయ విధానాలతో సాగు చేసిన పంటలు ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం సమర్థవంతంగా తట్టుకొని నిలబడుతున్నాయని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల సంభవించిన చెవుడు దెబ్బలు, అర్నబ్, ముసురు తుఫానుల ప్రభావం నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు శుక్రవారం వై.రామవరం మండలంలోని కానతలబంధ, చవిటిదిబ్బలు గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు.ఈ సందర్భంగా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మినుము, వరి, మొక్కజొన్న తదితర పంటలను కలెక్టర్ పరిశీలించారు. తుఫానులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పటికీ పంటలకు గణనీయమైన నష్టం వాటిల్లకపోవడం, పంటలు ఆరోగ్యంగా ఉండటాన్ని గమనించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరించడం వల్ల పంటల్లో ఏర్పడుతున్న మార్పులు, వాతావరణ ప్రతికూలతలను తట్టుకునే సామర్థ్యంపై రైతులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు తమ అనుభవాలను కలెక్టర్‌తో పంచుకుంటూ, రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా స్థానికంగా అందుబాటులో ఉండే సహజ వనరులతో తయారుచేసిన కషాయాలు, ద్రావణాలు, ఇతర ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ పంటలు సాగు చేస్తున్నట్లు వివరించారు. ఇటీవల రెండు తుఫానుల ప్రభావం ఉన్నప్పటికీ తమ పంటలు నిలకడగా ఉండటంతో పాటు మంచి దిగుబడులు అందించే స్థితిలో ఉన్నాయని తెలిపారు.రైతుల అనుభవాలను ఆసక్తిగా తెలుసుకున్న కలెక్టర్ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని, పంటల నాణ్యతను కాపాడుకోవడానికి ప్రకృతి వ్యవసాయ విధానాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి రైతు క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, ఈ విధానాలపై ఇతర రైతులకు కూడా అవగాహన కల్పించి విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు.

బీఆర్‌సీ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల పరిశీలన

అనంతరం పూజారి శిరీష నిర్వహిస్తున్న బీఆర్‌సీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ తయారుచేస్తున్న వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ కషాయాలు, ద్రావణాలు, గ్రోత్ ప్రమోటర్లు, కిచెన్ గార్డెన్ విత్తనాలను పరిశీలించారు. వాటి తయారీ విధానం, వినియోగం, రైతులకు అందిస్తున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేశీయ విత్తనాల ప్రదర్శనను సందర్శించి, సంప్రదాయ విత్తన రకాల పరిరక్షణ, వాటి వినియోగం, ప్రాధాన్యతపై ఆరా తీశారు.

ఐదు ఎకరాల సీడ్ ప్లాట్ సందర్శన

గ్రామంలో ఏర్పాటు చేసిన ఐదు ఎకరాల సీడ్ ప్లాట్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. దేశీయ విత్తనాల ఉత్పత్తి, విత్తనాల సేకరణ, సంరక్షణ, భవిష్యత్తులో రైతులకు నాణ్యమైన స్థానిక విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశాలను అధికారులతో చర్చించారు. స్థానిక విత్తన సంపదను కాపాడుకోవడంతో పాటు రైతులు స్వయంగా విత్తనాలను ఉత్పత్తి చేసుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు.ప్రకృతి వ్యవసాయ పద్ధతులు కేవలం సాగు విధానంలో మార్పు మాత్రమే కాకుండా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటల స్థిరత్వాన్ని పెంపొందించేందుకు, రైతులకు సాగులో భరోసా కల్పించేందుకు దోహదపడతాయని ఈ క్షేత్ర సందర్శన ద్వారా స్పష్టమవుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతుల ప్రత్యక్ష అనుభవాలను ఇతర ప్రాంతాల రైతులకు కూడా తెలియజేస్తూ ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం రాజెన్ సుదర్శన్, ఏడీఏ సావిత్రి, మండల వ్యవసాయ అధికారి సుజాత, గ్రామ వ్యవసాయ సహాయకులు , గ్రామ ఉద్యాన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, సంబంధిత అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.